సూర్య
18వ వసంతంలోకి ...
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...


☞ APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.

సంపుటి 18 | సంచిక 142
శుక్రవారం | 14 మార్చి 2025 | విజయవాడ | పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, ఫాల్గుణమాసం శుద్ధ. హోళీ పూర్ణిమ ఉ.11.25, ఉత్తరా పూర్తి, వర్జ్యం మ.1.34 నుంచి 3.18 వరకు
రాహుకాలం ఉ.10.30 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం ఉ.8.39 నుంచి 9.26 వరకు తిరిగి మ.12.34 నుంచి 1.21 వరకు



## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు

● 200 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ ● 73 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ ● నష్టపోయిన జొమాటో, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు ● లాభపడ్డ ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ

5 లో

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

● ఉదయం 9:29 గంటలకు మొదలై మధ్యాహ్నం 3:39 గంటల వరకు ● దాదాపు 6 గంటల పాటు గ్రహణ దశ ● భారత్‌లో ఈ గ్రహణ స్థితి కనిపించదు



6 లో

## ఆత్మగౌరవమే మా ప్రాణం



6 లో

● హక్కులను హరిస్తే ఊరుకోం ● ఆ కాషాయ విద్యావిధానాన్ని అంగీకరించం ● తిరువళ్లూరు సభలో సీఎం స్టాలిన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విద్యావిధానం ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచేది కాదని, అది పూర్తిగా కాషాయ విద్యావిధానమని, అందుకే దానిని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి సుస్పష్టంగా ప్రకటించారు.

## 2019-24 మధ్య విద్యుత్ రంగానికి

# చీకటి రోజులు

● గత ప్రభుత్వం విధ్వంసం చేసిన విద్యుత్ రంగాన్ని 9 నెలల్లో గాడిన పెట్టాం ● సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ప్రతి ఒక్కరూ ఆదాయం పొందే విధానాన్ని తీసుకొస్తాం ● యూనిట్ విద్యుత్ కొనుగోలు ధర రూ.5.16 నుంచి రూ.4.80కి తగ్గించేందుకు ప్రయత్నం ● 1998లో తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలో ఆ రంగాన్ని నిలబెట్టాయి ● ప్రతి నియోజకవర్గంలో 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటు...పీఎం కుసుమ్ కింద 4 లక్షల పంపుసెట్లు ● రాబోయే నాలుగేళ్లలో విద్యుత్ ఛార్జీలు పెంచం ● శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు



2 లో

గత ప్రభుత్వం విధ్వంసం చేసిన విద్యుత్ రంగాన్ని 9 నెలల్లోనే గాడిన పెట్టాం. గత పాలకుల విధ్వంసం వల్ల ఆ రంగంలో వ్యవస్థలో అంతుబట్టని సమస్యలు ఉన్నాయి. 30 ఏళ్లుగా నా మనసుకు దగ్గరగా ఉండే విభాగం ఇంధనరంగం. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చిన ఘనత టీడీపీదే. క్లీన్ ఎనర్జీ పాలసీ ప్రకటించాక రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబం ధించి ఎంఓయూలు కుదుర్చుకున్నాం. దీని ద్వారా రాష్ట్రం లోని 3.66 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. రాబోయే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యం.

## మైక్రోసాఫ్ట్‌తో

# కీలక ఒప్పందం

● ఎఐ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో 2 లక్షల మందికి శిక్షణ ● మంత్రి లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్, ఏపిఎస్ఎస్‌డి నడుమ అవగాహన



2 లో

రాష్ట్రంలోని యువతకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ), అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాభివృద్ధి కోసం అంతర్జాతీయస్థాయి ప్రఖ్యాత సంస్థ మైక్రోసాఫ్ట్ తో ఎపి ప్రభుత్వం కీలకమైన ఒప్పందం చేసుకుంది. అమరావతి సచివాలయంలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులు ఎంఓయుపై సంతకాలు చేశారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 4వ ఎస్ఐపీబీ సమావేశం

● రూ.1,21,659 కోట్లు పెట్టుబడులకు ఆమోదం ● 10 కొత్త ప్రాజెక్టుల ద్వారా 80,104 మందికి ఉద్యోగాలు ● వివిధ సంస్థల పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిపై ట్రాకింగ్ ● 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు... ముందుగా 26 జిల్లాల్లో ఏర్పాటు ● నెల రోజుల్లో రాష్ట్రంలో ఐదు చోట్ల 5 రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలు ● ఎస్ఐపిబి సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం



3 లో

## మహిళా ఎస్సై పట్ల ఆకతాయిల దాడి ఘటన



● విజయనగరం జిల్లాలో ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం ● హద్దులు మీరి ప్రవర్తించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటాం ● నృత్యం చేస్తున్న మహిళలపై తాగుబోతుల అసభ్య ప్రవర్తన

వివరాలు-3లో

## 2030 నాటికి మూడు వేల టన్నుల

# ఎగుమతే లక్ష్యం



● ఆంధ్రప్రదేశ్‌లో మొదటిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేసింది టీడీపీనే ● రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్లతో రైతులకు లబ్ధి ● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

వివరాలు-2లో

## నాగం గారూ.... ఎలా ఉన్నారు?




2 లో

తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి ఎపి సిఎం చంద్ర బాబును ఎపి అసెంబ్లీలో కలిశారు. చాలాకాలం తరు వాత తనను కలిసిన నాగంను సీఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. నాగం గారూ...ఎలా ఉన్నారు....ఆరోగ్యం ఎలా ఉంది...చాలా రోజులు అయ్యింది కలిసి అంటూ పలకరించారు. పిల్లలు ఏం చేస్తున్నారు అని ఆరా తీశారు.

## తెలుగు సాహిత్య రంగంలో మొల్లది ఒక అపూర్వ అధ్యాయం

● కవిత్వంలో అపారమైన ఖ్యాతి కవయిత్రి మొల్ల సొంతమని పేర్కొన్న మంత్రి ● కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన మంత్రి దుర్గేష్

## అంతా ఇంతే!



రంగులు చల్లడానికి కూడా డ్రోన్ టెక్నాలజీ వాడదాం సార్

## బలూచిస్తాన్ ట్రైన్ హైజాక్ వెనక భారత్ హస్తం



6 లో

● పాకిస్తాన్ సంచలన ఆరోపణలు ● ఆఫ్ఘన్ నుంచి బీఎల్‌ఏకి సాయం చేస్తున్నారని వాదన

పాకిస్తాన్‌లోని అతిపెద్ద ప్రావిన్స్ బెలూచిస్తాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్‌కి గురైంది. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న రైలుని బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ఫైటర్స్ హైజాక్ చేశారు.

## తొలగించిన పెన్షన్లు 14 వేలే



● మండలిలో తేల్చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● వైసీపీ ఆరోపణలు వాస్తవం కాదు

వివరాలు-2లో

## పోసానికి 26 వరకు రిమాండ్

● గుంటూరు సబ్ జైలుకు పోసాని ● జడ్జి ముందు కన్నీటి పర్యంతమైన పోసాని



వివరాలు-3లో

## కూర్చుని మాట్లాడుకుందాం



6 లో

● అమెరికాతో ట్రేడ్ వార్‌పై చైనా వ్యాఖ్య ● వాణిజ్య ఉద్రిక్తతలను చర్చలతో పరిష్కరించుకుందామని పిలుపు

వివరాలు-6లో

## సెకీ ఒప్పందాలపై

# అధ్యయన కమిటీ

● కమిటీ నివేదికను ఆధారంగా చేసుకుని నిర్ణయం ● ఈ ఒప్పందం వలన పోలవరం ప్రాజెక్టులో ఆగిపోయిన జల విద్యుత్ ఉత్పత్తి ● అసెంబ్లీ వేదికగా చంద్రబాబు కీలక నిర్ణయం

జగన్ సెకీతో చేసుకున్న ఒప్పందం రద్దు అయ్యే అవకాశాలు అధికంగా కనపడుతున్నాయి. ఈ ఒప్పందం వలన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాల్లో ఆలస్యం అవుతుందని, జల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని కూటమి ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. దీనిపై అద్యయనం చేసి చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు కీలక అంశాలను వెల్లడించారు.



2 లో

సూర్య
విజయవాడ
శుక్రవారం
14 మార్చి 2025




# 2030 నాటికి మూడు వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతే లక్ష్యం



అమరావతి: దేశంలో విద్యుత్ సంస్కరణలను మొదటిసారి అమలు చేసింది తెలుగుదేశం పార్టీనే అని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏపీ అసెంబ్లీలో పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ శాఖపై జరిగిన లఘు చర్చలో భాగంగా గురువారం ఆయన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విషయాలను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గౌరవ సభ్యులకు వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ సంస్కరణలను ప్రారంభమయ్యాయని వెల్లడించారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ఈఆర్సీ ని తీసుకువచ్చింది కూడా ఏపీనే అని ఈ సందర్భంగా తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 1.85 లక్షల కోట్ల పెట్టుబడితో తో అనకాపల్లి జిల్లా పూడిమడకలో 1,200 ఎకరాల్లో గ్రీన్ హైడ్రోజన్ హాబ్ ప్రాజెక్టును ఎన్టీపీసీ, నెడ్ క్యాప్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న పేర్కొన్నారు. 2030 సంవత్సరం నాటికి మూడు వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు మంత్రి వివరించారు. రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీబీజీ ప్లాంట్ల నిర్మాణంతో రాష్ట్రంలోని రైతులకు మరింత లబ్ధి చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. టాటా రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ తో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్న విషయాన్ని మంత్రి ఈ మేరకు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో రూ. 49 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 7000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాము. అదే విధంగా బ్యాటరీ స్టోరేజ్ సిస్టంను రాష్ట్రంలో తొలిసారి ప్రవేశపెడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం 55 సబ్ స్టేషన్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్నట్లు మంత్రి సభలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏటా 6శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందని, ఆ వినియోగానికి సమానమైన విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు.

# 2019-24 మధ్య విద్యుత్ రంగానికి చీకటి రోజులు

**● గత ప్రభుత్వం విధ్వంసం చేసిన విద్యుత్ రంగాన్ని 9 నెలల్లో గాడిన పెట్టాం ● సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ప్రతి ఒక్కరూ ఆదాయం పొందే విధానాన్ని తీసుకొస్తాం ● 1998లో తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలో ఆ రంగాన్ని నిలబెట్టాయి ● ప్రతి నియోజకవర్గంలో 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటు...పీఎం కుసుమ్ కింద 4 లక్షల పంపుసెట్లు ● రాబోయే నాలుగేళ్లలో విద్యుత్ ఛార్జీలు పెంచం ● డెమొక్రటైజ్ పవర్ జనరేషన్ తో విద్యుత్ ఉత్పత్తిని ప్రజలకు ఆదాయ వనరుగా మార్చుతాం ● శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**



అమరావతి, మార్చి 13 :- 2019-24 మధ్య విద్యుత్ రంగానికి చీకటి రోజులు వచ్చాయి. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన విద్యుత్ రంగాన్ని 9 నెలల్లోనే గాడిన పెట్టాం. గత పాలకుల విధ్వంసం వల్ల ఆ రంగంలో వ్యవస్థలో అంతుబట్టని సమస్యలు ఉన్నాయి. 30 ఏళ్లుగా నా మనసుకు దగ్గరగా ఉండే విభాగం ఇంధనరంగం. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చిన ఘనత టీడీపీదే. క్లీన్ ఎనర్జీ పాలసీ ప్రకటించాక రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంఓయూలు కుదుర్చుకున్నాం. దీని ద్వారా రాష్ట్రంలోని 3.66 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. రాబోయే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యం. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పాం...ఆ మాటకు కట్టుబడి ఉన్నాం. యూనిట్ విద్యుత్ కొనుగోలు ధర రూ.5.16 నుంచి రూ.4.80కి తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శాసనసభలో విద్యుత్ రంగంపై సీఎం ప్రసంగించారు. ఏ పని జరగాలన్నా విద్యుత్ అవసరం. నిజ జీవితంలో విద్యుత్ వినియోగం చాలా కీలకం. తలసరి విద్యుత్ వినియోగాన్ని బట్టి అభివృద్ధిని అంచనా వేస్తాం. ఇంధన రంగంలో అనేక మార్పులు వచ్చాయి. 30 ఏళ్లకు ముందు ఉన్న వ్యవస్థను చూశాను... ఇప్పుడున్న వ్యవస్థను చూస్తున్నాను. 2004కు ముందు మేం అసెంబ్లీలో ఉంటే ప్రతిపక్షాలు వెళ్లి విద్యుత్ సౌధ వద్ద ఆందోళనలు చేసేవి. నేను అసెంబ్లీ నుంచి బటయకు వెళ్లి పొలాలు చూసి వచ్చి మళ్లీ సభ్యులకు సమాధానం చెప్పేవాన్ని. గతంలో గ్రామాల్లో కరెంట్ ఎప్పుడో వస్తుందో తెలీదు. ఇక రైతులు అయితే కరెంట్ రాగానే రైతులంతా ఒకేసారి మోటార్లు వేసేవారు. లో ఓల్టేజ్ వల్ల మోటార్లు కాలిపోయేవి. నేను 2012లో పాదయాత్ర చేశాను. కొన్నిచోట్ల రైతులు చలిమంట వేసుకుని కరెంట్ కోసం కూర్చునేవారు. ఏంటి ఇక్కడ కూర్చున్నారని అడిగితే కరెంట్ కోసం చూస్తున్నామని చెప్పారు. చాలా మంది రైతులు పాముకాటుకు గురయ్యేవారు. ఇవన్నీ చూశాక 2014లో అధికారంలోకి వచ్చాక 9 గంటల విద్యుత్ పగటిపూటే ఇచ్చాం.

**స్పాట్ బిల్లింగ్ విధానాన్ని తెచ్చాం**

వసాయానికి ఎంతోకొంత రైతుల నుంచి వసూలు చేసేవారు. మేం వచ్చాక స్లాబ్ రేట్ తెచ్చి రైతులను ఆదుకున్నాం. దీంతో మీటర్ రీడింగ్ కోసం స్పాట్ బిల్లింగ్ విధానాన్ని తీసుకొచ్చాం. ప్రపంచమంతా అధ్యయం చేశాను. విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చింది టీడీపీనే. అప్పుడు నన్ను ప్రతిపక్షాలు ప్రపంచ బ్యాంకు జీతగాడు అన్నారు. అయినా ప్రజలకోసం, రాష్ట్రంకోసం ఆ మాట పడ్డాను. 1995లో 10 నుంచి 15 గంటలదాకా విద్యుత్ కోతలు ఉండేవి. 1998లో సంస్కరణలు దేశంలోనే మొట్టమొదటి సారి తెచ్చాం. ఎనర్జీ ఆడిటింగ్ విధానం తీసుకొచ్చాం. డిస్ట్రిబ్యూషన్, జనరేషన్, ట్రాన్స్ మిషన్ కమిటీలుగా విభజించాం. కరెంట్ కొరతలను 2004 నాటికి అధిగమించాం. కరెంట్ కొరతలేని ఏకైక రాష్ట్రంగా ఏపీని తయారు చేశాం. ఆ ఫలితాలు చూసి సంతోషించా. కానీ అవి ప్రజలకు అర్ధంకాకపోవడం 2004లో ఓడిపోవడానికి కారణం అయింది. రాష్ట్రానికి లాభాలు వచ్చాయి...నాకు కష్టాలు వచ్చాయి.

**1998 సంస్కరణలను నిర్వీర్యం చేశారు**

నేను సీఎంగా ఉన్న సమయంలో బొగ్గు నిల్వలు పెద్ద సమస్య ఉండేది కాదు. నాణ్యత లేకుండా చేయడం, లేదంటే అసలు బొగ్గే లేకుండా చేయడంతో థర్మల్ పవర్ స్టేషన్లు సామర్థ్యం మేరకు పని చేయలేదు. 1998 నాటి సంస్కరణలు నిర్వీర్యం చేశారు. 2012-13 మధ్య జాతీయ స్థాయిలో విద్యుత్ లోటు 8.7 శాతం ఉంటే మన రాష్ట్రంలో 17.6 శాతం ఉండేది. విద్యుత్ రంగానికి బడ్జెట్ కేటాయింపులు కూడా 7.8 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. 1995 నుంచి 2004 మధ్య విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 90 శాతానికి పెంచితే తర్వాత 56 శాతానికి తగ్గించారు. 2004లో యూనిట్ విద్యుత్ ధర రూ.2.55 ఉంటే అది 2014 నాటికి రూ.5.25కు పెంచారు. దీంతో వినియోగదారులపై మోయలేని భారం పడింది. విద్యుత్ కోతల్లేని పరిస్థితి నుంచి గంటలకొద్దీ కోతలు విధించే పరిస్థితికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్ల పాలనలో రైతులపై రూ.28,535 కోట్లు భారం వేశారు.

**ఒక వ్యక్తి అహం వల్ల రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది**

2014లో అధికారంలోకి వచ్చాక మళ్లీ విద్యుత్ అంశంపై స్టడీ చేశాం. 22.5 మిలియన్ల కొరత ఉంటే సవాల్‌గా తీసుకుని 2018 జనవరి నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దాం. జాతీయ తలసరి వినియోగం 17 శాతం ఉంటే మనం 23 శాతానికి పెంచాం. సోలార్, విండ్ ద్వారా 7,700 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాం. ఏ రాష్ట్రం కూడా ఈ విధంగా చేయలేదు. ఐదేళ్లు కరెంట్ ఛార్జీలు పెంచకుండా నాణ్యమైన కరెంట్ అందించాం. 2019-24లో మధ్య మళ్లీ చీకటి రోజులు వచ్చాయి. అసమర్థ పాలన వల్ల ఇష్టానుసారంగా చేశారనడానికి ఇదొక కేస్ స్టడీ. విద్యుత్ రంగాన్ని మళ్లీ చీకట్లోకి నెట్టారు. ఏ రాష్ట్రంలోనైనా పీపీఏల ఆధారంగా పెట్టుబడులు పెడతారు. దావోస్‌లో కూడా పీపీఏల రద్దుపై చర్చలు జరిగాయి. వితండ వాదంతో కావాలని అవినీతి ఆరోపణలు చేసి సోలార్ విద్యుత్ వాడలేదు. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో రూ.9 వేల కోట్లు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. ఆనాడు కరెంట్ వాడుకుని ఉంటే మనకు సమస్యలు వచ్చేవి కాదు. ఒక అహంకారం వల్ల రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది.

**గత ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు**

కృష్ణపట్నం స్టేజ్ 2, వీటీపీఎస్ స్టేజ్ 5 ఆలస్యమయ్యాయి. దీనివల్ల అదనపు అవుతోంది. పోలవరం హైడ్రో పవర్ కూడా ఆలస్యం వల్ల రూ.1044 భారం పడుతుంది. అవకతవక నిర్ణయాలు, అసమర్థత వల్ల రూ.62,826 కోట్లు ఉన్న అప్పులు రూ.1,12,422 కోట్లకు పెరిగింది. విపరీతంగా టారిఫ్‌లు పెంచి 9 సార్లు విద్యుత్ ఫెంచారు. రూ.32 వేల కోట్లు పేదలపై భారం వేశారు. 50 యూనిట్లు ఉపయోగించేవారిపై రూ.101 నుంచి రూ.199కి అనగా 98 శాతం, 100 యూనిట్లు వాడేవారికి రూ.244 నుంచి రూ.453కి అనగా 86 శాతం, 200 యూనిట్లు వాడేవారికి రూ.632 నుంచి రూ.1,123కి అనగా 78 శాతం, 300 యూనిట్లు వాడే వారికి రూ.1,573 నుంచి రూ.2,037కి అనగా 26 శాతం చొప్పున ఛార్జీలు పెంచారు. పేదలపై పెనుభారం వేశారు. టారిఫ్ సర్దుబాటు పేరుతో రూ.16,699 కోట్లు భారం వేశారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన నాకే ఈ రకరకాల పేర్లు నాకే అర్థం కాలేదు. ఫ్యూయల్ సర్‌ఛార్జీ పేరుతో రూ.5,886 కోట్లు, ట్రూఅప్ ఛార్జీలు రూ.3,977 కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.5,604 కోట్లు వేశారు. నేనున్నప్పుడు 6 పైసలువేస్తే అది కూడా విద్యుత్ బోర్డే తీసుకునేది. 2019-24 మధ్య 9 సార్లు ఛార్జీలు పెంచి రూ.32,166 కోట్లు భారం వేశారు. మళ్లీ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.6073 కోట్లు, 2023-24లో రూ.6544 కోట్లు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్టమెంట్ కోసం ఏపీఈఆర్సీలో పిటిషన్ వేశారు. గత ప్రభుత్వం పెంచిన ఛార్జీల భారం గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రజలపై పడింది. పవర్ సప్లై అగ్రిమెంట్, సెకీలు భారంగా అయ్యాయి.

# యువతలో ఎఐ నైపుణ్యాలకు మైక్రో సాఫ్ట్‌తో కీలక ఒప్పందం



**● ఎఐ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో 2 లక్షల మందికి శిక్షణ**

**● మంత్రి లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్, ఎపిఎస్ఎస్‌డి నడుమ అవగాహన**

అమరావతి: రాష్ట్రంలోని యువతకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ), అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాభివృద్ధి కోసం అంతర్జాతీయస్థాయి ప్రఖ్యాత సంస్థ మైక్రోసాఫ్ట్ తో ఏపి ప్రభుత్వం కీలకమైన ఒప్పందం చేసుకుంది. అమరావతి సచివాలయంలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అధికారులు ఎంఓయుపై సంతకాలు చేశారు. వృత్తి విద్య, మాధ్యమిక పాఠశాల పిల్లలు, యువతలో ఎఐ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించి రాష్ట్రంలో ఐటి ఆధారిత, ఇతర పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యవంతమైన సిబ్బందిని తయారు చేయడం ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఈ ఒప్పందం ప్రకారం ఎపిలో ఏడాది వ్యవధిలో 2లక్షలమంది యువతకు మైక్రోసాఫ్ట్ సంస్థ స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయంగా ఎఐ, అధునాతన టెక్నా లజీల్లో వస్తున్న అవకాశాలను అందివుచ్చుకొని, ఉద్యోగావ కాశాలు పొందేం దుకు మైక్రోసాఫ్ట్ శిక్షణ ఉపకరిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని 50 గ్రామీణ ఇంజనీరింగ్ కళాశాలల్లో 500మంది అధ్యాపకులు, 10వేలమంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్ పై మైక్రోసాఫ్ట్ శిక్షణ ఇస్తుంది . గ్రామీణ ప్రాంతాల్లో నెలకొని ఉన్న 30 ఐటిఐలలో 30వేలమంది విద్యార్థులకు డిజిటల్ ప్రొడక్టివిటీలో ఎఐ శిక్షణను అందిస్తారు. ఎపిలో యునిసెఫ్ భాగస్వామ్యంతో పాస్ పోర్ట్ టు ఎర్నింగ్ 2.0ని ప్రవేశపెట్టేందుకు వీలుగా 40వేలమందికి, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ సహకారంతో మరో 20వేలమందికి ఎఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ పౌర సేవలను మెరుగుపర్చడంతోపాటు ప్రభుత్వాధికారుల్లో సామర్థ్యం పెంపుదలకు 50వేల మందికి 100 గంటలపాటు శిక్షణను అందిస్తుంది. తద్వారా ్రాతో సివిల్ సర్వీసెస్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తారు. శాఖల మధ్య సహకారంపై స్వీయ-అభ్యసన మార్గాలు, వర్క్‌షాప్‌లు, వెబినార్‌ల ద్వారా 20వేలమంది మంది సిబ్బందికి అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌ను అందిస్తారు. ఆయా ప్రాంతాల్లో ఎఐ శిక్షణకు అవసరమైన భౌతిక మౌలిక సదుపాయాలను ఎపి స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సమకూరుస్తుంది. విద్యాసంస్థల్లో ఎఐ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టేందుకు అవసరమైన శిక్షణ, సర్టిఫికేషన్ ను మైక్రోసాఫ్ట్ అందజేస్తుందని మంత్రి లోకేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండి గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ దినేష్ కుమార్, మైక్రోసాఫ్ట్ సౌత్ హెడ్ ఫర్ గవర్నమెంట్ బిజినెస్ దినేష్ కనకమేడల, మైక్రోసాఫ్ట్ ఇండియా సౌత్ ఏషియా డైరక్టర్ సందీప్ బంద్వేద్కర్ తదితరులు పాల్గొన్నారు.


# రాజధాని ప్రాంతానికి డిఫెన్స్ ఏరోస్పేస్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు

**● ఎ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులతో సమావేశం ● డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు ● ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు ● విజయవాడ నగరాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సమాలోచనలు ● పారిశ్రామిక వేత్తలకు సతీష్ రెడ్డి పలు సలహాలు సూచనలు**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజధాని ప్రాంతమైన విజయవాడ ప్రాంతంలో డిఫెన్స్ ఏరోస్పేస్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు రానున్నాయి. ఇంకా ఈ ప్రాంత పారిశ్రామికాభివృద్ధి కి ఎలాంటి వ్యూహం అనుసరించాలి. ఎటువంటి పరిశ్రమల ఏర్పాటుతో త్వరగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందనే అంశంపై త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటి,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి చర్చించనట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. రాబోయే కాలంలో విజయవాడ నగర ప్రాంతం పారిశ్రామికంగా ఏ విధంగా అభివృద్ధి చెందాలనే అంశంపై డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి తో ఎ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులకు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తన కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి కు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పుష్పగుచ్చంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహుకరించారు. సతీష్ రెడ్డి ఈ సమావేశంలో పారిశ్రామిక వేత్తలకు రాజధాని ప్రాంతంలో ఇండస్ట్రీలు అభివృద్ధి చెందాల్సిన అవసరం , ఇందుకోసం ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి చెప్పటంతోపాటు పరిశ్రమలు తీసుకువచ్చేందుకు ఎంపి కేశినేని శివనాథ్ చేస్తున్న కృషిని వివరించారు. అలాగే పారిశ్రామిక వేత్తలు అడిగిన సందేహాలకు సతీష్ రెడ్డి సమాధానం ఇచ్చారు. ఈ సమావేశం అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి మీడియా తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి విజయవాడ రావటం, నగర పారిశ్రామిక వేత్తలను కలవటం చాలా సంతోషంగా వుందన్నారు. ఇది విజయవాడ పారిశ్రామిక రంగానికి చాలా ఆనందకరమైన రోజు అని ప్రకటించారు. రాబోయే కాలంలో ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఏ విధంగా అభివృద్ధి సాధించాలనే అంశంతో పాటు, డిఫెన్స్ రంగంలో ఎన్ని రకాల పరిశ్రమలు వస్తున్నాయి..ఆ అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించుకోవటం జరిగిందన్నారు. ఇలాంటి సమావేశాలు మరిన్నీ జరగాల్సిన అవసరం వుందని సతీష్ రెడ్డి అభిప్రాయపడినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో నగర పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి పారిశ్రామికవేత్తలకు నిత్యం అందుబాటులో వుంటానని , వారికి కావాల్సిన సలహాలు సూచనలు అందిస్తానని సతీష్ రెడ్డి చెప్పటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధిలో తామందరం కలిసికట్టుగా సతీష్ రెడ్డి సలహాలు సూచనలు తీసుకుని ముందుకు వెళతామన్నారు. అలాగే ఎఫ్టానిక్స్ సి.ఈ.వో రామకృష్ణ సూచనల ప్రకారం నేటి కాలానికి అనుగుణంగా పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా ఇంజనీరింగ్ కోర్సుల్లో చేయాల్సిన మార్పులు, అదనంగా చేర్చాల్సిన కోర్సుల అంశంపై తామందరం మంత్రి నారాలోకేష్ ను కలిసి చర్చిస్తామన్నారు. పరిశ్రమలకు ఉపయోగపడే కోర్సులు యూనివర్సిటీలో వుండే విధంగా కృషి చేస్తామన్నారు. ఎ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుల తరుపున సతీష్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. డి.ఆర్.డి.వో మాజీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రతి నగరంలో ముఖ్యంగా రాజధాని నగరంలో ఇండస్ట్రీలు, స్టార్టప్ లు చాలా ప్రముఖంగా దేశంలో వస్తున్నాయన్నారు. కేంద్రప్రభుత్వం డిఫెన్స్, ఎరోస్పెస్, కమ్యూనికేషన్, రైల్వే రంగాల్లో స్వదేశీయంగా ఉత్పత్తులు తయారు చేయించి వాటినే వాడాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని తెలిపారు. అందుకే ఆయా మంత్రిత్వ శాఖలో విదేశాల నుంచి ఏ వస్తువులు దిగుమతి చేసుకుంటున్నామో ఒక జాబితా తయారు చేసి వెబ్ సైట్ లో పెడుతున్నట్లు తెలిపారు. దేశంలోని పారిశ్రామికవేత్తలతో వాటిని తయారు చేయించాలనే ఉద్దేశ్యంతో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రకరకాల పథకాలు అమల్లోకి తీసుకువచ్చిందన్నారు.

# సెకీ ఒప్పందాలపై అధ్యయన కమిటీ



**● కమిటీ నివేదికను ఆధారంగా చేసుకుని నిర్ణయం ● ఈ ఒప్పందం వలన పోలవరం ప్రాజెక్టులో ఆగిపోయిన జల విద్యుత్ ఉత్పత్తి ● అసెంబ్లీ వేదికగా చంద్రబాబు కీలక నిర్ణయం**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జగన్ సెకీతో చేసుకున్న ఒప్పందం రద్దు అయ్యే అవకాశాలు అధికంగా కనపడుతున్నాయి. ఈ ఒప్పందం వలన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాల్లో ఆలస్యం అవుతుందని, జల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని కూటమి ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. దీనిపై అధ్యయనం చేసి చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు కీలక అంశాలను వెల్లడించారు. జగన్ హయాంలో సెకీతో చేసుకున్న ఒప్పందాల పైన పెద్ద ఎత్తున వివాదం నడిచింది. ఏపీ ప్రభుత్వం ఈ ఒప్పందాలను రద్దు చేసుకోవాలనే డిమాండ్లు తెర మీదకు వచ్చాయి. దీంతో, ఒప్పందాల పైన అధ్యయనం తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు భావించారు. కాగా, ఈ రోజు అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. సెకీతో ఒప్పందం విషయంలో వెనక్కు వెళ్లలేమని తేల్చి చెప్పారు. చంద్రబాబు క్లారిటీ అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ సంస్కరణల గురించి వివరించారు. కొన్నేళ్లుగా విద్యుత్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రపంచ బ్యాంకు జీతగాడని అవహేళన చేశారన్నారు. అప్పుడే డిస్కమ్ లు, నియంత్రణ మండలి, ఎనర్జీ ఆడిటింగ్ అనేది మొదలు పెట్టామని గుర్తు చేసారు. విభజన తర్వాత కరెంటు కోతలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దామని తెలిపారు. టీడీపీ హయాంలో చేసిన విద్యుత్ సంస్కరణలు వాడుకుని అప్పట్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పుకొచ్చారు. తమ హయాంలోనే ఎన్టీపీఎస్ లాంటి ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను 83 శాతం పీఎల్ఎఫ్‌తో నడిపించామన్నారు. చాలా ప్రైవేటు సంస్థలకూ అది సాధ్యం కాదని.. ఈ పరిపాలనా మార్పులు ప్రజలు గుర్తించాలన్నదే తమ అభిప్రాయమన్నారు. రూ 9 వేల కోట్లు నష్టం విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఉన్న ఏపీని గత ప్రభుత్వం లోటు పరిస్థితికి తీసుకెళ్లిందని చంద్రబాబు ధ్వజమెత్తారు. పరిశ్రమలు కరెంటు వాడితే సర్చార్జి విధించిన పరిస్థితి గత ప్రభుత్వానిదన్నారు. ఏపీలో తలసరి విద్యుత్ వినియోగం 23 శాతం మేర పెరిగిందన్నారు. సౌర, పవన విద్యుత్‌ను 7700 మెగావాట్లు మేర ఉత్పత్తి చేసిన మొదటి రాష్ట్రం ఏపీనే అని చెప్పుకొచ్చారు. అయితే 2019-24లో అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలో మళ్లీ చీకటి రోజులు వచ్చాయన్నారు. ఆలోచన లేకుండా వైసీపీ పీపీఏలను రద్దు చేసేసిందని గుర్తు చేసారు. పీపీఏల రద్దు విషయం అంతర్జాతీయ అంశంగా మారిపోయిందని చెప్పుకొచ్చారు. ఒక వ్యక్తి ఈగో కారణంగా రాష్ట్ర ఖజానా నుంచి రూ.9 వేల కోట్లు పీపీఏలకు చెల్లించాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. సెకీతో ఒప్పందం పై పోలవరం ప్రాజెక్టు ఆలస్యం వల్ల అందులో జల విద్యుత్ కేంద్రం ఆగిపోయి 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాలేదన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీల పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం వేశారని మండిపడ్డారు. టారిఫ్ అడ్జస్ట్మెంట్, ఫ్యూయల్ సర్చార్జ్ , ట్రూ ఆప్ ఛార్జెస్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ అని చెప్పి రూ. 32,166 కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ వినియోగం కూడా 4.6 శాతం మేర తగ్గిపోయిందని చెప్పారు. సెకి ద్వారా చేసుకున్న పవర్ సప్లై అగ్రిమెంటు రాష్ట్రానికి భారంగా మార్చేశారన్నారు. ఒకసారి సంతకా లు చేసిన తర్వాత ప్రభుత్వంగా దాన్ని వెనక్కు తీసుకోలేమని చంద్రబాబు స్పష్టం చేసారు. ఇలాంటి ఇబ్బందులు ఉన్నా వాటిని సరిచేసేందుకు ప్రయత్నాలు కూటమి ప్రభుత్వం చేస్తోందని వెల్లడించారు.

## తెలుగు సాహిత్య రంగంలో మొల్లది ఒక అపూర్వ అధ్యాయం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తెలుగు సాహిత్య రంగానికి వెలకట్టలేని కీర్తిని తీసుకువచ్చిన మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతి సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 13న సుప్రసిద్ధ తెలుగు కవయిత్రి మొల్ల జయంతిని రాష్ట్ర పండగగా నిర్ణయించడం సంతోషకరమన్నారు. తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభను చాటుకొని, కవిత్వంలో అపారమైన ఖ్యాతిని సొంతం చేసుకున్న కవయిత్రి మొల్ల జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. రామాయణాన్ని అతి సులువైన పదాలతో తెలుగులో రాసి తన సరళమైన పదజాలానికి అందరూ ముగ్దులయ్యేలా చేసిన గొప్ప కవయిత్రి మొల్ల అని అభివర్ణించారు. ఆమె రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని, రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా కూడా ఆమె ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచిందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. మొల్ల రామాయణం భక్తి, శృంగార రసలయలతో కూడిన అమూల్య సంపద అని తెలిపారు.

## జగన్ తమ్ముడి పేరు చెప్పేసిన సాయిరెడ్డి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ రాజకీయాల్లో థర్డ్ ఇయర్స్ ఇండస్ట్రీ గా పాపులర్ అయిన టాలీవుడ్ కమెడియన్ పృథ్వీ గతంలో వైసీపీలో పనిచేశారు. ఆ తర్వాత కూటమిలో చేరి వైసీపీలో విమర్శలు ఎక్కుపెడుతున్నారు. గత ఎన్నికలకు ముందు జనసేనలో చేరిన పృథ్వీ వరుసగా వైసీపీని టార్గెట్ చేస్తూ వస్తున్నారు. ఇదే క్రమ ంలో తాజాగా వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఓ ఆరోపణను ప్రస్తావిస్తూ ట్వీట్ పెట్టారు. ఇందులో జగన్ ను లింక్ చేశారు. నిన్న విజయవాడలో సీఐడీ విచారణకు హాజరైన పృథ్వీ కాకినాడ పోర్టు వాటాల వ్యవహారంలో వాంగ్మూలం ఇచ్చారు. కాకినాడ పోర్టు వాటాల్ని కేవీ రావు నుంచి అరబిందోకు బలవంతంగా బదలాయించుకున్న కేసులో తన ప్రమేయం లేదని, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డే దీనికి కర్త, కర్మ, క్రియ అని విజయసాయిరెడ్డి వెల్లడించారు. ఇదే విషయం సీఐడీకి కూడా చెప్పానన్నారు. ఇప్పుడు అదే విషయాన్ని ప్రస్తావిస్తూ పృథ్వీ ట్వీట్ పెట్టారు. అంతవరకూ బాగానే ఉన్నా విక్రాంత్ రెడ్డిని వైఎస్ జగన్ సోదరుడంటూ బ్రాకెట్ లో పెట్టారు. వాస్తవానికి జగన్ కూ, విక్రాంత్ రెడ్డికీ నేరుగా సంబంధం లేదు.

## సాయిరెడ్డి రీఎంట్రీ ? ఎక్కడో ప్రేమ..

### వైసీపీ మాజీ మంత్రి గుడివాడ గుర్నానాథ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో వైసీపీకీ, ఎంపీ పదవికీ, పూర్తిగా రాజకీయాలకే గుడ్ బై చెప్పేసి వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించిన విజయసాయిరెడ్డి తిరిగి ఆ పార్టీపైనే పోరు మొదలు పెట్టడం పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చనీయాంశంగా మారింది. జగన్ ను ఏమీ అనకుండానే ఆయన చుట్టూ కోటరీ వల్లే తాను పార్టీని వీడి బయటికి వచ్చానని చెప్పడంపై పార్టీ నేతలు మండిపడుతున్నారు. ఇన్నాళ్లూ జగన్ కోటరీలో ఉన్న మీరే అలా అంటే ఎలా అంటూ సాయిరెడ్డిపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. వైయస్ జగన్ కోటరీ అంటే అది ఆయనను అభిమానించే ప్రజలు, 15 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వైయస్సార్‌సీపీ కార్యకర్తలేనని మాజీ మంత్రి, విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ తెలిపారు. విజయవాడలో విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. నిన్నటి వరకు వైయస్ జగన్ కోటరీలోనే ఉన్న విజయసాయిరెడ్డి ఇప్పుడు కోటరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వైయస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడుగా ఆయన మాటల్లోనే చెప్పాలంటే పూజారిగా ఉన్నప్పుడు విజయసాయిరెడ్డి ఎలా వ్యవహరించారో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సాయిరెడ్డి కోటరీ కామెంట్స్ పై స్పందిస్తూ.. కోటరీ అనేది అన్ని రంగాల్లో, అన్ని వ్యవస్థల్లో సాధారణంగా కనిపించేదే అన్నారు. టీడీపీలో చంద్రబాబు చుట్టూ కోటరీ లేదా? ఆ కోటరీల గురించి బయట ఉన్నవారెవరైనా మాట్లాడితే బాగుంటుందన్నారు. అంతే కానీ కోటరీలో ఉండి వచ్చిన వ్యక్తులే కోటరీ గురించి మాట్లాడటం భావ్యం కాదన్నారు. విజయసాయిరెడ్డి వైసీపీని వీడి వెళ్లిపోయిన తర్వాత ఇంతకన్నా పద్ధతిగా మాట్లాడతారని అనుకోలేదన్నారు. ఢిల్లీ వేదికగా రాజకీయాలకు దూరంగా ఉంటానని, వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించిన సాయిరెడ్డి..నిన్నటి రోజు వరకు ఏ పార్టీలో చేరబోయేది నిర్ణయం తీసుకోలేదని చెప్పారని గుర్తుచేశారు.

## నాగం గారూ.... ఎలా ఉన్నారు?



అమరావతి, మార్చి 13 : తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి ఎపి సిఎం చంద్ర బాబు అసెంబ్లీలో కలి శారు. చాలాకాలం తరువాత తనను కలిసిన నాగంను సీఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. నాగం గారూ...ఎలా ఉన్నారు....ఆరోగ్యం ఎలా ఉంది...చాలా రోజులు అయ్యింది కలిసి అంటూ పలకరించారు. పిల్లలు ఏం చేస్తున్నారు అని ఆరా తీశారు. నాగం కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న చంద్రబాబు...ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయనకు సూచించారు. ఓబులాపురం మైనింగ్ అంశంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం నేతలు చేసిన ఉద్యమాలపై నాడు కేసులు నమోదు అయ్యాయి. ఆ కేసుల విచారణలో భాగంగా విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం జనార్ధన్ రెడ్డి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనాటి కేసులను ఎట్టకేలకు కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు పాత ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు చేసిన ప్రజా పోరాటాలను గురించి చర్చించుకున్నారు. నాగం ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారని....పార్టీ ఆదేశిస్తే దూసుకుపోయేవాళ్లని ఈ సందర్భంగా సీఎం అన్నారు.

## ఏపీలో తొలగించిన పెన్షన్లు 14 వేలే

### మండలిలో తేల్చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ సంఖ్యలో ఇచ్చిన పెన్షన్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రమంగా తొలగి స్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇవాళ ఇదే అంశంపై శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు ప్రభుత్వాన్ని నిలదీ శారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున మంత్రి కొండ పల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. ఇందులో గత 9 నెలల కాలంలో తమ ప్రభుత్వం ఎన్ని పెన్షన్లను తొలగిం చిం దో ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2 లక్షల పెన్షన్లు తీసేశా రంటూ వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. ఏవేవో కారణాలు చెప్పి పెన్షన్లు తీసేస్తున్నారని, పేదలకు ఇచ్చే పెన్షన్లను కూడా భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదని ప్రభుత్వానికి తెలిపారు. ఈ ప్రభుత్వం వచ్చాక కొత్త పెన్షన్లు ఇవ్వలేదని, గత వైసీపీ ప్రభుత్వంలో తాము 13 లక్షల కొత్త పెన్షన్లు ఇచ్చామని మరో ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ గుర్తుచేశారు. అసలు పెన్షన్ల తొలగింపులో పాటిస్తున్న విధానమేంటో చెప్పాలని మరో వైసీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ప్రశ్నించారు. వీటిపై మంత్రి కొండపల్లి శ్రీని వాస్ స్పందించి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పెన్షన్లు ప్రవేశపెట్టింది ఎన్టీఆర్ అయితే వాటిని పెంచుకుంటూ వెళ్లింది టీడీపీ ప్రభుత్వాలే అని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభు త్వంలో 24 లక్షల పెన్షన్లు తగ్గించారని, కానీ తాము కేవలం 14 వేల పెన్షన్లు మాత్రమే తొలగించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక లక్షా 80 వేల మంది పెన్షనర్లు చనిపో యారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13 శాతం జనాభాకు పెన్షన్లు అందిస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్ చెప్పుకొచ్చారు. మంత్రి చెప్పిన వివరాల ప్రకారం చూస్తే ఇప్పటివరకూ 14 వేల పెన్షన్లు మాత్రమే తొలగించినట్లు తేలింది.



# తిరుపతి తొక్కిసలాట ఘటనపై విచారణ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాణమూర్తి మూడో దశ విచారణ చేయనున్నారు. ఈ క్రమంలో ఈ నెల 17న విచారణకు రావాలంటూ జిల్లా కలెక్టర్, టీటీడీ ఈవో, ఎస్పీకి సమన్లు జారీ చేశారు. కాగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి సోమవారం (ఫిబ్రవరి 24వ తేదీ) విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో జస్టిస్ సత్యనారాయణమూర్తి బాధితులను విచారించారు.

ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. తిరుపతి కలెక్టరేట్ వేదికగా కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాణమూర్తి శనివారం (ఫిబ్రవరి 22వ తేదీ)రెండో దశ విచారణ చేపట్టారు. 11 మందిని విచారించారు. ఇదే ఘటనలో విశాఖకు చెందిన కొందరు మృతిచెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. విచారణకు హాజరు కావాలని ఈ ప్రాంతానికి చెందిన 19 మంది బాధితులకు న్యాయవిచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. అయితే తామింకా కోలుకోలేదని గాయాలు ఇబ్బంది పెడుతున్నాయని, అంత దూరం రాలేమని వర్చువల్ (జూమ్) మీటింగ్‌లో పాల్గొని ఘటపై వివరిస్తామని వారు కమిషన్‌కు లిఖితపూర్వకంగా వివరణ పంపించారు. దీంతో జస్టిస్ సత్యనారాయణమూర్తి ఆదివారం (ఫిబ్రవరి 23వ తేదీ) ఉదయం విజయవాడకు బయలుదేరి వెళ్లిపోయారు.గోపాలపట్టణం తహసీల్దారు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో న్యాయవిచారణ కమిషన్ ఎదుట బాధితులు హాజరయ్యారు. విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి వారిని విచారించారు. కాగా, ఈ తొక్కిసలాట ఘటనలో గాయపడిన వారిలో కొందరు కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్నారు. వీరూ వర్చువల్ విధానంలో విచారణకు హాజరు అయ్యారు. దీని తర్వాత మూడో దశ విచారణ ఈనెల 17వ తేదీ నుంచి తిరుపతిలో జరగనుంది.

# ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 4వ ఎస్ఐపీబీ సమావేశం

- రూ.1,21,659 కోట్లు పెట్టుబడులకు ఆమోదం
- 10 కొత్త ప్రాజెక్టుల ద్వారా 80,104 మందికి ఉద్యోగాలు
- వివిధ సంస్థల పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిపై ట్రాకింగ్
- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు... ముందుగా 26 జిల్లాల్లో ఏర్పాటు
- నెల రోజుల్లో రాష్ట్రంలో ఐదు చోట్ల 5 రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలు
- ఎస్ఐపిబి సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన, ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టుల పురోగతిపై నిత్యం పరిశీలించాలని... దీని కోసం ట్రాకర్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. గురువారం సచివాలయంలో తన అధ్యక్షతన జరిగిన 4వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను పరిశీలించారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం వంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్లు పెట్టుబడులు ముందుకురాగా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. అలాగే, గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు, వాటి పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు.రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ చొప్పున మొత్తం 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందలో భాగంగా మొదట జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో తక్షణం 26 ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెలరోజుల్లోగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో 5 సెంటర్లు నెలకొల్పాలని చెప్పారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యే వరకు ఆయా సంస్థల వెనుకపడాలని.... నిరంతరం ఫాలోఅప్ చేయాలని సిఎం సూచించారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు... క్షేత్ర స్థాయిలో ఆయా ప్రాజెక్టులు పనులు మొదలుపెట్టేలా చూడాలన్నారు. ఈ విషయంలో అటు మంత్రులు, ఇటు అధికారులు మరింత వేగంగా పనిచేయాలని సిఎం సూచించారు. అప్పుడే ప్రతి ఏడాది ప్రగతి, ఫలితం కనిపిస్తుందని సిఎం అభిప్రాయపడ్డారు.

4వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన సంస్థల వివరాలు :

1) ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ : నాయుడుపేట – రూ.1,742 కోట్ల పెట్టుబడులు, 2,000 ఉద్యోగాలు.
2) దాల్మియా సిమెంట్ : కడప జిల్లా – రూ.2,883 కోట్ల పెట్టుబడులు, 354 ఉద్యోగాలు.
3) లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్ : విశాఖపట్నం – రూ. 1,500 కోట్ల పెట్టుబడులు.
4) సత్యవీడు రిజర్వ్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ రూ. 25,000 కోట్ల పెట్టుబడులు, 50,000 ఉద్యోగాలు.
5) ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.58,469 కోట్ల పెట్టుబడులు, 13,050 ఉద్యోగాలు.
6) బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.1,175 కోట్లు, 1,500 ఉద్యోగాలు.
7) ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు రూ.22,000 కోట్ల పెట్టుబడులు, 8,300 ఉద్యోగాలు
8) ఆస్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : అన్నమయ్య, కడప జిల్లాలు రూ.8,240 కోట్లు, 4,000 ఉద్యోగాలు.
9) మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్, కన్వెన్షన్ : రూ. 400 కోట్ల పెట్టుబడులు, 750 ఉద్యోగాలు.
10) ఒబెరేయ్ విలాస్ రిసార్ట్ : రూ. 250 కోట్ల పెట్టుబడులు, 150 ఉద్యోగాలు.

గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు ఇలా ఉన్నాయి.

మొదటి ఎస్ఐపీబీ సమావేశం : విద్యుత్ రంగంలో రూ.11,902 కోట్లు, ఇతర రంగాల్లో రూ.72,085 కోట్లు... మొత్తం రూ. 83,987 కోట్లు ఆమోదం తెలిపింది. దీంతో 29,585 మందికి ఉద్యోగ అవకాశాలు.

రెండవ ఎస్ఐపీబీ సమావేశం : విద్యుత్ రంగంలో రూ.83,000 కోట్లు, ఇతర రంగాల్లో రూ.99,162 కోట్లు... మొత్తం రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ పెట్టుబడులతో 2,63,411 మందికి ఉద్యోగ అవకాశాలు.

మూడవ ఎస్ఐపీబీ సమావేశం : విద్యుత్ రంగంలో రూ.42,932 కోట్లు, ఇతర రంగాల్లో 1,844 కోట్లు... మొత్తం రూ. 44,776 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి రాకతో 19,580 ఉద్యోగాలు లభిస్తాయి.

ఇప్పటివరకు నాలుగు ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.4,32,584 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా మొత్తం 3,92,680 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.

# 26 వరకు రిమాండ్



- గుంటూరు సబ్ జైలుకు పోసాని
- జడ్జి ముందు కన్నీటి పర్యంతమైన పోసాని

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో సినీ నటుడు పోసాని కృష్ణమురళీని గుంటూరు తరలించారు పోలీసులు. కర్నూలు జైలు నుంచి ఆయన్ని నేరుగా జీజీహెచ్‌కు తీసుకువచ్చిన సీఐడీ పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జడ్జ్ ఇంటికి తీసుకెళ్లి ఆయన ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులో పోసాని తరువున న్యాయవాదులు పొన్నవోలు, పోలూరి వెంకటరెడ్డి అక్కడికి చేరుకుని వాదనలు వినిపించారు. అయితే కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఎదుట పోసాని కన్నీరు పెట్టుకున్నారు. తప్పు చేస్తే నరికేయండంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 70 ఏళ్ల వయస్సులో తనను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత కక్షలతోనే తనపై కేసులు పెట్టారంటూ బోరున విలపించారు. అయితే, సీఐడీ నమోదు చేసిన ఈ కేసులో పోసానికి గుంటూరు కోర్టు విధించింది. ఇరువైపుల వాదనలు విన్న తర్వాత.. ఈ నెల 26 వరకు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. దీంతో గుంటూరు సబ్ జైలుకు పోసానిని తరలించారు పోలీసులు.

# శ్రీనివాస కళ్యాణానికి అంగరంగ వైభవంగా ఏర్పాట్లు

- తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామానికి రానున్న సీఎం
- 15వ తేదీ సాయంత్రం శ్రీవారి కల్యాణం
- ఏ ప్రాంతంలో శ్రీనివాస కళ్యాణం జరుగుతుందో ఆ ప్రాంతం సస్యాశ్యామలం అవుతుంది
- టిటిడి చైర్మన్ బీ ఆర్ నాయుడు



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : అమరావతి రాజధాని వెంకటపాలెం గ్రామంలోని శ్రీ వేంటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 15 వ తేదీ శనివారం సాయంత్రం 6.30 నుండి 8.30 గంటల వరకు నిర్వహించనున్న శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం తెలిపారు. రాజధాని వెంకటపాలెంలో ఉన్న శ్రీవారి ఆలయ ప్రాంగణంలో టిటిడి చైర్మన్ ఈవో జె.శ్యామల రావు, టీటీడీ బోర్డు మెంబర్లతో కలిసి శ్రీనివాస కళ్యాణోత్సవం నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీనివాస కళ్యాణోత్సవం అనంతరం స్వామి వారి దివ్య ఆశీస్సులతో అమరావతి పనుల పునర్నిర్మాణానికి అంకురార్పణ చేస్తామన్నారు. మొదటి విడతగా దాదావు రూ. 37 వేల కోట్లతో పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తి అయిన నేపథ్యంలో శ్రీనివాస కళ్యాణోత్సవం జరగనుండడం ఆనందంగా ఉందన్నారు. ఏ ప్రాంతంలో అయితే శ్రీనివాస కళ్యాణం జరుగుతుందో ఆ ప్రాంతం సస్యాశ్యామలం అవుతుందని భక్తుల నమ్మకం అని అన్నారు.

గురువారం ఉదయం అమరావతి రైతులతో, రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అమరావతి పునర్నిర్మాణంలో రాజధాని రైతులతోపాటు, ప్రజలు కూడా అంతేకాకుండా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నదే ముఖ్యమంత్రి ఆకాకంక్ష అన్నారు. శ్రీవారి కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , ఎంపీలు ఇతర ప్రజా ప్రతినిధులు , రాజధాని రైతులు , వివిధ గ్రామాలు, ప్రాంతాల నుండి ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటారని తెలిపారు.

టిటిడి ఈవో జె.శ్యామలరావు మాట్లాడుతూ శ్రీనివాస కళ్యాణానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

# ఇంటర్మీడియట్ విద్యలో కీలక సంస్కరణలకు శ్రీకారం!

- ఇంటర్మీయట్ మ్యాథ్స్ ఎ-బి ఒకే సబ్జెక్ట్, బాటనీ-జువాలజీ ఒకే సబ్జెక్టు!
- ఫిబ్రవరి చివరి వారం నుంచే ఇంటర్మీడియట్ పరీక్షలు
- జూనియర్ కాలేజిల్లో ఎం.బైపిసి కోర్సుకు అనుమతి
- మంత్రి లోకేష్ అధ్యక్షతన ఇంటర్మీడియట్ బోర్డు సమావేశం



అమరావతి: విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పచ్చజెండా ఊపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 77వ సమావేశం అమరావతి అసెంబ్లీలోని పేషిలో మంత్రి లోకేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఇంటర్మీడియట్ లో విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజిలవైపు ఆకర్షించేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజిల విద్యార్థులను తయారుచేసేందుకు 2025-26 విద్యాసంవత్సరం నుంచి క్యాలెండర్ లో మార్పులు చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి జూన్ 1వతేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమవుతాయి.

జూన్ 1 వ తేదీకి బదులుగా ఏప్రిల్ 7 నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తారు.

2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలను మార్చి 2026కి బదులుగా ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహిస్తారు. ట్యాబులేషన్ రిజిస్టర్లను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. డిజిలాకర్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సజావుగా ఆన్లైన్ యాక్సెస్ ఉండేలా 1973 నుండి 2003 వరకు ఇంటర్మీడియట్ బోర్డు ఫలితాల డేటాను డిజిటలైజ్ చేస్తారు.

విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో సౌలభ్యాన్ని పెంచి, బహుళవిభాగ అభ్యాసాలను ప్రోత్సహించడానికి ఈ విద్యాసంవత్సరం నుంచే మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎలక్టివ్ సబ్జెక్టులను 2వ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. లాంగ్వేజెస్, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల్లోని 24 ఆప్షన్స్ లో ఒక సబ్జెక్టును 2వ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు. జూనియర్ కళాశాలల్లో ఎంబైపిసి ప్రవేశపెట్టాలనే ప్రజల డిమాండ్ కు అనుగుణంగా ఈ విద్యాసంవత్సరం నుంచి మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టులు అంతర్భాగాలుగా 6 సబ్జెక్టులతో ఎం.బైపిసి కోర్సును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 14 సబ్జెక్టులకు (సైన్స్, హ్యుమానిటీస్, లాంగ్వేజెస్ సహా) సవరించిన సిలబస్తో కొత్త పాఠ్యపుస్తకాలు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి. ఇంటర్మీడియట్ లో ఇప్పటివరకు రెండు సబ్జెక్టులుగా పరిగణిస్తున్న మ్యాథ్స్ ఎ, బిలను ఇకపై ఒకే సబ్జెక్టుగా విలీనం చేశారు. అలాగే బైపిసి విద్యార్థులకు బాటనీ, జువాలజీలు కలిపి ఒకే సబ్జెక్టు ఉండేలా విలీనం చేశారు. ఈ విలీనం వల్ల ఆయా సబ్జెక్టులకు సమాన వెయిటేజీ లభిస్తుంది. ఈఏపిసెట్, జెఇఇ, నీట్ వంటి పరీక్షలకు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను సన్నద్ధం చేయడానికి సమగ్ర పోటీ పరీక్షల కోచింగ్ మెటీరియల్ను ఇంటర్మీడియట్ బోర్డు తయారు చేస్తుంది. ఈ మెటీరియల్ బోర్డు పోర్టల్లో అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మెటీరియల్ ను ఉచితంగా అందజేస్తారు.

కాంపిటీటివ్ బేస్డ్ ఎసెస్ మెంట్ కోసం ఇంటర్మీడిటయట్, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాలప్రశ్నల్లో 10% తప్పనిసరిగా బహుళ-ఎంపిక ప్రశ్నలు (లు), ఖాళీలను పూరించే రూపంలో ఒక మార్కు ప్రశ్నలు ఉండేలా కొశ్చన్ పేపర్ రూపొందించాలని నిర్ణయించారు. స్థాయి ప్రకారం సిలబస్ సవరణ, వృత్తి విద్యార్థుల కోసం డ్యుయల్ సర్టిఫికేషన్ ను ప్రవేశపెట్టనున్నారు. నైపుణ్య పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి వీలుగా ప్రమాణాలను నిర్ణయించారు. సమగ్ర నిబంధనలను అభివృద్ధి చేయడం, స్థాయి ప్రకారం వృత్తిపరమైన సిలబస్ను మెరుగుపరచడం కోసం భారత ప్రభుత్వ జాతీయ మండలితో సహకరించేలా ప్రణాళిక రూపొందించారు. వృత్తిపరమైన కోర్సుల పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు పరిశ్రమలకు అవసరాలకు తగ్గట్టుగా సవరించడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటయ్యే పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరక్టర్ నారాయణ భరత్ గుప్త, ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృతికాశుక్లా, పాఠశాల విద్య డైరక్టర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష స్పెషల్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాస్ రావు, ఎంప్లాయ్ మెంట్ అండ్ ట్రైనింగ్ డైరక్టర్ జి.గణేష్ కుమార్, ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, సెకండరీ ఎడ్యుకేషన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఓపెన్ స్కూల్స్ సెక్రటరీ నరసింహరావు, ఆంధ్రా వర్సిటీ వైస్ చాన్స్ లర్ జివి రాజశేఖర్, పద్మావతి వర్సిటీ విసి వి.ఉమ, ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విసి శారద రాజ్యలక్ష్మిదేవి, ఎన్ టిఆర్ హెల్త్ యూనివర్సిటీ విసి డిఎస్ విఎల్ నరసింహం, విశాఖపట్నం విఎస్ కె డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, మొవ్వ క్షేత్రయ్య గవర్నమెంట్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ప్రసాద్ శాస్త్రి, కర్నూలు ఎపి రెసిడెన్షియల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జయం శ్రీనివాస గుప్త, క్రోసూరు ఎపిఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీమతి మేరీ సుశాన్, నాదండ్ల కెజిబివి ప్రిన్సిపాల్ మాధవీ లత, నారాయణ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ఆనంద్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసిన మొల్ల

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తెలుగు సాహిత్యంలో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) చెరగని ముద్ర వేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. తెలుగు సాహిత్యంలో ఆమె రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. గురువారం మొల్ల జయంతి సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఆమె చిత్రపటానికి మంత్రి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, సామాన్య కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్లమాంబ శ్రీరాముడిని అచంచలమైన భక్తి ప్రపత్తులతో కొలిచారన్నారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించించిన మహనీయురాలు మొల్ల అని కొనియాడారు. తెలుగు వాడుక భాషలోకి ఆమె రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతగాంచిందన్నారు. మొల్ల తన రచనలలో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చేవారన్నారు. తెనాలి రామలింగడ వంటి దిగ్గజ కవులకు మొల్ల సమకాలీనరాలు అని చరిత్ర చెబుతోంది. కడపలోని గోపవరం గ్రామంలో జన్మించిన మొల్ల నేటి తరం మహిళాలకు, కవయిత్రిలకు ఆదర్శమని కొనియాడారు. ఆమె రచనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో టిడ్కో ఇళ్లు : మంత్రి నారాయణ

## రుణాలు రీ ఇన్ స్టాల్మెంట్ చేస్తాం




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏడు లక్షలకు పైగా ఇళ్లు టిడ్కోలో మంజూరు అయ్యాయి. 4 లక్షలకు పైగా ఇళ్లకు టెండర్లు పిలిచామ్ని మంత్రి నారాయ్ణ తెలిపారు.. అలాగే కేవలం గత ప్రభుత్వం 57 వేల ఇళ్ల నిర్మాణం చేసింద్ని మ్రికొన్నింటిని ర్దు చేసింద్ని వెల్లించారు. అసెంబ్లీలో టిడ్కో ఇళ్లపై క్వశ్చన్ అవర్‌లో సభ్యులు సభ్యులు మాధవి రెడ్డి.. కొండబాబు.. సింధూర రెడ్డి.. జోగేశ్వర రావు ప్రశ్నలు వేశారు.. బ్యాంక్ లోన్ కట్టలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు వెంటనే టిడ్కో ఇళ్లు ఇవ్వాలని సభ్యులు కోరారు.. వడ్డీలు కట్టలేక.. అటు అద్దె ఇళ్లల్లో ఉండలేక ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు..దీనికి నారాయ్ణ స్మాధానం చెబుతూ, ఇప్పికే టిడ్కో ఇళ్ల కోసం డ్బులు క్టిన వారికి సాధ్యైనంత త్ర్వో ఇళ్లు ఇస్తామ్నారు.. అలాగే బ్యాంక్ లోన్ లు సైతం రీ ఇన్ స్టాల్మెంట్ చేస్తామ్ని తెలిపారు.. ఇక టిడ్కో ఇళ్లలో మంచి సౌకర్యాలు ఉన్నాయి. రోడ్లు. పార్కులు. స్కూళ్లు.. షాపింగ్ కాంప్లెక్స్ ఇలా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అప్పట్లో సీఎం చంద్రబాబు టిడ్కో ఇళ్ల దగ్గర ఎకనామిక్ ఆక్టివిటీ ఉండాలన్నారు.. 2 ఎకరాలు టిడ్కో ఇళ్ల కాంప్లెక్స్ దగ్గర ఉంచితే అది కూడా గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వానికి ప్లానింగ్ లేదు.. ఇల్లు ఇవ్వకుండానే లోన్ తీసుకున్నారు. 77 వేల మందిపై గత ప్రభుత్వం లోన్ తీసుకుని ఇళ్లు ఇవ్వలేదు.. ప్రస్తుతం ప్రభుత్వం 140 కోట్లు బాంక్ లోన్ కట్టాలి. కొన్ని ఇళ్లను రద్దు చేసి వేరేవారికి గత ప్రభుత్వం ఇచ్చింది. వీటికి సంబంధించి కూడా మార్పులు చేస్తామ్ని మంత్రి నారాయణ.. అన్నారు.

# 70 టిఎంసిలకు పడిపోయిన నీటి నిల్వ

# వేసవి రాకముందే ఖాళీ అవుతున్న జలాశయం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 70.2053 టిఎంసిలకు పడిపోయాయి. జలాశయ డెడ్ స్టోరేజీ 34 టిఎంసిలు. ఈ దృష్ట్యా ఇంకా 36 టిఎంసిలను మాత్రమే వాడుకునేందుకు వీలుంది. ఇప్పటికే విద్యుదుత్పత్తి కోసం తెలంగాణ 358.94 టిఎంసిలు, మన రాష్ట్రం 199.38 టిఎంసిలను కలిపి మొత్తం 558.32 టిఎంసిల నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదిలేశాయి. అవి కాకుండా పోతిరెడ్డిపాడు ద్వారా 240 టిఎంసిలను పెన్నా బేసిన్‌కు తరలించారు. హంద్రీనీవా, గాలేరునగరి, ముచ్చుమర్రి, మల్యాల తదితర ఎత్తిపోతల పథకాలతో కలిపి ఇప్పటివరకు శ్రీశైలం నుంచి 646 టిఎంసిల నీటిని విడుదల చేశారు. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. అక్టోబర్ 25 నాటికి శ్రీశైలం రిజర్వాయర్ 215 టిఎంసిలతో కళకళలాడింది. ప్రస్తుతం వేసవి రాకముందే పరిస్థితి తారుమారవుతోంది. శ్రీశైలం జలాశయ గరిష్ట నీటిమట్టం 885 అడుగులు. 810 అడుగుల వరకు ఉంటే హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి నీటిని తీసుకోవచ్చు.



ప్రస్తుతం 845.10 అడుగుల నీటిమట్టం ఉంది. హంద్రీనీవా కాలువకు ఈ నెల 15 నుంచి నీటి సరఫరా ఆపేస్తామని జలవనరుల శాఖ అధికారులు ప్రకటించారు. కర్నూలు జిల్లాలో హంద్రీనీవా ప్రధాన కాలువ వెంట నందికొట్కూరు నుంచి పత్తికొండ వరకు రైతులు రబీలో పంటలు వేశారు. నీటిని ఆపేస్తుండడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో వేరుశనగ, మిరప, కూరగాయలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో కసాపురం నుంచి జీడిపల్లి వరకు 20 వేల ఎకరాలకు నీరందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. రబీ పంటలు పూర్తి స్థాయిలో చేతికి రావాలంటే ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలి. ఇరు తెలుగు రాష్ట్రాలూ విద్యుదుత్పత్తి పేరిట పోటీపడి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంపై పర్యావరణవేత్తలు,

సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లమల అభయారణ్యంలో వన్యప్రాణుల మనుగడకు అవసరమైన మేరకు జలాశయంలో నిల్వలు ఉండేలా చూడాలంటున్నారు. ఉన్న నీటి నిల్వలను జాగ్రత్తగా వాడుకోవాలని, 90 టిఎంసిలకు తగ్గకుండా నిర్వహించాలని కోరుతున్నారు. ఆ దిశగా కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తుంగభద్రలోనూ తగ్గిన నీటి నిల్వ

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నీటిని అందించే తుంగభద్ర జలాశయంలోనూ వేసవి రాకముందే నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ఈ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 105.473 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 23.79 టిఎంసిలు ఉన్నాయి. జలాశయ గరిష్ట నీటిమట్టం 1,633 అడుగులు కాగా, 1,601.69 అడుగులకు పడిపోయాయి. గతేడాది ఆగస్టు 11న తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ ప్రమాదవశాత్తు కొట్టుకుపోవడంతో దాదావు 40 టిఎంసిల నీరు వృథాగా పోయింది.

# మహిళా ఎస్సై పట్ల ఆకతాయిల దాడి ఘటన

- విజయనగరం జిల్లాలో ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం
- హద్దులు మీరి ప్రవర్తించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- నృత్యం చేస్తున్న మహిళలపై తాగుబోతుల అసభ్య ప్రవర్తన



అమరావతి: విజయనగరం జిల్లాలో మహిళా ఎస్సై పట్ల ఆకతాయిల దాడి ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో హద్దులు మీరి ప్రవర్తించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా.. వేపాడ మండలం గుడివాడ గ్రామంలో డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమంలో నృత్యం చేస్తున్న మహిళలపై తాగుబోతులు అసభ్యంగా ప్రవర్తించారు. ఈ క్రమంలో.. అడ్డుకోబోయిన మహిళా ఎస్సై పైనా దురుసుగా ప్రవర్తించారు. ఇది క్షమించరాని నేరమని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో ఫోన్‌లో మాట్లాడి అనిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ఈ ఘటనలో 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. జాతర పేరుతో మహిళలపట్ల పోకిరీ వేషాలు వేస్తే సహించబోమని హోంమంత్రి అనిత హెచ్చరించారు.మరోవైపు.. ఈ రోజు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శక్తి యాప్పై హోంమంత్రి వంగలపూడి అనిత రివ్యూ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల భద్రతే తమకు ప్రధానం అని పేర్కొన్నారు. శక్తి యాప్ను ఇప్పటికే చాలామంది డౌన్లోడ్చేసుకున్నారని.. ఇంకా మెరుగ్గా అప్డేట్ చేస్తామని చెప్పారు. ఈ యాప్‌లో పది సేవలు ఉన్నాయని తెలిపారు. గృహహింస, అత్యాచారం, లైంగిక దాడులు, ఈవ్ టీజింగ్, యాసిడ్ దాడులు, మానవ అక్రమ రవాణా, బలవంతపు వివాహాలు, బాల్య వివాహాలు, కిడ్నాప్, సైబర్ బుల్లీయింగ్, ఫొటో మార్ఫింగ్ తదితర నేరాలపై ఫిర్యాదు చేయవచ్చని హోంమంత్రి పేర్కొన్నారు.

# డీలిమిటేషన్ అంటే దక్షిణాది రాష్ట్రాలపై ప్రతికారమే

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : నియోజకవర్గాల పునర్విభజన పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి స్పందించారు. డీలిమిటేషన్ ద్వారా దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ ప్రతికారం తీర్చుకోవాలని చూస్తోందంటూ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ ప్రభావం లేనందునే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. డీలిమిటేషన్పైజ బీజేపీ ఏకపక్షంగా వ్యవహరించకుండా అఖిలపక్షం ఏర్పాటు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే కుట్ర బీజేపీ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డన్న చెప్పిన మాటలు అక్షర సత్యం. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేయడం అంటే కుటుంబ నియంత్రణ పాటిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేయడమే.



1971 తర్వాత సౌత్ కంటే ఉత్తర భారతదేశంలోనే అత్యధికంగా జనాభా పెరిగింది. ఒక్క ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాన్ని ఉదాహరణగా తీసుకుంటే 8 కోట్ల నుంచి 24 కోట్లకు జనాభా పెరిగింది. పెరిగే స్థానాలు కలుపుకుంటే.. రెండు రాష్ట్రాల నుంచే ఏకంగా 222 ఎంపీలు లోక్ సభలో ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. ఇదే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం పెరిగే సీట్ సంఖ్య 12 మాత్రమే. దక్షిణాది రాష్ట్రాల్లో పెరిగే సీట్లు పదుల సంఖ్యలో ఉంటే, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆ సంఖ్య వందలాదిగా ఉంటోంది. డీలిమిటేషన్పై బీజేపీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా అఖిలపక్షం ఏర్పాటు చేయాలి. దీనిపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించకపోవడం తగదు. దాటవేసే ధోరణి అవలభించడం అన్యాయం. బీజేపీతో కూటమి పొత్తులో ఉన్నారని మౌనం వహిస్తే.. చేతులు కాలాక ఏం పట్టుకున్నా ఉపయోగం లేదని గ్రహించాలి. డీలిమిటేషన్పైన చంద్రబాబు వైఖరేంటో చెప్పాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తరువున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.



# సంపాదకీయం

suryaeditpage@gmail.com

ఈ మార్చ్ 11 న భారత అంతర్గత జలమార్గాల అధికార సంస్థ (ఇన్లాండ్ వాటర్ వేస్ అధారిటీ ఆఫ్ ఇండియా)వివిధ ప్రభుత్వ సంస్థలతో ఒక ఎంఓయు పై సంతకం చేసిందని,ఆ సంస్థల్లో డిల్లి ఇరిగేషన్ అండ్ ఫ్లడ్ కంట్రోల్ డిపార్ట్మెంట్ ,డిల్లి డెవల ప్మెంట్ అధారిటీ, డిల్లి జల్ బోర్డ్ ఉన్నాయనిబీ యమునా నదిపై సోనియా విహార్ నుండి జగత్పూర్ వరకు నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణంలో వాటర్ టూరిజాన్ని అభివృద్ధి చేయడమే దీని లక్ష్యమని అధికారిక ప్రకటన వెలువడింది. జల రవాణాలో ప్రకృతిని పరిరక్షించే చర్యలు తీసుకోవడం, ఎలక్ట్రిక్ మరియు సోలార్ హైబ్రిడ్ పడవల ద్వారా ఇరవై నుండి ముప్పై మందిని ఒకేసారి తీసుకువెళ్ళడంబీ ఈ బోట్లలో బయో-టాయిలెట్లు, లైఫ్ జాకెట్లు వంటి ఆధునిక భద్రతా సదుపాయాలు అందుబాటులో ఉంచడం , ఐడబ్ల్యుఏఐ రెండు హెచ్‌డిపిఇ జెట్టీలను ఏర్పాటు చేయడం , వంటి వాటి ద్వారా నదిలో నౌకా రవాణా సౌలభ్యాన్ని మరింత మెరుగుపరిచే దిశలో పని చేయడం ద్వారా వాటర్ టూరిజంరంగంలో అభివృద్ధి సాధించే విధంగా ఈ కార్యా చరణ రూపు దిద్దుకోబోతుంది. దీని వల్ల ప్రపంచ స్థాయి టూరిజం స్థాయికి డిల్లిని తీసుకువెళ్ళాలన్న ఆశావాహక దృక్పథంతో డిల్లి ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఉన్నారు. ఇందులో భాగంగా యమున నీటిని శుద్ధి చేయడం,అందంగా తయారు చేయడం,మొత్తం మీద ఇప్పటికే కాలుష్యం,ట్రాఫిక్ లాంటి అంశాలతో ప్రజలు నివసించదగ్గ ప్రాంతాల జాబితా నుండి క్రమక్రమంగా దూరంగా జరుగుతూ ఉన్న దేశ రాజధాని రూపు రేఖలు మార్చే విధంగా చర్యలు తీసుకోవాలన్న గట్టి పట్టుదలే కనిపిస్తూ ఉంది.

## డిల్లీలో బిజెపి మార్క్ 'యమున'తో ఆరంభమవుతుందా?

దాదాపు మూడు దశాబ్దాల పోరాటం తర్వాత బిజెపి ఇక్కడ పట్టుని సాధించింది. బిజెపి తన మార్క్ ను ఇక్కడ నిలబెట్టుకోవడానికి తప్పనిసరిగా గత ప్రభుత్వాలు విఫలమైన ఈ యమునా విషయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పకడ్బంది ప్రణాళికతో కొంత ప్రగతి సాధించే అవకాశం ఉంది.లేకపోతే ఏదైనా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో చూపే ఉత్సాహంగానూ ఇది మిగిలిపోనూ వచ్చు. నిజానికి యమున ఆప్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటి నుండి యమున ఒక వివాదాస్పద అంశంగానే ఉంది. యమునా నది కాలుష్యానికి కారణంగా ఓ పక్క ఆం ఆద్మీ పార్టీ బిజెపిని విమ ర్శిస్తే ,ఇంకో పక్క బిజెపి ఆం ఆద్మీ పార్టీనే కారణం అని వాదించింది. ఈ విషయంగా కేజ్రివాల్ చేసిన వ్యాఖ్యల వల్ల న్యాయపరమైన సమస్యలను కూడా ఎదుర్కొన్నారు. యమునా నదిని హర్యానాలో బిజెపి విషతుల్యం చేస్తుందని కేజ్రివాల్ ఆరోపణ చేసారు గతంలో. నిజానికి కొందరు విశ్లేషకులు కేజ్రివాల్ ఓటమికి ఒక కారణం యమున విషయంలో సరైన చర్యలు తీసుకోకపోవడం అని కూడా అభిప్రాయం వ్యక్తం చేసారు. డిల్లిలో డెబ్భై శాతం మంది జనాభాకి నీటిని అందించే యమున కాలుష్యకోశంగా మారిపోయింది. నగరీకరణ,పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థాలను నీటిలోకి వదలడం వల్ల యమునలో కాలుష్యం పెరిగిపోతూనే ఉంది. ఇక డిల్లి,హర్యానా రాష్ట్రాల మధ్య యమునా నది గురించి ఎప్పటినుండో వివాదాలు నడుస్తూనే ఉన్నాయి.

1993 లో డిల్లిలో శాసనసభ ఏర్పడిన తర్వాత యమునా నది జల పంపిణి విషయం గురించి 1994 మే నెలలో ఉత్తరప్రదేశ్,డిల్లి,హర్యానా, రాజస్థాన్,హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై ఐదు రాష్ట్రాల ముఖ్య మంత్రులు సంతకాలు కూడా చేసారు. కాని డిల్లిలో నీటి ఎద్దడి ఎక్కువ ఉండటం, డిల్లికి సరిగ్గా నీరు అందకపోవడం వల్ల హర్యానా రాష్ట్రాన్ని అడగటం,వారు సరిగ్గా స్పందించకపోవడం,కోర్టును ఆశ్రయించడం, 2018 లో ఈ ఘటనలు జరుగుతున్న సమయంలో బిజెపి ప్రభుత్వం అక్కడ ఉండటం వంటివి ఆప్ పార్టీ బిజెపిని నిందించేలా చేసాయి. 2018 తర్వాత 2021 లో కూడా ఈ విషయం గురించి డిల్లి మళ్ళీ కోర్టు కెక్కింది. సుప్రీమ్ కోర్టు డిల్లి ప్రభుత్వ పిటిషన్ ను కొట్టివేయడంతో లాభం లేకుండా పోయింది. 2023 లో డిల్లీలో వరదలు పోటెత్తిన సమయంలో కూడా హర్యానా అసంబద్ధంగా చేసిన నీటి విడుదల చేయడం వల్లే ఆ పరిస్థితి వచ్చిందని ఆప్ ప్రభుత్వం ఆరోపణలు చేసింది. ఇక యమున నదిని శుద్ధి చేయడానికి గతంలో చేపట్టిన ప్రాజెక్టుల వివరాలు గమనిస్తే, 1993 లో యమునా యాక్షన్ ప్లాన్ అనే ప్రాజెక్టును , జైకా (జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ) సహకారంతో యమునా నది శుద్ధి కోసం ప్రారంభించారు. ఇది యమునా యాక్షన్ ప్లాన్ -1 (1993-2003) మరియు యమునా యాక్షన్ ప్లాన్ -II (2003-2011) అనే రెండు దశల్లో అమలు లోకి వచ్చింది.తర్వాత 2014 లో నమామి గంగే ప్రోగ్రామ్ ప్రారంభించారు. దీని ద్వారా గంగా నది మరియు దాని ఉపనదులను శుభ్రపరచడం, పునరుజ్జీవనం చేయడం వంటివి చేయాలనుకున్నారు.

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం, సంబంధిత సంస్థల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కాలేకపోయాయి. ప్రాజెక్టులకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం, అవినీతి కారణంగా నిధుల దుర్వినియోగం జరగడం వల్లా, ప్రజల్లో యమునా నది పరిరక్షణపై సరైన అవగాహన లేకపోవడం, వారి సహకారం లేకపోవడం వల్లా, ప్రాజెక్టుల అమలులో సాంకేతిక సమస్యలు ఎదురుకావడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించకపోవడం, ప్రాజెక్టులలో పర్యావరణ అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడం, దీని వల్ల ప్రాజెక్టులు నిలిచిపోవడం వంటివి యమునా విషయంలో ప్రగతి సానుకూలతను అసాధ్యం చేశాయి. ఇప్పుడు యమునా నది విషయంలో బిజెపి తీసుకునే ప్రతి నిర్ణయం డిల్లిలో ఒక రాజకీయ వ్యూహంగానే మారే అవకాశం ఉంది. ఎన్ని చోట్లా బిజెపి పట్టు సాధించినా డిల్లిలో విజయమే బిజెపి శక్తిని యావత్ భారత్ దేశం గుర్తించేలా చేసింది. ఇప్పుడు డిల్లీలో అదే స్థాయి ప్రతిష్టను నిలబెట్టుకోవడం బిజెపికి ఎంతో ముఖ్యం.గతంలో ఆప్ ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులు ఏవి లేకపోవడంబీ నిధుల విషయంలో వైఫల్యం అన్న ప్రశ్నే లేకపోవడం బిజెపికి యమున విషయంలో కలిసి వచ్చే అంశాలు. కాని ఇప్పటికే కాలుష్యంతో అపఖ్యాతి మూటగట్టుకున్న యమునానది ని శుద్ధి చేయడం, దాని ద్వారా రవాణా వ్యవస్థను నిర్మించడంబీ ప్రపంచ స్థాయికి తీసుకువెళ్ళడం అంత సులభమైన విషయం కూడా కాదు.దేశంలో నదులను శుభ్రపరిచే కార్యక్రమాలను ప్రభుత్వాలు ప్రకటించడంబీఅవి అలాగే ఏళ్లకు తరబడి అలాగే ఉండటం కూడా అనుభవంలోకి వచ్చిన విషయమే. గంగానది విషయంలో ఇటువంటి చర్యలు ఏవి కూడా పెద్దగా ప్రయోజనాన్ని ఇవ్వలేదు. ప్రభుత్వాలు ఉత్సాహంతో మొదలుపెట్టినా,తర్వాత దాని ప్రగతి దిశలో ప్రభావవంతమైన మార్పు కనబడిన సందర్భాలు కూడా అరుదే. కాకపోతే దేశ రాజధానిలో మొదటిసారి బిజెపి అధికారంలోకి రావడం,అందులోను గతంలో బిజెపినే యమునా నది దుస్థితికి కారణం అని కేజ్రివాల్ ఆరోపించడం వల్లబీ ఇప్పుడు బిజెపి యమునా నది విషయంలో ఎలా ముందుకు ముందుకు సాగుతుందన్న ఆసక్తి మాత్రం దేశంలో ఉంది. యమునా నది విషయంలో బిజెపి చెప్పినవన్నీ చేయగలిగితే ఇక బిజెపి మార్క్ దేశరాజధానిలో పడినట్టే!

# ట్రంప్ ఆధిపత్య కాంక్షతో ప్రపంచం అల్లకల్లోలం?

■ సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలనుకునే నియంతృత్వ ధోరణి ■ "ఫేక్ న్యూస్ " అంటూ మీడియాపై దూషణ భూషణలు ■ ప్రెసిడెంట్ లా కాకుండా ప్రపంచానికే డిక్టేటర్ గా వ్యవహరిస్తున్న వైనం ■ మిలిటరీ రంగంలో పని చేసిన అనుభవం ఉన్న అధ్యక్షులు అయినా ఈ తరహా తీరు కనిపించలే ■ సాంప్రదాయ రాజకీయ నాయకుల కంటే పూర్తిగా భిన్నంగా వ్యవహార తీరు




తేజస్వి
హైదరాబాద్


ట్రంప్ తన ఆధిపత్య కాంక్షతో, 'అమెరికా ఫస్ట్' ముసుగుతో ప్రపంచం మీద తన అధికారాన్ని చెలాయించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తూనే ఉన్నాడు. కెనడా, గ్రీన్ లాండ్, గాజా, పనామా కాలువ,ఇలా వీలైనంత వరకు ఒక దేశాధ్యక్షుడిగా కాకుండా కేవలం సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలనుకునే చక్రవర్తి నియంతృత్వ ధోరణే ఇప్పుడు ట్రంప్ లో కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ప్రజాస్వామ్యం ప్రపంచంలో ఉందన్న విషయం ట్రంప్ ఎరుకలో లేనట్టే ఉంది. అమెరికాకు ప్రెసిడెంట్‌లా కాకుండా ప్రపంచానికే తానొక డిక్టేటర్ అన్న శైలిలో ప్రపంచానికే ప్రత్యక్ష,పరోక్ష హెచ్చరికలు తానూ రెండో సారి అధికారంలోకి వచ్చినప్పటి నుండే పంపిస్తూ ఉన్నాడు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక తీసుకున్న నిర్ణయాలన్నీ కూడా ఇప్పుడు ప్రపంచ మాంద్యానికి దారి తీసేలా ఉన్నాయని ఎందఱో విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమెరికా చరిత్రలో ట్రంప్ లా ప్రవర్తించిన నాయకుడు ఇంకొకరు లేరు. అలా ఉండటానికి మూలాలు కూడా అమెరికా రాజకీయ చరిత్రలోనే కనబడతాయి. జార్జ్ వాషింగ్టన్ నుండి బరాక్ ఒబామా వరకూ అధ్యక్షులందరికి రాజకీయ అనుభవం ఉంది, అది లేని ఇద్దరు ముగ్గురు అధ్యక్షులకు కూడా మిలిటరీ రంగంలో అయినా పని చేసిన అనుభవం ఉంది.కాని వీటితో పరిచయం,అనుభవం లేకుండా ఎన్నికైనా ఏకైక అమెరికా అధ్యక్షుడు ట్రంప్. అందుకే ఇంతకుముందు అధ్యక్షులకు ట్రంప్ విరుద్ధంగా కనబడతాడు. ట్రంప్ పూర్తిగా వ్యాపార రంగం నుండి వచ్చిన వ్యక్తి. ఆయనకు గతంలో ఎలాంటి ప్రభుత్వ పదవి అనుభవం లేదు. ఇది అమెరికా చరిత్రలో అరుదైన సంఘటన. ఆయన సంభాషణ శైలి రాజకీయ నాయకులకు విభిన్నంగా, నేరుగా, ఇంకా దూకుడుగా కూడా ఉండేది. . ట్రంప్ అనేక సందర్భాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

ఇంకా చెప్పాలంటే 2016 ఎన్నికల సమయంలో ట్రంప్ ఎందరో యుద్ధ వీరులను కూడా అవహేళన చేసాడు. ఆయన రాజకీయ శైలి కూడా సాంప్రదాయ రాజకీయ నాయకుల కంటే పూర్తిగా భిన్నంగా ఉండేది. ఇతర అధ్యక్షులు నిదానంగా, క్రమశిక్షణగా మాట్లాడే వారు. అయితే ట్రంప్ తన ప్రసంగాల్లో విజ్ఞతను ప్రదర్శించే భాష ప్రయోగించకుండా నేరుగా, బహిరంగంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు. అమెరికా అధ్యక్షులంతా ఇతర దేశాలతో మైత్రీ సంబంధాలను కొనసాగించే విధంగా వ్యవహరించేవారు. కానీ ట్రంప్ చైనా, మెక్సికో, జర్మనీ, కెనడా, ఇరాన్ మొదలైన దేశాలతో కఠినంగా వ్యవహరించారు. ప్రత్యేకంగా చైనాతో ఆయన వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించారు. ఇతర అధ్యక్షులు సాధారణంగా మీడియాను సముచితంగా సమాధానాలిచ్చే విధంగా వ్యవహరించేవారు. అయితే, ట్రంప్ మీడియాను అనేకసార్లు "ఫేక్ న్యూస్ " అని దూషించేవారు. ముఖ్యంగా సి ఎన్ ఎన్ ,ద న్యూయార్క్ టైమ్స్ లాంటి పత్రికలను తీవ్రంగా విమర్శించేవారు. అలాగే, ఆయన సోషల్ మీడియాలో (ట్విట్టర్ , ఫేస్బుక్) ప్రత్యక్షంగా ప్రజలతో మాట్లాడే శైలిని అవలంబించారు. ట్రంప్ పాలనలో అమెరికాలో జాత్యహంకార ఘటనలు పెరిగాయని విమర్శకులు చెబుతారు. ఆయన అనేక సార్లు శ్వేతజాతీయ అగ్రశ్రేణివాదులకు అనుకూలంగా మాట్లాడారని ఆరోపణలు ఉన్నాయి. 2020లో జార్జ్ ఫ్లాయిడ్ మరణం తర్వాత 'బ్లాక్ లైవ్స్ మేటర్' ఉద్యమం ఉధృతమైన సమయంలో ఆయన స్పందన చాలా వివాదాస్పదమైంది.

ప్రపంచాన్ని అల్లకల్లోలం చేసిన కరోనా విషయంలో ట్రంప్ శైలి కూడా అతని ఓటమికి కారణమైంది. ట్రంప్ మొదట్లో కరోనా వ్యాప్తిని చిన్న సమస్యగా చూశారు. 2020 ప్రారంభంలో అమెరికాలో కొన్ని వందల కేసులు నమోదవుతున్నప్పటికీ, ట్రంప్ దీన్ని పెద్ద ముప్పుగా పరిగణించలేదు."ఇది త్వరలో మాయమవుతుంది" అని అనేక సందర్భాల్లో పేర్కొన్నారు.దీంతో అమెరికా ప్రభుత్వం ముందస్తుగా సంసిద్ధం కాలేకపోయింది. ట్రంప్ మాస్క్ ధరించడం అవసరం లేదని మొదట్లో చెప్పారు. వ్యాక్సిన్ అభివృద్ధి జరిగేలోపే హైడ్రోక్సీ క్లోరోక్విన్ వంటి ఔషధాలను కరోనాకు చికిత్సగా ప్రచారం చేశారు. తప్పుడు సమాచారం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొని మరిన్ని మరణాలకు దారి తీసింది. వ్యాక్సిన్ 2020 చివరలో తయారయినప్ప టికీ, ప్రజలకు సమర్థంగా పంపిణీ చేయడంలో అమెరికా ప్రభుత్వం విఫలమైంది. మొదటిగా, వ్యాక్సిన్ పంపిణీకి సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల అనేక మంది మరణించారు. అమెరికాలో 2021 నాటికి 500,000 మందికిపైగా కరోనా వల్ల మరణించారు.అమెరికా ఆర్థిక వ్యవస్థ భారీ మాంద్యంలోకి వెళ్లింది.అనేక చిన్న వ్యాపారాలు మూతపడ్డాయి, ఉద్యోగ నష్టాలు భారీగా నమోదయ్యాయి.

ట్రంప్ చైనాపై అధిక పన్నులు (టారిఫ్లు) విధించడం ద్వారా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించారు.ట్రంప్ ప్రభుత్వం చైనా నుండి దిగుమతయ్యే ఉత్పత్తులపై అధిక పన్నులను విధించింది. అమెరికా పరిశ్రమలను రక్షించడం, చైనాను అధిక వ్యాపార ఒప్పందాలకు ఒప్పించడమే దీని లక్ష్యం.కానీ చైనా కూడా ప్రతిస్పందనగా అమెరికా ఉత్పత్తులపై భారీ పన్నులు విధించింది. చైనా అమెరికా నుండి సోయా బీన్, కూరగాయలు, పత్తి వంటి ఉత్పత్తుల దిగుమతులను తగ్గించింది. దీంతో అమెరికా రైతులకు పెద్ద నష్టం కలిగింది. హువాయ్, టిక్ టాక్ , వుయ్ చాట్ వంటి చైనా కంపెనీలపై ట్రంప్ ఆంక్షలు విధించారు. కానీ దీనివల్ల అమెరికా టెక్ కంపెనీలు (ఆపిల్ ,క్వాల్ కం )చైనా మార్కెట్లో తమ వ్యాపారాన్ని కోల్పోయాయి. మొత్తం మీద వీటి వల్ల అమెరికా రైతులకు ప్రభుత్వం నష్టపరిహారంగా బిలియన్ల డాలర్ల సబ్సిడీలు ఇవ్వాల్సి వచ్చింది. అమెరికా వినియోగదారులకు చైనా ఉత్పత్తుల ధరలు పెరిగాయి.

ట్రంప్ అమలు పరిచిన పన్నుల విధానం వల్ల కూడా విమర్శలు ఎదుర్కొన్నారు. పెద్ద కార్పొరేట్ కంపెనీలకు పన్ను రేటును 35% నుండి 21%కి తగ్గించారు. కానీ మధ్య తరగతి ప్రజలకు పెద్దగా ప్రయోజనం కలిగించలేదు. తక్కువ పన్నుల వలన ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయింది. ఫలితంగా అమెరికా రుణం 2017-2020 మధ్య 7 ట్రిలియన్ డాలర్ల మేర పెరిగింది.ఈ చర్యల వల్ల ప్రభుత్వ సేవలకు (ఆరోగ్యం, సామాజిక భద్రత) నిధులు తగ్గాయి.పెద్ద కంపెనీలు లాభపడగా, సామాన్య ప్రజలు దీని ప్రయోజనాన్ని అనుభవించలేకపోయారు.

ట్రంప్ 2020లో తాలిబాన్తో ఒప్పందం చేసుకున్నారు. అమెరికా సైన్యం ఉపసంహరణకు గడువు విధించారు. కానీ తాలిబాన్ ఒప్పందాన్ని పాటించలేదు, ఫలితంగా 2021లో అఫ్ఘానిస్థాన్ పూర్తిగా తాలిబాన్ చేతిలోకి వెళ్లిపోయింది.దీనితో అమెరికా మిత్ర దేశాలు ట్రంప్ పాలనను నమ్మలేకపోయాయి. అఫ్ఘాన్ ప్రజలు అమెరికా మద్దతు కోల్పోయారు.ఇలా ఎటూ చూసినా మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కూడా తనకు తోచిందే తప్ప దేనికి ప్రాధాన్యత ఇవ్వలేదు. వీటికి తోడు ట్రంప్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో రెండు సార్లు ఇంపీచ్మెంట్కు గురయ్యారు. మొదటి సారి ఉక్రెయిన్ విషయంలో వచ్చిన ఆరోపణల వల్ల అయితే , రెండవసారి 2021 జనవరి 6న అమెరికా క్యాపిటల్ భవనంపై దాడి జరిగిన నేపథ్యంలో ఆయనకు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశ పెట్టారు. ఇతర అధ్యక్షులు ఎన్నికల్లో ఓడినప్పుడు పరాజయాన్ని అంగీకరించేవారు. కానీ ట్రంప్ 2020 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత, ఫలితాలను అంగీకరించలేదు. ఆయన "ఎన్నికల మోసం" జరిగిందని చెప్పి కోర్టుల్లో పిటిషన్లు వేశారు. మొదటిసారి అధికారంలోకి రాగానే తన కూతురు ఇవాంకా ను,ఆమె భర్త జారెడ్ కు ప్రాధాన్యత ఉండే హోదాల్లోకి తీసుకున్నా డు. తర్వాత బరాక్ ఒబామా పర్యావరణానికి హాని కలిగిస్తుందని భావించి వద్దనుకున్న ఆయిల్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపాడు. రెం డోసారి ఎన్నికల్లో పోటి చేస్తున్నప్పుడు కూడా తానూ తిరిగి అధికారంలోకి రాకపోతే అమెరికాలో రక్తపాతమే అని వ్యాఖ్య చేసారు.

ఇప్పుడు రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ట్రంప్ వైఖరిలో ఏ మార్పు రాలేదు. కాని అప్పటికి ఇప్పటికి ప్రపంచ దేశాల్లో కూడా మార్పు వచ్చింది. ట్రంప్ అధికార దాహాన్ని, వ్యాపార మన స్తత్వాన్ని సహించే సహనం ఇప్పుడు ఏ దేశానికి ఉన్న ఛాయలు కనబడటం లేదు. కాని ఇప్పుడున్న ప్రధాన సమస్య ఏమిటంటే ట్రంప్ వల్ల ప్రపంచ రాజకీయాలు దేశాధినేతల మధ్య యుద్ధంగా మారిపోతాయా? ట్రంప్ తో సమానంగా అదే స్థాయి యుద్ధాన్ని మిగిలిన దేశాలు కూడా ప్రదర్శిస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ,రక్షణా వ్యవస్థలు కుప్పకూలిపోతాయి. ఇప్పటికే స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోతూ ఉంది. ట్రంప్ ప్రకటించిన ఈ ట్రేడ్ వార్ ను ఆపే పరిస్థితి ఉందా? లేకపోతే దీనికి కేవలం ప్రతి చర్యలు మాత్రమే మిగిలిన దేశ నేతలు తీసుకుంటే అప్పుడు ఈ పంతం ఆగేదెక్కడ? మొదటి సారి రాజకీయ అనుభవం లేకుండా అధ్యక్షుడు అయిన ట్రంప్ ,ఈ రెండో సారి కూడా ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా ఒక నియంత ధోరణిలోనే సాగడం ప్రపంచాన్నే కొంత భయపెడుతున్న విషయం. దీని వల్ల అమెరికా ఒంటరి దేశమవుతుందా ? అమెరికాను ఎదుర్కొనే క్రమంలో ప్రపంచం ఎలా స్పందించి భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే!

# డీలిమిటేషన్‌కు సహేతుక ప్రామాణికాలు ఉండాలి

■ జనాభాకు అనుగుణంగా ప్రజా ప్రాతినిధ్య స్థానాలు పెరగాలి ■ కాల క్రమంగా సీట్లు పెరిగినా జనగణన జరగక ఆగిన పెంపు ■ 2026 నాటికి పార్లమెంట్,శాసనసభ స్థానాలు పెంచే ఆస్కారం ■ జనాభా నియంత్రణలో ముందు వరుసలో ఉన్న రాష్ట్రాలకు ఇబ్బందులు ■ డిలిమిటేషన్ ప్రక్రియపైనే దక్షిణాది రాష్ట్రాలలో అనేక అనుమానాలు


జుర్రు నారాయణ యాదవ్,
9494019270




ప్రజాస్వామ్యం రెండు రకాలు. ఒకటి ప్రత్యక్ష ప్రజాస్వామ్యం,రెండు పరోక్ష ప్రజాస్వామ్యం.జనాభా చాలా తక్కువగా ఉన్న ప్రాచీన కాలంలో ఏథెన్స్ లాంటి గ్రీక్ నగరాల్లో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం మనుగడలో ఉండేది.కానీ జనాభా పెరుగుతున్న కొలది ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో ఉన్న సవాళ్లను అదిగమించుటకు పరోక్ష ప్రజాస్వా మ్యం అంటే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం నెలకొల్పబడింది. ఆధునిక కాలంలో ప్రజాస్వామ్యం అంటే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం. దీంట్లో ప్రతినిధులు ఎంపికే కీలకము. ఈ ప్రతినిధుల సంఖ్యను కాలాను గుణంగా జనాభా పెరుగుతున్నట్లు పెంచవలసి వస్తుంది.స్వాతంత్ర అనంతరం మనదేశంలో 1951 జనాభా లెక్కల ప్రకారం లోక్ సభ సభ్యుల సంఖ్యను నిర్ణయించడం జరిగింది. కాలనుగుణంగా ఈ ప్రతినిధుల సంఖ్యను జనాభాకు అనుగుణంగా పార్లమెంట్లో పెంచుటకు ఆర్టికల్ 82 ద్వారా,శాసన సభలో పెంచుటకు ఆర్టికల్ 170 ద్వారా రాజ్యాంగం అవకాశం కల్పించింది. 1951 జనాభా లెక్కల ప్రకారం లోక్ సభలో 494 స్థానాలు ఉండగా, 1961జనాభా లెక్కల ప్రకారం 522 స్థానాలకు ప్రతినిధుల సంఖ్య పెరిగింది. 971 జనాభా లెక్కల ప్రకారం ఈ ప్రాతినిధ్యం 543 స్థానాలకు పెరిగింది.అయితే 70 దశకంలో జనాభా నియంత్రణలో భాగంగా పార్లమెంటు స్థానాల పెరుగుదల పరోక్షంగా జనాభా పెరుగుదలను ప్రోత్సహిస్తుందనే కారణంతో ఇందిరా గాంధీ ప్రభుత్వం 1976 సంవత్సరంలో 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా మరో 25 సంవత్సరాలు పార్లమెంట్,శాసనసభ స్థానాలు పెంచరాదని రాజ్యాంగ సవరణ ద్వారా చట్టం చేయడం జరిగింది.మళ్ళీ 2001 సంవత్సరంలో వాజ్ పాయి ప్రభుత్వం 84వ రాజ్యాంగ సవరణ ద్వారా మరో 25 సంవత్సరాలు ప్రాతినిధ్యం లో మార్పులు చేయరా దని నిర్ణయించింది.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2026వ సంవత్సరం లో పార్లమెంట్,శాసనసభ స్థానాలు ప్రస్తుత జనాభా ప్రకారం పెంచుటకు నిర్ణయించింది.ఈ నిర్ణయమే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా దక్షిణాది,ఉత్తరాది రాష్ట్రాల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది.ఢీ లిమిటేషన్ వల్ల నష్టపోనున్న దక్షిణాది రాష్ట్రాలు. ప్రస్తుత జనాభా ప్రకారం డీ లిమిటేషన్ ప్రక్రియ చేపడితే జనాభా నియంత్రణలో ముందు వరుసలో ఉన్న కేరళ,తమిళనాడు,తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక లాంటి దక్షిణాది రాష్ట్రాలు నష్టపోనున్నాయి.ప్రస్తుతం ఈ రాష్ట్రాల్లో 543 పార్లమెంట్ స్థానాలకు గాను129 స్థానాలతో 24శాతం ప్రాతినిధ్యం కలిగి ఉన్నాయి.అయితే ప్రస్తుత జనాభాని పరిగణనలోకి తీసుకొని డి లిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాల్లో పార్ల మెంట్ ప్రాతినిధ్యం తగ్గుతుంది.ప్రస్తుతం142 కోట్ల జనాభాకు 20 లక్షలకు ఒక ఎంపీ స్థానం అనుకున్న సుమారు 775 స్థానాల్లో దక్షణాది రాష్ట్రాల్లో 144 స్థానాల ప్రాతినిధ్యం రావొచ్చు.అయితే ప్రాతినిధ్యం పెరిగినట్లు కనిపించిన శాతం పరంగా 24 శాతం నుంచి 19 శాతానికి తగ్గుతుంది. జనాభా పెరుగుదలను సమర్థవంతంగా యంత్రించలేని ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్లో 40 స్థానాలు, బీహార్లో 30 స్థానాలు,మధ్యప్రదేశ్ లో 18 స్థానాలు,రాజస్థా న్లో 19 స్థానాలు,మహారాష్ట్రలో 20 స్థానాలు పెరిగి మొత్తంగా ఉత్తరా ది రాష్ట్రాల్లో ప్రాతినిధ్యం 60 శాతానికి పెరగవచ్చు. జనభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోనుండగా జనాభా నియం త్రిం చలేని ఉత్తరాది రాష్ట్రాలు డిలిమిటేషన్ వల్ల లాభ పడనున్నాయి. ఈ చర్య ఏ రకంగా సహేతుకం?జనాభాను నియంత్రించి అభివృద్ధి సాధిస్తూ దేశ జీడిపికి గణనీయంగా తోడ్పడుతున్న దక్షిణాది రాష్ట్రా లకు నష్టం చేకూరుస్తూ, జనాభా ను సమర్థవంతంగా నియంత్రిం చలేని దేశ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో తోడ్పడని ఉత్తరాది రాష్ట్రా లకు లాభం చేకూర్చడమా?. ఇదెక్కడి న్యాయం?. ప్రస్తుత జనాభా ప్రకారమే డీలిమిటేషన్ చేపడితే అది సమైక్య వ్యవస్థ స్ఫూర్తిని దెబ్బ తీసే అవకాశం ఉంది. దక్షిణాది ప్రాంతీయ పార్టీలను ఈ చర్య బలహీనపరుస్తూ ఉత్తరాది జాతీయ పార్టీలకు పరోక్షంగా తోడ్ప డవచ్చు.రాష్ట్రాల మధ్య నిధుల కేటాయింపుల్లో దక్షిణాది రాష్ట్రాలు వివక్షతకు గురికావాల్సి వస్తుంది.ఆ చర్య సుపరిపాలనను నిరుత్సా హపరచవచ్చు. ప్రస్తుత జనాభా ప్రకారమే డీ లిమిటేషన్ చేపడితే ఆర్థిక సంఘం కూడా రాష్ట్రాలకు నిధుల కేటాయింపుల్లో జనాభాను ఒక ప్రామాణికంగా తీసుకొని దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర నిధుల్లో కోత విధించవచ్చు. దక్షిణాది రాష్ట్రాలు దేశ జిడిపికి ఎక్కువ ఆదా యాన్ని సమకూర్చుతూ కేంద్ర నిధుల కేటాయింపుల్లో తక్కువ ఆదా యాన్ని పొందుతున్నాయి,అది ఇంకా బలంగా కొనసాగవచ్చు. ఇప్పటికే ఉన్న ఉత్తరాది రాజకీయ పార్టీల ఆధిపత్యం ఇంకా బలంగా తయారు కావచ్చు.దక్షణాది రాష్ట్రాలకు పార్లమెంటులో సరైన ప్రాతినిధ్యం లేదని భావిస్తూ ఏర్పాటు వాదం వైపు అడుగులు వేయవచ్చు. ఈ చర్య దేశ ఐక్యతకు,ప్రజాస్వామ్య పరిపుష్టికి నిరోధకం కావచ్చు.ఢీలిమిటేషన్ ప్రామాణికాలు సహేతుకంగా ఉండాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 82,170 ప్రకారం డీలిమిటేషన్ ద్వారా ప్రాతినిధ్యం పెరగాల్సిందే.కానీ దానికి తీసుకోనున్న ప్రామాణికాలు సహేతుకంగా ఉండాలి.జనాభా ఒక అంశమేగాని,అదే నిర్ణయాంశం కాకూడదు.జనాభాతో పాటు దేశాభివృద్ధిలో రాష్ట్రాలవాట,విద్యా వైద్య రంగాల ప్రగతిలో రాష్ట్రాల సూచి,మహిళా సాధికారతలో రాష్ట్రాల సూచి, భౌగోళిక అంశాల ప్రాధాన్యత మొదలైన అంశాలని పరిగణనలోకి తీసుకోవాలి.లేదా ప్రస్తుతమున్న ప్రాతినిధ్య శాతంలో మార్పు లేకుండా పార్లమెంట్ లో స్థానాలు పెంచాలి.లేదా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ స్థానాల్లోనైనా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని పెంచే ప్రత్యేక ఏర్పాట్లు అయిన ఉండాలి.లేదా జనాభా నియంత్రణలో ఉత్తర,దక్షిణాది రాష్ట్రాలు సమాన స్థాయిలు చేరేవరకు1976 జనాభా లెక్కల ఆధారంగానే ప్రస్తుతం డీ లిమిటెషన్ జరపాలి.

డిలిమిటేషన్ ఐక్యతకు దోహదం చేయాలి. ఢీ లిమిటేషన్ దేశంలో ప్రాతినిధ్యం పెంచలేగాని ప్రాంతీయ విభేదాలను సృష్టించరాదు.పెరిగే ప్రాతినిధ్యం ప్రాంతాల మధ్య సమస్యలు పరిష్కరించలేగాని, ప్రోత్సహించరాదు.ప్రాతినిధ్యం దేశ ప్రజల మధ్య ఐక్యతను బలపరచాలే గాని,బలహీన పరచరాదు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు,అన్ని ప్రాంతాలు,అన్ని పార్టీల ఏకాభిప్రాయం మేరకు సహేతుకమైన ప్రామాణికాలతో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యనికి పరిపుష్టి చేకూర్చాలి.

# ఊబకాయం - దేహానికీ,దేశానికీ భారం

దేశంలో పెరుగుతున్న ఊబకాయం సమస్య పై ప్రధాని మాట్లాడడం ముదావహం.ఊబకాయం సమస్య వ్యక్తికీ,ఆ కుటుంబానికీ మాత్రమే పరిమితమైనది కాదు,దేశ ప్రగతి, ప్రజారోగ్యాలపై ప్రభావం చూపేది గనుకనే ప్రధాని మాట్లాడాల్సి వచ్చింది.దేశ స్థూల జాతీయ ఉత్పత్తి లో పది శాతం మేరకు అదనంగా హరింపజేసే సమస్య ఇది.కాబట్టి ప్రభుత్వం,పౌరసమాజం,మీడియా పరిస్థితి దిగజారకుండా తమ వంతు ప్రయత్నాలు చేయాల్సిన సందర్భం.ఊబకాయం,అధిక బరువు అన్నవి జీవన శైలిలో మార్పుల వల్ల వస్తున్న శారీరక పరిణామాలు. ఇది చాలా ఇతర వ్యాధులు - మధుమేహం,గుండెజబ్బు,క్యాన్సర్ లాంటివి - ఎక్కువ కావడానికి కారణం కాబట్టి దీనిని కింగ్ ఆఫ్ డిసీజెస్ అంటారు.మనం తీసుకున్న ఆహారం ద్వారా లభించే శక్తి అవసరానికి మించితే కొవ్వుగా పేరుకుపోతుంది.దాన్ని కరిగించక పోతే ఆ బరువు ఆరోగ్యానికి అన్ని విధాలా చెరుపు చేస్తుంది. అందుకనే తీసుకొనే ఆహారంలో,చేసే పనిలో సమతుల్యం అవసరం. ఈ సమస్య ఇలా ప్రమాదకర స్థాయిలో పెరుగుతూ రావడానికి కారణం ఆహారపు అలవాట్లు మార డం, శారీరక శ్రమ తగ్గడం మరియూ ఆర్థిక స్థితి లో మార్పులు.వంట నూనెల వాడకం ఒక్కటే కాకుండా వాడిన దాన్ని తిరిగి తిరిగి వాడడం వల్ల ట్రాన్స్ ఫాట్స్ పెరుగుతాయి.అవి మంచివి కావు.అందుకనే ప్రధాని ఇప్పుడు వాడు తున్న నూనెల్లో పది శాతం వరకూ తగ్గించమని ప్రజలకు పిలుపు నిస్తున్నారు.ఫాస్ట్ ఫుడ్స్,స్వీట్లు,కూల్ డ్రింక్స్ ల వాడకం తగ్గించాలి. శారీరక వ్యాయామం రోజువారీ పనుల్లో భాగం కావాలి. ఆరోగ్యకర జీవన శైలి తోనే ఈ తరహా వ్యాధుల్ని అదుపు చెయ్యగలం.ఇప్పటికే మధుమేహం లో ప్రపంచ రాజధానిగా మారిన మన దేశం ఊబకాయం లో కూడా శరవేగంగా అలాంటి రికార్డు వైపు పరుగులెడుతోంది.దీని వల్ల మానవ వనరులు ముఖ్యంగా మనకు బలంగా ఉండగల యువత బలహీనంగా మారిపోతుంది.పైగా ప్రజారోగ్యం,ప్రగతి కుంటుబడతాయి.

ఇప్పుడు ప్రభుత్వం చేయాల్సింది దేశాన్ని ఆరోగ్యకర సమాజంగా మార్చడంలో ముందు నిలవడం.అన్ని కోణాల్లో సమస్య పరిష్కారం వైపు ప్రయత్నించడం.పేదరికం లో ఊబకాయానికి కారణం తక్కువ ధరకు దొరికే ఫాస్ట్ ఫుడ్స్ అయితే, ధనికుల్లో కారణం ఒళ్లు కదల్చక పోవడం ప్లస్ జంక్ ఫుడ్స్. కాబట్టి అందరిలో ఆహారపు అలవాట్లు పై అవ గాహన కల్పించాలి. పేదరిక నిర్మూ లనతో బాటు వారికి చౌకగా పోషకాహారం అందేలా చూడాలి.విద్యాలయాల్లో మైదానం ఉండడం,వ్యాయామ విద్య,శిక్షణ కంపల్సరీ చెయ్యాలి.ఆటల్ని అన్ని స్థాయు ల్లో ప్రోత్సహించాలి.జంక్ ఫుడ్స్,ఫాస్ట్ ఫుడ్స్ పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాదు కనుక వాటి అందుబాటు పై నియంత్రణ పెరగాలి.పాకెట్స్ పై వివరాలుండే లేబుల్స్ పెద్దవిగా అందరూ చదవగలిగేలా ఉంచాలి. పార్కులు,సైక్లింగ్ లేన్లు నగరాల్లో ప్రోత్సహించాలి.పౌరసమాజం,మీడియా ప్రజలకు అవగాహన కల్పించాలి. మేల్కొనాల్సిన సమయమిది.తేలిగ్గా తీసుకొంటే వృద్ధి వైపు దూసుకుపోవాలని భావిస్తున్న భారత్ కు ఊబకాయం మెడలో భారంగా మారుతుంది.

డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, 9440836931.

# బిజినెస్

## వోక్సెన్ వర్శిటీతో మాజీ భారత క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్ ఒప్పందం

హైదరాబాద్: క్రీడా విద్యలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తూ రిటైర్డ్ భారత క్రికెటర్, మాజీ బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్ కె ప్రసాద్ కు వోక్సెన్ విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇచ్చింది. ఇటీవల క్యాంపస్ కు వచ్చిన ప్రసాద్, వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీ మౌలిక సదుపాయాలను అన్వేషించారు. వోక్సెన్ విశ్వవిద్యాలయంతో ఎంఎస్‌కె ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ మరియు సిక్స్ఎస్ స్పోర్ట్స్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఎంఎస్కె ప్రసాద్ మాట్లాడుతూ, భవిష్యత్ క్రికెట్ స్టార్లను రూపొందించడంలో నిర్మాణాత్మక శిక్షణ పాత్రను వెల్లడించారు. "ఐపీఎల్ పదేళ్లకు రూ. 7,000 కోట్ల విలువైన టీవీ హక్కులతో ప్రారంభమై ఇప్పుడు కేవలం ఐదు సంవత్సరాలకు రూ. 50,000 కోట్లకు విస్తరించింది. ఇది బీసీసీఐ మరియు ఐపీఎల్ కౌన్సిల్ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుం ది. గవాస్కర్ మరియు రవి శాస్త్రి వంటి ప్రతిభా వంతు లను గుర్తించడంలో విశ్వ విద్యాలయ క్రీడలు కీలక పాత్ర పోషించాయి. గత తరాలనుండి నేటి క్రికెట్ దృశ్యం వరకు, విజిట్రోఫీ వంటి విశ్వవిద్యాలయ స్థాయి లీగ్లు అద్భుతమైన ఆటగాళ్లను తయారు చేశాయి" అని అన్నారు. "వోక్సెన్ విశ్వవిద్యాలయం ప్రపంచ ప్రమాణాలతో కూడిన అద్భుతమైన క్రీడా సౌకర్యాన్ని తయారు చేయడం పట్ల సంతోషంగా వుంది. ప్రతిభను సరైన మార్గంలో పెంపొందించడానికి మనం దానిని ఉపయోగించుకోవాలి" అని ఆయన అన్నారు.



## 36 నెలల్లో కియా కారెన్స్ 200,000-యూనిట్ల అమ్మకాలు



న్యూఢిల్లీ, : ప్రముఖ మాస్ ప్రీమియం కార్ల తయారీ సంస్థ అయిన కియా, ఈరోజు ప్రారంభించిన 36 నెలల్లోనే తన అత్యంత ప్రియమైన ఉత్పత్తి కారెన్స్ యొక్క 200,000+ యూనిట్ల అమ్మకాల మైలురాయిని ప్రకటించింది. కియా ఇండియా నుండి వచ్చిన ఫ్యామిలీ మూవర్ దాని వర్గంలో అత్యంత వేగంగా అమ్ముడవుతున్న వాహనాలలో ఒకటిగా ఉద్భవించింది, సౌకర్యం, స్థలం, సాంకేతికత మరియు శైలి కలయికను కోరుకునే భారతీయ కుటుంబాలలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆచరణాత్మకత మరియు ప్రీమియం లక్షణాల బలమైన మిశ్రమంతో, ఈ వాహనం బహుముఖ మరియు ఫీచర్-రిచ్ మొబిలిటీ సొల్యూషన్ను కోరుకునే కస్టమర్ లతో ప్రతిధ్వనిస్తూనే ఉంది. కియా ఇండియా సేల్స్ & మార్కెటింగ్ సీనియర్ విపి శ్రీ హర్దీప్ సింగ్ బ్రార్ మాట్లాడుతూ, "కియా కారెన్స్ విజయం నమ్మకం మరియు ఆవిష్కరణలకు నిదర్శనం, ఇది భారతీయ కుటుంబాల అభివృద్ధి చెందుతున్న అవసరాలపై మా లోతైన అవగాహన ద్వారా నడపబడుతుంది. దాని అధునాతన లక్షణాలు, విశాలమైన ఇంటీరియర్ లు మరియు రాజీలేని భద్రతతో, కారెన్స్ ఫ్యామిలీ మూవర్ విభాగాన్ని పునర్నిర్వచించింది. 200,000 కంటే ఎక్కువ మంది కుటుంబాల నమ్మకాన్ని గెలుచుకోవడం మరియు స్థిరమైన నెలవారీ అమ్మకాలతో, ఈ మైలురాయి కారెన్స్ పెరుగుతున్న ఆకర్షణను ప్రతిబింబిస్తుంది. ఇది ప్రతి ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా, అనుసంధానంగా మరియు ఆనందదాయకంగా మార్చే ఉత్పత్తులను అందించడం ద్వారా, శ్రేష్ఠత యొక్క సరిహద్దులను ముందుకు తీసుకెళ్లడానికి మమ్మల్ని ప్రేరేపిస్తుంది". అన్నారు.

## ఐకానిక్ వైట్ విస్కీ

- భారతదేశ యువతకు ప్రీతిపాత్రమయ్యింది
- ఉత్తమ ట్రెండింగ్ బ్రాండ్‌గా 50 లక్షల కేసులు దాటిపోయింది




జాతీయంగా ప్రారంభమైన రెండవ సంవత్సరములో ఈ బ్రాండ్ కేవలం 344 రోజులలో 50 లక్షలు లేదా 5 మిలియన్ల కేసులను విక్రయించింది. ప్రెస్టీజ్ అండ్ అబౌ స్పిరిట్స్ విభాగములో వైట్ విస్కీ యొక్క అపూర్వ అభివృద్ధి ఏబిడి యొక్క స్థానాన్ని మరింత బలోపేతం చేసింది. తన విశేషమైన పురోగతిని కొనసాగిస్తూ, ఈ బ్రాండ్ ఎఫ్‌వై24-25లో 50 లక్షలు లేదా 5 మిలియన్ కేసులను అధిగమించింది. ఐకానిక్ వైట్ విస్కీ మైలురాయి గురించి మాట్లాడుతూ, ఆలోక్ గుప్త, మేనేజింగ్ డైరెక్టర్, అలీడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలర్స్ లిమిటెడ్, ఇలా అన్నారు " తన అధునాతన బ్లెండ్, స్టైలిష్ ప్యాకేజింగ్ కొరకు యువతలో ప్రాచుర్యంలో ఉన్న విస్కీగా ఐకానిక్ భారతదేశములోనే మొదటి స్థానములో నిలిచి ఎఫ్‌వై 25లో కేవలం 344 రోజులలో 50 లక్షల కేసులను దాటడం అనేది ఏబిడికి ఒక నిర్వచించే క్షణము. ఈ బ్రాండ్ ఎల్‌డిఏ బ్రాకెట్‌లోకి ప్రవేశిస్తున్న వయసుకు వచ్చిన వినియోగదారుల ఊహలను తెలుసుకోగలుగుతున్న విధానానికి, అలాగే ప్రతిష్ఠాత్మక ప్రపంచవ్యాప్త విస్తరణ ప్రణాళికలతో 5 దేశాలలో అంతర్జాతీయ గుర్తింపు పొందినందుఉ మేమెంతో గర్విస్తున్నాము. ఈ విస్కీ ఇంటర్నేషనల్ స్పిరిట్స్ ఛాలెంజ్ (ఐఎస్‌సి) 2024, ఇంటర్నేషనల్ విస్కీ కాంపెటీషన్ (ఐడబ్ల్యుసి) 2024 మరియు ఇండియా వైన్ & స్పిరిట్స్ అవార్డ్స్ (ఐడబ్ల్యుఎస్ఏ) 2024 లో బంగారు పతకాలు అందుకుంది. అదనంగా, దీనికి అంతర్జాతీయ ప్రమాణాల ప్రీమియం విస్కీ గా తన స్థాయిని పునరుద్ఘాటిస్తూ, మాండె సెలెక్షన్ 2024లో గోల్డ్ క్వాలిటి అవార్డ్ మరియు బ్రూసెల్స్ లో ఇంటర్నేషనల్ టేస్ట్ ఇన్స్టిట్యూట్ 2024 వద్ద సుపీరియర్ టేస్ట్ అవార్డ్ కూడా ఇచ్చి సత్కరించారు.

## సాంసంగ్ పవర్డ్ గెలాక్సీ బుక్5 సిరీస్ పిసి వచ్చేసింది



గురుగ్రామ్ : భారతదేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శామ్సంగ్, ఈరోజు తన తాజా ఏఐ-పవర్డ్ పిసి లైనప్ను ప్రారంభించినట్లు ప్రకటించింది గెలాక్సీ బుక్5 ప్రో, గెలాక్సీ బుక్5 ప్రో 360 మరియు గెలాక్సీ బుక్5 360. కొత్త శ్రేణి ఏఐ పిసిలు గెలాక్సీ ఏఐ శక్తిని మైక్రోసాఫ్ట్ కోపైలట్+ పిసి అనుభవంతో మిళితం చేస్తాయి, సజావుగా ఉత్పాదకత, సృజనాత్మకత మరియు తెలివైన వర్క్‌ఫ్లోలను నిర్ధారిస్తాయి. గెలాక్సీ బుక్5 సిరీస్ మొదటి సారిగా ఏఐతో వస్తుంది. కొత్త సిరీస్లో ఏఐ సెలెక్ట్ మరియు ఫోటో రీమాస్టర్ వంటి గెలాక్సీ ఏఐ ఫీచర్లతో పాటు ఏఐ కంప్యూటింగ్ కోసం న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్ ఉంది. గెలాక్సీ స్మార్ట్ ఫోన్‌లలో Googleతో సర్కిల్ నుండి శోధనకు సమానమైన ఫీచర్ అయిన ఏఐ సెలెక్ట్, ఒకే క్లిక్‌తో తక్షణ శోధన మరియు సమాచారాన్ని సంగ్రహించడానికి వీలు కల్పిస్తుంది. ఫోటో రీమాస్టర్ ఏఐఆధారిత స్పష్టత మరియు షార్ప్‌నెస్‌తో చిత్రాలను మెరుగుపరుస్తుంది. గెలాక్సీ బుక్5 సిరీస్ ఇంటెల్ కోర్™ అల్ట్రా ప్రాసెసర్‌ల (సిరీస్ 2) ద్వారా శక్తిని పొందుతుంది, ఇందులో 47 టెరా ఆపరేషన్స్ పర్ సెకండ్ వరకు శక్తివంతమైన ఎన్‌పియులు, మెరుగైన గ్రాఫిక్స్ పనితీరు కోసం జిపియులో 17% పెరుగుదల మరియు CPU సింగిల్-కోర్ పనితీరులో 16% పెరుగుదల ఉన్నాయి. ఇంటెల్బ్యా ఏఐస్ను కలిగి ఉన్న గెలాక్సీ బుక్5 సిరీస్ అగ్రశ్రేణి పనితీరు, భద్రత మరియు సామర్థ్యాన్ని అందిస్తుంది.

## హావెల్స్ బ్రాండ్ అంబాసిడర్లుగా నయనతార, విఘ్నేష్ శివన్




సృజనాత్మకత, ప్రీమియం-క్వాలిటీ ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందిన, దేశ ఎలక్ట్రికల్ పరిశ్రమలో అగ్రగామి అయిన హావెల్స్, ఐకానిక్ స్టార్ జంట నయనతార-విఘ్నేష్ శివన్ లను దక్షిణ భారత మార్కెట్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా ఎంచుకుంది. ఈ వ్యూహాత్మక భాగస్వా మ్యం ఈ ప్రాంతంలో హావెల్స్ పట్టును మరింత బలోపేతం చేస్తుంది, ఇక్కడ ఈ జంటకున్న ప్రజాదరణ వినియోగ దారులలో లోతుగా ప్రతిధ్వనిస్తుంది. వారి డైనమిక్ భాగస్వామ్యం ఆధునిక గృహాల కోసం సృజనాత్మక, విశ్వసనీయ, స్టైలిష్ పరిష్కారాలను అందించడానికి హావెల్స్ ప్రయత్నానికి అద్దం పడుతుంది. నయనతార, విఘ్నేష్ శివన్ జంటగా నటించిన తొలి బ్రాండ్ ఇది. హావెల్స్ తో వారి భాగస్వామ్యం దక్షిణ భారత మార్కెట్లోని అపారమైన సామర్థ్యాన్ని తెరవడానికి సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా హావెల్స్ ఇండియా సేల్స్ విభాగం ప్రెసిడెంట్ పరాగ్ భట్నాగర్ మాట్లాడుతూ, "శ్రేష్ఠతను అందించడంలో హావెల్స్ నిబద్ధత మా ప్రభావాన్ని పెంచే భాగస్వామ్యాలను అన్వేషించడానికి మమ్మల్ని ప్రేరేపిస్తుంది. నయనతార- విఘ్నేష్ శివన్ ఆకర్షణ, సృజనాత్మకత, విశ్వసనీయతల సమ్మేళనాన్ని వినియోగదారులతో కలుపుతారు. వారి అనుబంధం దక్షిణాదిలో మా ఉనికిని పెంచడమే కాకుండా, అభివృద్ధికి కొత్త మార్గాలను అందిపుచ్చుకోవడానికి, దేశమంతా ప్రేక్షకులతో మా సంబంధాన్ని బలోపేతం చేయడానికి మాకు అనుమతిస్తుంది" అన్నారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

### 200 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్.. 22,400 దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు.. ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి. హోలీ సందర్భంగా శుక్రవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈకి సెలవు కావడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల ఎప్పుడేం జరుగుతోందోనన్న భయాలు ప్రపంచ మార్కెట్లను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా పొజిషన్లు తీసుకొనేందుకు ఇన్వెస్టర్లు ముందుకు రాలేదని అనలిస్టులు చెబుతున్నారు. దీంతో సెన్సెక్స్ వరుసగా ఐదో రోజు నష్టపోగా.. నిఫ్టీ సైతం 22,400 దిగువన వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలూ నష్టాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ ఉదయం 74,392.54 పాయింట్ల వద్ద (క్రితం 74,029.76) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,401 వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత అమ్మకాలతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి 200.85 పాయింట్ల నష్టంతో 73,828.91 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 73.30 పాయింట్ల నష్టంతో 22,397.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 22 పైసలు బలపడి 87గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్




ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, సన్ఫార్మా, టాటాస్టీల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 70 డాలర్లు, బంగారం ఔన్సు 2953 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

## 'డబుల్ మిల్లీగ్రామ్ గోల్డ్ రివార్డ్స్' ప్రారంభించిన ముత్తూట్ ఫైనాన్స్




దేశంలో అతిపెద్ద బంగారు రుణ ఎన్బిఎఫ్సి అయిన ముత్తూట్ ఫైనాన్స్, 2025 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'డబుల్ మిల్లీగ్రామ్ లాయల్టీ స్కీమ్'ను ప్రారంభించినట్లు నేడు ప్రకటించింది. గోల్డ్ మిల్లీగ్రామ్ రివార్డ్ అనేది ఒక ప్రధాన కస్టమర్ రివార్డ్ ప్రోగ్రామ్, దీనిలో ముత్తూట్ ఫైనాన్స్‌తో అర్హత ఉన్న లావాదేవీలకు గోల్డ్ మిల్లీ గ్రామ్ రివార్డ్ పాయింట్లు లభిస్తాయి. మార్చి 8 నుండి, ముత్తూట్ ఫైనాన్స్ మహిళా కస్టమర్లు అర్హత ఉన్న అన్ని లావాదేవీలకు రెట్టింపు మిల్లీగ్రామ్ రివార్డ్ పాయింట్లను అందుకుంటారు. ఈ చొరవ మహిళలకు సాధికారత కల్పించడం మరియు ఆస్తి-ఆధారిత రుణాల ద్వారా ఆర్థిక చేరికకు సహాయం చేయడం అనే ముత్తూట్ ఫైనాన్స్ లక్ష్యంలో భాగం. గోల్డ్ మిల్లీగ్రామ్ రివార్డ్ ప్రోగ్రామ్‌ను మొదట ఆగస్టు 2022లో ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ కార్యక్రమం 5,000 మందికి పైగా కస్టమర్లకు ప్రయోజనం చేకూర్చింది. 8.6 మిలియన్ల మంది కస్టమర్లు ఇప్పటికే 3 మిలియన్ల మహిళా కస్టమర్లతో కూడిన మిల్లీగ్రామ్ రివార్డ్ ప్రోగ్రామ్‌లో భాగం. ఈ ప్రత్యేక మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ముత్తూట్ ఫైనాన్స్ ఎండి జార్జ్ అలెగ్జాండర్ ముత్తూట్ ఇలా అన్నారు: "ముత్తూట్ ఫైనాన్స్‌లో, కొత్త అవకాశాలను అన్‌లాక్ చేయడం ద్వారా గృహ స్థిరత్వం మరియు సమాజ శ్రేయస్సుకు దారితీసే మా కస్టమర్లకు సాధికారత కల్పించడానికి మేము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నాము. మహిళలకు సమగ్రమైన మరియు మద్దతు ఇచ్చే వాతావరణాన్ని సృష్టించడం మరియు మహిళలు స్వయం సమృద్ధి మరియు విజయాన్ని సాధించడంలో సహాయపడటానికి వనరులు మరియు బహుమతులను అందించడం దీని ఉద్దేశ్యం. మహిళా దినోత్సవ డబుల్ మిల్లీగ్రామ్ లాయల్టీ పథకం ద్వారా, ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళలకు మేము మా కృతజ్ఞతను తెలియజేయాలనుకుంటు న్నాము. వారి క్రెడిట్ యాక్సెస్‌ను బలోపేతం చేయడం ద్వారా, వారి వ్యవస్థాపక కలలు, వృత్తి పరమైన ఆకాంక్షలు మరియు మొత్తం ఆర్థిక పురోగతికి మద్దతు ఇవ్వాలని మేము ఆశిస్తున్నాము." అని అన్నారు.

## హైదరాబాద్‌లో పెరిగిన గిడ్డంగుల లావాదేవీలు : నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్ : నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదికలో, హైదరాబాద్ 3.5 మిలియన్ చదరపు అడుగుల గిడ్డంగి లావాదేవీలను నమోదు చేసిందని, 34% లావాదేవీలు తయారీ పరిశ్రమపై కేంద్రీకృతమై ఉన్నాయని పేర్కొంది. హైదరాబాద్ నగరం ఏదైనా అదనపు డిమాండ్‌ను తీర్చడానికి 16.4 మిలియన్ చదరపు అడుగుల అభివృద్ధి సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది 2024 లో వార్షిక లావాదేవీల పరిమాణానికి సుమారు ఐదు రెట్లు. హైదరాబాద్‌లో శంషాబాద్ క్లస్టర్ కీలకమైన గిడ్డంగులు మరియు పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతోంది. వ్యూహాత్మకంగా బెంగళూరు-హైదరాబాద్ హైవే వెంట ఉన్న ఈ క్లస్టర్ ప్రధాన పారిశ్రామిక ప్రదేశాలను కలిగి ఉంది: అవి, శంషాబాద్, ఏరోట్రోపోలిస్, శ్రీశైలం హైవే, బోంగ్లూర్, కొత్తూర్, షాద్ నగర్. ఈ ప్రాంతంలో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, 3 పిఎల్ (థర్డ్-పార్టీ లాజిస్టిక్స్) కంపెనీలు, ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు బలమైన ఉనికిని ఏర్పరచుకున్నాయి. 2024లో, శంషాబాద్ క్లస్టర్ మొత్తం లావాదేవీలలో 47% వాటాను కలిగి ఉంది.

నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శిశిర్ బైజాల్ మాట్లాడుతూ, "హైదరాబాద్ వ్యూహాత్మక స్థానం, అద్భుతమైన కనెక్టివిటీ మరియు పెరుగుతున్న పారిశ్రామిక స్థావరం దీనిని గిడ్డంగులు మరియు లాజిస్టిక్స్ కోసం కీలక కేంద్రంగా ఉంచాయి. దాని బాగా అభివృద్ధి చెందిన రహదారి మరియు రైలు నెట్ వర్క్, ప్రధాన రహదారులు మరియు ఓడరేవులకు సామీప్యతతో పాటు, సమర్థవంతమైన ప్రాంతీయ పంపిణీని నిర్ధారిస్తాయి. ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ మరియు పునరుత్పాదక శక్తి వంటి పరిశ్రమల ద్వారా ఈ నగరం పెరుగుతున్న గిడ్డంగుల డిమాండ్ను ఎదుర్కొంటోంది. స్థిరమైన విధాన మద్దతు, పెరుగుతున్న ఆక్రమణదారుల డిమాండ్ మరియు బలమైన మౌలిక సదుపాయాలతో, నగరాల గిడ్డంగి రంగం నిరంతర విస్తరణకు సిద్ధంగా ఉంది, రాబోయే సంవత్సరాల్లో మరింత పెట్టుబడులను ఆకర్షిస్తుంది. "అని అన్నారు.

## జేమ్స్ డైసన్ అవార్డు 2025 ఎంట్రీలకు ఆహ్వానం

జేమ్స్ డైసన్ అవార్డ్, అంతర్జాతీయ విద్యార్థి డిజైన్ మరియు ఇంజనీరింగ్ పోటీ, 28 దేశాలు మరియు ప్రాంతాలలో 2025 ప్రోగ్రామ్కు ఈ రోజు సమర్పణల కోసం తెరవబడింది. రోజువారీ సవాళ్ల నుండి ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సమస్యల వరకు, ప్రజల జీవితాలకు నిజమైన మార్పును కలిగించే సమస్య-పరిష్కార ఆలోచనలను సమర్పించడానికి ప్రస్తుత లేదా ఇటీవలి విద్యార్థులకు అవార్డు పిలుపునిస్తుంది.

ఇది 2005లో స్థాపించబడినప్పటి నుండి, జేమ్స్ డైసన్ అవార్డు ప్రైజ్ మనీ మరియు గ్లోబల్ ప్లాట్‌ఫారమ్లో సుమారు 112మి తో 400 కంటే ఎక్కువ విద్యార్థుల ఆవిష్కరణలకు మద్దతు ఇచ్చింది. చివరి దశకు చేరుకుని, జేమ్స్ డైసన్ గ్లోబల్ విజేతలుగా ఎంపికైన వారు సుమారుగా. రూ30 లక్షలు బహుమతిని క్లెయిమ్ చేస్తారు మరియు వారి ఆవిష్కరణలను వాణిజ్యీకరించడానికి స్ప్రింగ్‌బోర్డ్ను అందజేస్తూ అంతర్జాతీయ మీడియా బహిర్గతం చేసే అవకాశాన్ని పొందుతారు.

డైసన్ వ్యవస్థాపకుడు సర్ జేమ్స్ డైసన్ "నేను 20 సంవత్సరాల క్రితం జేమ్స్ డైసన్ అవార్డును ప్రారంభించాను, తరువాతి తరం డిజైన్ ఇంజనీర్లను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రారంభించాను. మెడిసిన్, పర్యావరణం మరియు మరిన్నింటిలో డిజైన్, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీని ఉపయోగించి ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సమస్యలకు పరిష్కారాలను అందించడంలో యువకులు మక్కువ చూపుతున్నారని అప్పటి నుండి మనం చూసిన అద్భుతమైన ఆలోచనలు రుజువు చేస్తున్నాయి. ఈ సంవత్సరం ఏ ఆవిష్కరణలు ముందుకు వస్తాయో తెలుసుకోవడానికి నేను ఎదురుచూస్తున్నాను - అదృష్టం! " అన్నారు.

## ప్రూడెంట్ షేర్లను బహుమతిగా ఇచ్చిన సంజయ్ షా

అహ్మదాబాద్: ప్రూడెంట్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ లిమిటెడ్ (ప్రూడెంట్) ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సంజయ్ షా, తన వ్యక్తిగత హోల్డింగ్‌ల నుండి దాదాపు 650 మందికి సుమారు రూ. 34 కోట్లు (నేటి ధర ప్రకారం) విలువైన 175,000 ఈక్విటీ షేర్లను బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించారు. లబ్ధిదారులలో కంపెనీ ఉద్యోగులు, దాని పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థలు, అలాగే ఇంటి పనివారు మరియు డ్రైవర్లు వంటి శ్రీ షా వ్యక్తిగత సిబ్బంది ఉన్నారు. వ్యాపారంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు కృతజ్ఞతగా షా ఈ బహుమతి అందించనుండటంతో పాటుగా ఎలాంటి బాధ్యతలు లేదా నిలుపుదల షరతులు జతచేయలేదు. శ్రీ సంజయ్ షా ఈ నిర్ణయం గురించి కంపెనీకి తెలియజేశారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సహా నియంత్రణ సంస్థల నుంచి అవసరమైన నియంత్రణ ఆమోదాలను కంపెనీ (అంటే ప్రూడెంట్) తీసుకుంది.

ఈ కార్యక్రమం గురించి సంజయ్ షా మాట్లాడుతూ, "ఇది కేవలం షేర్ల బదిలీ కాదుబీ ఈ ప్రయాణంలో ఉద్యోగులుగా మాత్రమే కాకుండా, సహచరులుగా నాతో పాటు నిలిచిన వారికి నాదైన రీతిలో చెప్పే హృదయపూర్వక కృతజ్ఞత. మీ నిశ్శబ్ద సహకారం, విధేయత మరియు మా ఉమ్మడి లక్ష్యంపై నమ్మకం అమూల్యమైనవి, మన



విజయానికి అవి పునాదిగా నిలిచాయి. మనం కలిసి సృష్టించే అద్భుతమైన భవిష్యత్తు కోసం నేను ఆసక్తిగా ఉన్నాను" అని అన్నారు

## మిత్సుబిషి లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ప్రారంభించిన ఆజాద్ ఇంజనీరింగ్



హైదరాబాద్: ప్రెసిషన్ ఇంజినీరింగ్‌లో అగ్రగామిగా ఉన్న ఆజాద్ ఇంజినీరింగ్ హైదరాబాద్‌లోని తునికొల్లారంలో మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ (ఎంహెచ్ఐ) ప్రత్యేక లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ప్రారంభించింది.

7,200 చదరపు మీటర్ల అత్యాధునిక కేంద్రాన్ని జపాన్‌లోని ఎంహెచ్ఐ ఎనర్జీ సిస్టమ్ జీటీసీసీ బిజినెస్ డివిజన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మసాహిటో కటావోకా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఆజాద్ ఇంజనీరింగ్ చైర్మన్, సీఈఓ రాకేష్ చోప్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రారంభోత్సవానికి ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్, తెలంగాణ ప్రభుత్వ బీఎఫ్ఎస్ఐ డైరెక్టర్ ప్రవీణ్ పీఏ, జపాన్ లోని ఎంహెచ్ఐలో టర్బైన్ ఇంజినీరింగ్ విభాగం ఇంజినీరింగ్ మేనేజర్ రాజా రాంరెడ్డి, జపాన్లోని ఎంహెచ్ఐ ప్రొక్యూర్ మెంట్ విభాగం డీజీఎం హిరోయుకి ఓకా, జపాన్లోని ఎంహెచ్ఐ సప్లై చైన్ మేనేజ్మెంట్ విభాగం డీజీఎం హితోషి మోరిమోటో, అమెరికాలోని ఎంహెచ్ఐలో నార్త్ అమెరికన్ మాన్యుఫ్యాక్చరింగ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షేన్ మిక్కీ తదితరులు హాజరయ్యారు. ఈ అనుబంధంపై జపాన్లోని ఎంహెచ్ఐ ఎనర్జీ సిస్టం, జీటీసీసీ బిజినెస్ డివిజన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మసహిటో కటవొక సంతోషం వ్యక్తం చేశారు.

ఆయన మాట్లాడుతూ, "గ్యాస్, ఆవిరి టర్బైన్లలో ప్రముఖ సంస్థగా, ఎంహెచ్ఐ ప్రపంచ లక్ష్యాలకు దోహదపడే వినూత్న సాంకేతికతలు, పరిష్కారాలను అందిస్తుంది. ఎంహెచ్ఐ గ్యాస్, ఆవిరి టర్బైన్ల తయారీకి అవసరమైన కీలక ఉత్పత్తులను ఆజాద్ సరఫరా చేస్తుంది.

ఆజాద్ వారి అసాధారణ సాంకేతిక సామర్థ్యాలు, సంపూర్ణ నాణ్యత నియంత్రణకు ధన్యవాదాలు. ఎంహెచ్ఐ ఉత్పత్తులు అధిక విశ్వసనీయత, పనితీరుకు నిదర్శనం. ఇది డీకార్బనైజ్డ్ సమాజ సాక్షాత్కారాని కి దోహదం చేస్తుంది. నా హృదయపూర్వక కృతజ్ఞతతో, మేము ఆజాద్ ఇంజనీరింగ్ వారికి "పార్టనర్ ఆఫ్ ది ఇయర్ 2024" సర్టిఫికెట్, ట్రోఫీని అందించాము" అని చెప్పారు.

## సాస్ క్రౌన్‌లో స్కై బ్లాస్ట్ హోలీ సంబరాలు!



హైదరాబాద్ : అత్యంత ఎత్తైన భవనం పై హోలీ జరుపుకోవడం అంటే అదొక విభిన్నమైన అనుభూతి! దక్షిణ భారతదేశంలో అత్యంత ఎత్తైన టవర్ కోకాపేట్ లోని 60 అంతస్తుల సాస్ క్రౌన్ వేదికగా "స్కై బ్లాస్ట్" పేరుతో హైదరాబాద్లోనే అత్యున్నత హోలీ వేడుక ఘనంగా జరిగింది. రంగుల తుఫాన్, 360ఢీ స్కై వ్యూ ఇలా ప్రతిదీ ప్రత్యేకమే. సాస్ క్రౌన్ ఈ సంబరాలను ఆకాశంలో జరిపి అందరికీ కొత్త అనుభూతిని అందించింది. టాప్ ఫ్లోర్, స్కై డెక్, ఈవెంట్లో ప్రతి అంశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హోలీ అంటే రంగులు, సంగీతం, ఉత్సాహం! కానీ ఈసారి ఆకాశాన్ని తాకేలా హోలీ సెలబ్రేట్ చేసింది సాస్ క్రౌన్ . రంగుల మెరుపులతో హైదరాబాద్ స్కైలైన్ మిలమిల మెరిసిపోయింది.

## యులిప్ ఆఫర్‌లతో టాటా ఏఐఏ

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ తన యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్ ద్వారా ఫండ్ పనితీరులో బెంచ్ మార్క్ను సెట్ చేస్తూనే ఉంది. కంపెనీ ఫండ్స్ మార్కెట్ బెంచ్ మార్క్‌లను అధిగమించాయి. ఇది పాలసీదారులకు దీర్ఘకాలిక వృద్ధి మరియు జీవిత బీమా రక్షణ యొక్క ఆదర్శవంతమైన కలయికను అందిస్తుంది. ఫండ్ బెంచ్మార్క్: మల్టీ క్యాప్ ఫండ్, ఇండియా కన్సంప్షన్ ఫండ్, టాప్ 200 ఫండ్: ఎస్ అండ్ పి బిఎస్ ఈ 200. ప్రారంభ తేదీలు: టాప్ 200 ఫండ్: 12 జనవరి 2009, మల్టీ క్యాప్ ఫండ్: 05 అక్టోబర్ 2015, ఇండియా వినియోగ నిధి: 05 అక్టోబర్ 2015. టాటా ఏఐఏఇన్వెస్ట్ మెంట్-లింక్డ్ ప్లాన్ లలో తన నైపుణ్యాన్ని నెలకొల్పింది, స్థిరమైన బెంచ్ మార్క్ బీటింగ్ ఫండ్ పనితీరును ప్రదర్శిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన రేటింగ్ ఏజెన్సీ అయిన మార్నింగ్ స్టార్ ద్వారా 99.93% కంపెనీ ఫండ్స్ ఏయుఎం 4 లేదా 5 స్టార్ (5 సంవత్సరాల ప్రాతిపదికన) రేటింగ్ చేయబడింది. ఇది పరిశ్రమ సగటు కంటే 30% కంటే తక్కువ నిధుల ఏయెఎ 4 లేదా 5 స్టార్ రేటింగ్ కంటే చాలా ఎక్కువ. టాటా ఏఐఏ ఈవిపి - సిఐఓ హర్షద్ పాటిల్ మాట్లాడుతూ, "టాటా ఏఐఏ లైఫ్కు పెట్టుబడి లక్ష్యానికి అనుగుణంగా, మేము ఉన్నతమైన, స్థిరమైన మరియు రిస్క్-సర్దుబాటు చేసిన దీర్ఘకాలిక రాబడిని అందించడానికి ప్రయత్నిస్తున్నాము. స్థాపించబడిన పరిశోధన ప్రక్రియ ఆధారంగా, మేము స్టాక్ పికింగ్లో దిగువ-అప్ విధానాన్ని అనుసరిస్తాము. అలా చేయడం ద్వారా, మేము మా పోర్ట్ఫోలియో ఫండ్లో అత్యుత్తమ పనితీరును అందించగలిగామన్నారు.

## దుబాయ్‌లో ట్రావెల్ గైడ్‌తో హోలీ వేడుక




దాదాపు 200 మంది జాతీయులకు నిలయమైన దుబాయ్, అద్భుతమైన భద్రతా సూచిక 83.7 తో (నంబియాస్ మిడ్ 2024 సేఫ్టీ ఇండెక్స్ బై సిటీ) ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన నగరాల్లో స్థిరంగా ర్యాంక్ పొందుతుంది. ఇది ఒంటరి మహిళా ప్రయాణికులకు అనువైన గమ్యస్థానంగా నిలిచింది, ఏ సమయంలోనైనా నగరాన్ని అన్వేషించేటప్పుడు మనశ్శాంతిని అందిస్తుంది. సుదీర్ఘమైన హోలీ వారాంతం సమీపిస్తున్నందున, కుటుంబం లేదా స్నేహితులతో సురక్షితమైన, ఉత్సాహభరితమైన వాతావరణంలో రంగుల పండుగను జరుపుకోవాలని చూస్తున్న మహిళలకు దుబాయ్ సరైన వేదికగా నిలుస్తుంది.మహిళలు దుబాయ్లో తమ హోలీ వేడుకలను ఎలా సద్వినియోగం చేసుకోవచ్చంటే...

- **జుమేరా ఎమిరేట్స్ టవర్స్** : దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్ మధ్యలో ఉన్న ఈ ల్యాండ్మార్క్ హోటల్ మహిళా అతిథుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన డీలక్స్ గదుల శ్రేణిని అందిస్తుంది. ఈ గదులు అంకితభావంతో కూడిన మహిళా సిబ్బంది సేవలతో ప్రత్యేకమైన అనుభవాన్ని అందిస్తాయి.
- **దుబాయ్ లేడీస్ క్లబ్** : జుమేరా బీచ్ తీరంలో ఉన్న దుబాయ్ లేడీస్ క్లబ్ మొరాకో-ప్రేరేపిత అల్ అసల్లా స్పా, పూర్తిగా అమర్చబడిన ఫిట్‌నెస్ సెంటర్ మరియు స్విమ్మింగ్ పూల్స్, ప్రైవేట్ బీచ్ యాక్సెస్, వాటర్ స్పోర్ట్స్, వర్క్షాప్‌లు, ఆర్ట్ ఎగ్జిబిషన్లు, ఫ్యాషన్ షోలు వంటి కార్యకలాపాలకు నిలయం.
- **బైత్ అల్ బనాత్ ఉమెన్స్ మ్యూజియం** : డీరా గోల్డ్ సౌక్ సమీపంలో ఉన్న బైత్ అల్ బనాత్ ఉమెన్స్ మ్యూజియం ఎమిరాటీ మహిళల చరిత్ర మరియు యుఎఇ అభివృద్ధిలో వారి పాత్ర గురించి పరిజ్ఞానం అందిస్తుంది.
- **పలాజ్జో వెర్సేస్ దుబాయ్** : సోమవారాలను పలాజ్జో వెర్సేస్ దుబాయ్లోని స్పాలో మహిళా దినోత్సవంగా అంకితం చేస్తారు, ఇక్కడ ఎంపిక చేసిన చికిత్సలపై 50% తగ్గింపుతో పాటు బెవరేజస్ లో ఒకటి ఉచితంగా మహిళలు పొందవచ్చు.

### 600 మిలియన్ రిజిస్టర్డ్ యూజర్లు

## మైలురాయిని అందుకున్న ఫోన్‌పే

భారతదేశపు అగ్రగామి డిజిటల్ పేమెంట్స్ తమ ప్లాట్ఫామ్లో రిజిస్టర్ చేసుకున్న యూజర్ల సంఖ్య 600 మిలియన్ల (60 కోట్లు) మైలురాయిని చేరుకుందని ఫోన్పే నేడు ప్రకటించింది. కోట్లాదిమందికి తన ఫైనాన్షియల్ సర్వీస్లు, టెక్నాలజీ సొల్యూషన్లతో సేవలు అందించే స్థాయికి ఎదిగి, ఈ ఏడాది తన పదో వార్షికోత్సవం జరుపుకోనున్న తరుణంలో ఇది గొప్ప మైలురాయిని సూచిస్తోంది. తన ప్రొడక్ట్‌లు, సర్వీస్ ఆఫర్లను నిలకడగా విస్తరించుకుంటుండడతోపాటు, ప్లాట్ ఫామ్ కు కస్టమర్ల ఆదరణ రోజురోజుకు పెరుగుతుండడం ఈ మైలురాయిని చేరుకోవడంలో క్రియాశీలక పాత్ర పోషించాయి. విశ్వసనీయత, వేగం, వ్యక్తిగతీకరించిన లావాదేవీ అనుభవాలపై దృష్టి కేంద్రీకరించి, కంపెనీ అభివృద్ధి చేసిన సురక్షిత పేమెంట్ వ్యవస్థ లక్షలాది మంది యూజర్ల ఆదరణను చూరగొంది. దేశవ్యాప్తంగా ఉన్న తన మర్చంట్ నెట్ వర్క్ లో ఫోన్పేను విస్తృతంగా స్వీకరించడం కూడా ఈ వృద్ధికి దోహదపడింది. ఈ పరిస్థితి ఇటు వినియోగదారులకు, అటు బిజినెస్ సంస్థలకూ సేవలు అందించే దృఢమైన డిజిటల్ పేమెంట్ వాతావరణాన్ని రూపొందించింది. ఈ మైలురాయి గురించి ఫోన్ పే సహ వ్యవస్థాపకుడు, సి.ఇ.ఓ సమీర్ నిగమ్ మాట్లాడుతూ, "60 కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్న యూజర్ల స్థాయిని అందుకోవడం ఫోన్పేలోని మేము అందరం గర్వపడుతున్నాము. మేము సాధించే ప్రతి మైలురాయి నిజంగా అందరినీ కలుపుకుని వెళ్లే ఆర్థిక వాతావరణాన్ని నిర్మించాలనే మా దీర్ఘ దృష్టికి వాస్తవ రూపం తీసుకురావడానికి మమ్మల్ని మరింత చేరువ చేస్తోంది. మేము ఇలాగే మా యూజర్ల అవసరాలకు తగ్గట్టు ఎప్పటికప్పుడు స్వదేశంలోనే పరిష్కారాలు కనుగొంటూ భారతదేశపు డిజిటల్ రూపాంతరాన్ని ముందుకు నడిపించడంలో సహాయపడేందుకు కృషిని కొనసాగిస్తాము" అని అన్నారు.

సూర్య
విజయవాడ
శుక్రవారం
14 మార్చి 2025


# నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

● ఉదయం 9:29 గంటలకు మొదలై మధ్యాహ్నం 3:39 గంటల వరకు ● దాదాపు 6 గంటల పాటు గ్రహణ దశ ● భారత్‌లో ఈ గ్రహణ స్థితి కనిపించదు

న్యూఢిల్లీ : చంద్రగ్రహణం అంటే మనం చిన్నప్పుడు స్కూల్ లో చదివే ఉంటాము. భూమి, సూర్యుడు, చంద్రుడు మూడు ఒకే సరళరేఖలోకి వచ్చిన సమయంలో ఏర్పడే ఒక ఖగోళ సంఘటన. ఇక చంద్రగ్రహణం విషయానికి వస్తే.. భూమి సూర్యుని కాంతిని చంద్రుడిపైకి వెళ్ళకుండా అడ్డుకోవడం ద్వారా ఇది ఏర్పడుతుంది. చంద్రుని కక్ష్య, భూమి నీడ పడే విధానం ఆధారంగా ఇది సంపూర్ణ చంద్రగ్రహణం లేదా అర్ధ చంద్రగ్రహణంగా ఏర్పడుతుంది.
ఇక సంపూర్ణ చంద్రగ్రహణం సమయంలో భూమి నీడ చంద్రుడిని పూర్తిగా కప్పివేస్తుంది. దీని కారణంగా చంద్రుడు ఎరుపు లేదా నారింజ రంగులోకి కనిపిస్తాడు. కాగాలంలో ఏర్పడే ఈ ప్రత్యేక దృశ్యాన్ని 'బ్లడ్ మూన్' అని పిలుస్తారు. ఇకపోతే ఈ ఏడాది మొదటి గ్రహణం హోలీ పండుగ రోజు అంటే మార్చి 14న ఏర్పడనుంది. ఇక హోలీ నాడు ఏర్పడేది సంపూర్ణ చంద్రగ్రహణం.
ఇక చంద్రగ్రహణంరోజు భూమి నీడ చంద్రునిపై ఏకంగా 99.1% వరకు కప్పేయనుంది. ఈ సంపూర్ణ చంద్రగ్రహణ భారత కాలమానం ప్రకారం, మార్చి 14న ఉదయం 9:29 గంటలకు మొదలై మధ్యాహ్నం 3:39 గంటలకు అయిపోనుంది. ఇక మధ్యాహ్నం 12:29 గంటలకు ఈ సంపూర్ణ చంద్రగ్రహణం గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. అలాగే ఈ సంపూర్ణ చంద్రగ్రహణం ఉదయం 11:57 గంటలకు మొదలై మధ్యాహ్నం 1:01 గంటలకు ముగుస్తుంది. ఇలా మొత్తంగా గ్రహణ దశ దాదాపు 6 గంటల పాటు ఉండనుంది.



ఇక ఈ సంపూర్ణ చంద్రగ్రహణం చాలా ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించనుంది. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ అమెరికా, పశ్చిమ ఐరోపా, ఆఫ్రికా దేశాల్లో గ్రహణాన్ని ప్రత్యక్షంగా వీక్షించగలరు. భారత దేశంలో గ్రహణ సమయానికి పగలు కావడం వల్ల ఇది అసలు కనిపించదు. ఐరోపాలో చంద్రుడు అస్తమించే సమయంలో గ్రహణం కొనసాగుతుండగా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్లో చంద్రుడు ఉదయించే సమయానికి గ్రహణం ముగియనుంది.

# త్వరలో భారత్‌లో స్టార్ లింక్ సేవలు

● తాజాగా భారతీ ఎయిర్టెల్, జియో ప్లాట్ ఫార్మ్స్ స్పేస్ ఎక్స్‌తో ఒప్పందాలు
● అధిక ధర, స్పెక్ట్రం అనుమతుల సమస్యలు ● మరి భారత్‌లో విజయం సాధించేనా?

న్యూఢిల్లీ : భారత మార్కెట్లో స్పేస్ సంస్థకు చెందిన స్టార్ లింక్ ఉపగ్రహ ఆధారిత బ్రాడ్బాండ్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్న సంగతి విధితమే. అయితే, దీని అధిక ధర కారణంగా సాధారణ వినియోగదారులకు అందుబాటులోకి రావడం కష్టంగానే కనపడుతుంది. స్టార్ లింక్ సేవలు ప్రస్తుతం ఉన్న జియో, ఎయిర్టెల్ లాంటి ప్రముఖ బ్రాడ్ బాండ్ సేవల కంటే 10 నుండి 14 రెట్లు అధికంగా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తక్కువ భూమి కక్ష్య ఉపగ్రహాల ద్వారా అందించే ఈ ఇంటర్నెట్ సేవలు ప్రభుత్వ సబ్సిడీలు లేకుండా తక్కువ ధరకు అందడం కష్టమే. కొన్ని నివేదికల ప్రకారం, స్టార్ లింక్ సేవలు కేవలం ప్రీమియం సర్వీసుగానే కొనసాగుతుందని అంచనా వేసాయి.
అంతేకాకుండా, స్టార్ లింక్ వినియోగదారులకు అవసరమైన ఇన్ స్టలేషన్ కు ఖర్చు దాదాపు రూ.16,000 పైగా ఉండడంపై మరింత ప్రభావం చూపనుంది. అయితే స్టార్ లింక్ 200-250 ఎంబిపిఎస్ వేగాన్ని అందించే అవకాశం ఉన్నప్పటికీ, భారత్లో సేవల విస్తరణలో కెపాసిటీ పరిమితులు తలెత్తే అవకాశం ఉంది. ప్రస్తుతం 5G విస్తృతంగా పెరుగుతున్న కారణంగా స్టార్ లింక్ సేవలు కేవలం కొందరికి మాత్రమే పరిమితం అవుతాయని అంచనా వేస్తున్నారు.
ఇకపోతే తాజాగా భారతీ ఎయిర్టెల్, జియో ప్లాట్ ఫార్మ్స్ స్పేస్ ఎక్స్‌తో కలిసి స్టార్ లింక్ సేవలను భారత్లో ప్రారంభించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ భాగస్వామ్యం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు అధిక




వేగం బ్రాడ్ బ్యాండ్ అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. జియో తన జియో ఎయిర్ ఫైబర్, జియో ఫైబర్ కు అనుగుణంగా స్టార్ లింక్ సేవలను ఉపయోగించాలనుకుంటుంది. అయితే, స్టార్ లింక్ సేవలకు సంబంధించి ఇప్పటివరకు భారత ప్రభుత్వ అనుమతులు, స్పెక్ట్రం లైసెన్సులు పొందలేదు. అందువల్ల ఇది పూర్తి స్థాయిలో మొదలవ్వడానికి ఆలస్యమయ్యే అవకాశముంది.

## రైలు హైజాక్‌లో అఫ్గాన్ పై పాక్ ఆరోపణలు

తిప్పికొట్టిన తాలిబన్లు



పెషావత్: పాక్‌లోని బలోచిస్థాన్ లో ప్రయాణికుల రైలును వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ హైజాక్లో అఫ్గానిస్థాన్కు చెందిన మిలిటెంట్ల ప్రమేయం ఉందంటూ పాక్ ఆరోపణలు చేసింది. ఈ ఆరోపణలను తాలిబన్లు తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ బాధ్యతారాహిత్య ప్రకటనలు చేస్తోందంటూ మండిపడ్డారు. "బలోచిస్థాన్ ప్రావిన్సులోని ప్యాసింజర్ రైలు హైజాక్ ఘటనను అఫ్గానిస్థాన్‌తో పాక్ ఆర్మీ ముడిపెడుతోంది. వారు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. వాటిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి బాధ్యతారాహిత్య ప్రకటనలు చేసే బదులు సొంత భద్రతపై దృష్టి సారిస్తే బాగుంటుంది" అని అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి అబ్దుల్ కహర్ బాల్కీ హితవు పలికారు. మొత్తం 400 మంది ప్రయాణిస్తున్న ఈ రైలుపై మిలిటెంట్లు దాడికి తెగబడ్డారు. రైలు మార్గంలో 17 సొరంగాలు ఉండగా.. 8వ సొరంగం వద్ద మిలిటెంట్లు ట్రాక్‌ను పేల్చి జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఇప్పటికే బలోచ్ మిలిటెంట్లు 33 మందిని చంపేసినట్లు పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. 21 మంది ప్రయాణికులతో సహా నలుగురు సైనికులు వారి చేతిలో హతమయ్యారని తెలిపింది. ఈ హైజాక్ లో అఫ్గాన్ హస్తం ఉందంటూ పాక్ చేసిన ఆరోపణలపై తాజాగా స్పందించిన తాలిబన్లు గట్టి కౌంటర్ ఇచ్చారు.

## కర్స్క్‌లో రష్యా బలగాల పైచేయి..

● అతిపెద్ద పట్టణం తిరిగి స్వాధీనం
● యుద్ధభూమిలో ఓటమివైపు జారిపోతున్న ఉక్రెయిన్



మాస్కో: ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలో యుద్ధభూమిలో పుతిన్ సేనలు పైచేయి సాధించాయి. కర్స్క్ రీజియన్‌లోని అతిపెద్ద పట్టణమైన సుడ్జాను తిరిగి తమ అధీనంలోకి తెచ్చుకున్నట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ రీజియన్లోని కొంతభాగాన్ని గతేడాది ఉక్రెయిన్ బలగాలు అనూహ్యంగా ఆక్రమించిన విషయం తెలిసిందే. కొన్నిరోజులుగా కర్స్క్ ప్రాంతంలో రష్యా బలగాలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. దానిని పూర్తిగా స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టాయి. అమెరికా నుంచి సాయం నిలిచిపోవడంతో మాస్కో సేనలు రెట్టించిన ఉత్సాహంతో దాడులు చేస్తున్నాయి. వీటికితోడు ఉత్తరకొరియా దళాలు కూడా గత కొన్ని రోజులుగా ఇక్కడ పలు ఉక్రెయిన్ స్థావరాలను స్వాధీనం చేసుకొన్నాయి. తాజాగా అతిపెద్ద పట్టణమైన సుడ్జాను పుతిన్ సేనలు అధీనంలోకి తెచ్చుకున్నాయి.

**Russia: డిమాండ్లు పాతవే.. అయినా వెల్లడించిన రష్యా..!**

ఇదిలాఉంటే.. పశ్చిమ రష్యాలోని కర్స్క్ లో బుధవారం పుతిన్ పర్యటించిన సంగతి తెలిసిందే. రష్యా దళాల కంట్రోల్ సెంటర్కు అధ్యక్షుడు వెళ్లారు. ఆయన మిలిటరీ దుస్తుల్లో ఉన్న దృశ్యాలను మీడియా ప్రసారం చేసింది. ఈ సందర్భంగా యుద్ధ భూమిలోని పరిస్థితులను రష్యన్ జనరల్ స్టాఫ్ హెడ్ వలెరీ జెరసిమోవ్.. పుతిన్‌కు వివరించారు. కొంతమంది ఉక్రెయిన్ సైనికులు తమకు లొంగిపోయినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఈ ప్రాంతం నుంచి కీవ్ దళాలను తరిమికొట్టాలని అధ్యక్షుడు ఆదేశించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే తాజా ప్రకటన వచ్చింది.

# 'కూర్చుని మాట్లాడుకుందాం..'

● అమెరికాతో ట్రేడ్ వార్‌పై చైనా వ్యాఖ్య ● వాణిజ్య ఉద్రిక్తతలను చర్చలతో పరిష్కరించుకుందామని పిలుపు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే చైనాపై సుంకాలతో విరుచుకుపడ్డారు డొనాల్డ్ ట్రంప్. అందుకు ప్రతిగా బీజింగ్ కూడా దూకుడు నిర్ణయాలు తీసుకుంది. దీంతో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ పరిణామాలపై తాజాగా చైనా స్పందిస్తూ.. అగ్రరాజ్యంతో చర్చలకు పిలుపునివ్వడం గమనార్హం.
"ఆర్థిక, వాణిజ్య రంగాల్లో విభేదాలు, వివాదాల పరిష్కారం విషయంలో చైనా - అమెరికా దేశాలు సానుకూల, సహకార వైఖరిని అవలంబించాలని మేం ఎల్లప్పుడూ కోరుకుంటాం. అయితే, ఇరు దేశాల మధ్య ఆ సంప్రదింపులు, చర్చలు పరస్పర ప్రయోజనాలు, సమానత్వం, గౌరవంపై ఆధారపడి జరగాలని ఆశిస్తున్నాం. బెదిరింపులు, కవ్వింపులతో ప్రతికూల ఫలితాలే వస్తాయి. అమెరికా, చైనా కలిసి పనిచేస్తాయని ఆశిస్తున్నాం. చర్చలతో సమస్యను పరిష్కరించుకోవడమే సరైన మార్గం" అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి హీ యాంగ్ కియాన్ మీడియా సమావేశంలో వెల్లడించారు.
అమెరికా అధ్యక్షుడిగా జనవరిలో ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్.. ఆ వెంటనే మెక్సికో, కెనడాతో పాటు చైనాపై సుంకాలు విధించారు. ప్రమాదకర ఫెంటనిల్ సరఫరాను అడ్డుకోవడంలో విఫలమైనందుకు గానూ బీజింగ్పై 10శాతం టారిఫ్లు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవలే



సుంకాలను 20శాతానికి పెంచుతున్నట్లు మరో షాకిచ్చారు. దీనికి చైనా సర్కారు కూడా దీటుగా స్పందించింది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు, పోర్క్, చికెన్ వంటి వాటిపై 15శాతం వరకు టారిఫ్‌లు వసూలు చేస్తామని వెల్లడించింది. రానున్న రోజుల్లో అగ్రరాజ్యం తీసుకునే నిర్ణయాలకు ప్రతిస్పందన కూడా అదే స్థాయిలో ఉంటుందని ఇదివరకే హెచ్చరించింది. ఈ పరిణామాల వేళ యూఎస్ తో చర్చలకు పిలుపునిస్తూ చేసిన తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.


## ట్రంప్ విధానాలతో ఎవరూ సురక్షితంగా లేరు

జీ7 దేశాలకు కెనడా హెచ్చరిక..



కెనడా: వాణిజ్య యుద్ధ భయాలు జి-7 దేశాలను వెంటాడుతున్నాయి. తాజాగా ఆ గ్రూప్ విదేశాంగ మంత్రుల సమావేశంలో కూడా ఈ అంశం చర్చకు వచ్చింది. కెనడా మంత్రి మెలానియో జోలీ మాట్లాడుతూ అమెరికాతో ముదురుతున్న ట్రేడ్ వార్ పై ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రరాజ్య చర్యలతో ఎదురయ్యే పరిణామాలపై మిగిలిన దేశాలను హెచ్చరించారు. "అత్యంత సన్నిహిత మిత్రదేశమైన మాతో అమెరికా ఇలా చేయగలిగితే.. ఇక ఎవరూ సురక్షితం కాదు" అని ఆమె వ్యాఖ్యానించారు. కెనడా రాబోయే విపత్తును ముందుగానే హెచ్చరిస్తోందన్నారు. అమెరికా చర్యలకు వ్యతిరేకంగా మిగిలిన మిత్రదేశాల మద్దతును కూడగట్టి ఎదుర్కొనేందుకు వీలుగా జోలీ ఈ చర్యలు చేపట్టినట్లు భావిస్తున్నారు. మరోవైపు కెనడా సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తూ ట్రంప్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలను కూడా జోలీ ఈ సమావేశంలో ప్రస్తావించారు. కెనడా అలాంటి బెదిరింపులకు ఏమాత్రం వెనక్కి తగ్గదని ఆమె పేర్కొన్నారు. ఐరోపా సమాఖ్యతో కలిసి యుద్ధవిన్యాసాలు చేయడం, ఆయుధతయారీ వంటివి తమ సార్వభౌమత్వ రక్షణకు అవసరమని వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా మంత్రి మార్కో రూబియో మాత్రం కెనడా స్వాధీనంపై ట్రంప్ వ్యాఖ్యలను కొంచెం తేలిగ్గా చూపించే యత్నం చేశారు. ఆర్థిక కోణంలో మాత్రమే తమ అధ్యక్షుడు కెనడాను 51వ రాష్ట్రం కావాలని ఆకాంక్షించారని వివరణ ఇచ్చారు. "ఒక వేళ కెనడా 51 రాష్ట్రం అయితే అప్పుడు సరిహద్దుల గురించి, ఫెంటనిల్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నది ట్రంప్ భావన" అని రూబియో సర్దిచెప్పారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ "జి-7 సమావేశానికి ఉద్దేశించిన అంశాలపై దృష్టి పెట్టాలని.. అంతేకానీ.. ఇది మేము కెనడాను ఆక్రమిస్తాం అన్నందుకు ఏర్పాటు చేసిన సమావేశం కాదు " అని వ్యాఖ్యానించారు. అమెరికా-కెనడా సంబంధాలు చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో పతనం అయ్యాయి. కెనడా ఉక్కు, అల్యూమినియంపై సుంకాలను 50 శాతానికి పెంచుతానని తొలుత ప్రకటించిన ట్రంప్.. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. 25 శాతమే అమలు చేస్తామని ప్రకటించారు. దీనికి కెనడా కూడా తీవ్రంగా స్పందించింది. వాషింగ్టన్ నుంచి దిగుమతి అయ్యే 20 బిలియన్ డాలర్ల వస్తువులపై ప్రతీకార సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది.

## నేడు ఆకాశంలో అద్భుత బ్లడ్ మూన్



న్యూఢిల్లీ: హోలీ పండగ రోజున (మార్చి 14) ఆకాశంలో ఒక అద్భుతం చోటు చేసుకోబోతోంది. అదే బ్లడ్ మూన్. ఈ ఏడాది మొదటి గ్రహణం...శుక్రవారం అంటే హోలీ రోజున సంభవిస్తోంది. ఇది సంపూర్ణ చంద్రగ్రహణం. బ్లడ్ మూన్ అని పిలవబడే చంద్రగ్రహణం ఈసారి ఏర్పడుతుందని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి, సూర్యుడు, చంద్రుడు ఒక సరళరేఖ పై ఉన్న సమయంలో చంద్రుడిపై భూమి నీడ పడడం వలన పూర్తిగా కప్పేస్తుంది. దీనిని చంద్ర గ్రహణం అంటారు. గ్రహణం సమయంలో చంద్రుడు ఎప్పుడూ కనపడే రంగులోనే ఉంటాడు. కానీ, ఈ బ్లడ్ మూన్ సమయంలో మాత్రం చంద్రుడు పూర్తిగా ఎరుపు లేదా నారింజ రంగులో వచ్చి కనువిందు చేస్తాడు. సూర్యుడి నుంచి వచ్చే ఎరుపు లేదా నారింజ కిరణాలు భూమిపై నుంచి ప్రయాణం చేసి చంద్రుడి వర్ణాన్ని మారుస్తాయి. దీనిని రేలీ స్కాటరింగ్ అంటారు. మన దేశంలో గ్రహణాన్ని చూడలేము. ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా ఖండాల్లో ఇది కనిపిస్తుందంటున్నారు సైంటిస్టులు. ఇది ఒక ఖగోళ వింత మాత్రమేనని, అంతకంటే దీనికి ప్రాముఖ్యత లేదంటున్నారు కొందరు.

# ఆత్మగౌరవమే మా ప్రాణం.. హక్కులను హరిస్తే ఊరుకోం

● ఆ కాషాయ విద్యావిధానాన్ని అంగీకరించం ● తిరువళ్లూరు సభలో సీఎం స్టాలిన్

చెన్నై: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విద్యావిధానం ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచేది కాదని, అది పూర్తిగా కాషాయ విద్యావిధానమని, అందుకే దానిని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్( మరోమారు సుస్పష్టంగా ప్రకటించారు. రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం పేరుతో త్రిభాషా విద్యావిధానాన్ని, నిర్బంధ హిందీ అమలు చేయడానికి, పునర్విభజన సాకుగా లోక్సభ స్థానాలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ రాష్ట్రమంతటా బుధవారం నిరసన సభలు జరిగాయి. తిరువళ్లూరు జిల్లా తిరుపాచ్చూరు కేపీఎస్ క్రికెట్ అకాడమీ మైదానంలో జరిగిన నిరసన సభలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయినుండే నిరుపేద విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా, కులవృత్తులను ప్రోత్సహించేలా, దేశమంతటా హిందీ భాషకు పట్టం కట్టేలా ఉండటం వల్లే జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ కాషాయ విద్యావిధానాన్ని అమలు చేయకపోతే నిధులివ్వ మంటూ కేంద్రంలోని బీజేపీ పాలకులు బెదరిస్తున్నారని, విద్యా శాఖ మంత్రి తమిళ ఎంపీలను, తమిళులను అనాగరికులంటూ విమర్శించి తన స్థాయిని దిగజార్చుకున్నారని, డీఎంకే ఎంపీల తీవ్ర నిరసనల కారణంగా అప్పటికప్పుడు ఆ మంత్రి తన మాటను ఉపసంహరించుకున్నారని చెప్పారు. తమిళులు ఎన్నో దశాబ్దాలుగా నాగరికులుగానే వ్యవహరిస్తున్నారని, వారికి ఆత్మగౌరవం ఎక్కువని, కేంద్రానికి ఎప్పుడూ బానిసలు వ్యవహరించరన్నారు. మదురై ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేసి ఏడేళ్లయినా ఓ ఇటుక కూడా వేయకుండా ఉండటమే నాగరికమా? రాష్ట్రంలో తుఫాను, వర్షబాధితులను



ఆదుకోవటానికి రెండేళ్లుగా నిధులివ్వకపోవడం నాగరికమా? హిందీ భాషను నిర్బంధం చేయకపోతే నిధులిచ్చే ప్రసక్తేలేదంటూ రాష్ట్రాన్ని బెదరించడం నాగరికమా? పదేళ్లుగా తమ అడుగులకు మడుగులొత్తని రాష్ట్రాలపై కక్షసాధింపు చర్యలు పాల్పడటమే నాగరికమా? అంటూ స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్రమోదీ బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలను బెదిరించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఉభయసభల్లో డీఎంకే సభ్యులు పాలకుల అవినీతి, అరాచకాలను ఎండగడుతుండటం చూసి భయపడటం వల్లే లోక్‌సభ స్థానాలను తగ్గించేందుకు కేంద్రంలోని బీజేపీ పాలకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయడానికే దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయదలిచానని చెప్పారు. ఈ సభలో మంత్రి ఆవడి ఎస్ఎం నాజర్, డీఎంకే తిరువళ్లూరు తూర్పు జిల్లా శాఖ ఇన్ చార్జి ఎంఎస్‌కే రమేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి మరోసారి సున్నా

మిజోరాం స్థానిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం..



మిజోరాం: దశాబ్దాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీకి వరసగా ఓటములు ఎదురవుతూనే ఉన్నాయి. ఇప్పటికే హర్యానా మేయర్ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. చివరకు కాంగ్రెస్ నాయకుడు భూపిందర్ హుడా ఇలాకాలో కూడా కాంగ్రెస్ ఓడిపోయింది. మొత్తం 10 మేయర్ స్థానాల్లో 09ని గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. పదోస్థానంలో బీజేపీ రెబల్ అభ్యర్థి విజయం సాధించారు. ఇదిలా ఉంటే, తాజాగా మిజోరం స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. కాంగ్రెస్ మరోసారి పరాజయం పాలైంది. బుధవారం జరిగిన చక్మా అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ (CADC) స్థానిక ఎన్నికల్లో బీజేపీ 88 గ్రామ కౌన్సిల్ స్థానాలకు గాను 64 స్థానాలను గెలుచుకుని అఖండ విజయం సాధించింది. లాంగ్త్లై జిల్లాలో ఈ ఎన్నికలు జరిగాయి. 88 సీట్లలో 12 స్థానాలు ఏకగ్రీవమైతే, ఇందులో 09 స్థానాలను బీజేపీ, మూడు స్థానాలను జోరం పీపుల్స్ మూవ్మెంట్ (జెడ్పిఎం) గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేదు. చివరిసారిగా 2020లో జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ అయిన ఎంఎన్ఎఫ్ 64 గ్రామ కౌన్సిల్ సీట్లను గెలుచుకుంటే, ఆ సమయంలో బీజేపీ 16 సీట్లలో విజయం సాధించింది.

# హైజాక్ ఆపరేషన్‌పై పాక్ అబద్ధాలు

బలోచ్ రెబల్స్ స్పందన

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిం దే. మిలిటెంట్ల నుంచి బందీలను విడిపించేందుకు తాము నిర్వహించిన ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని పాక్ ఆర్మీ చేసిన ప్రకటనను బలోచ్ వేర్పాటువాదులు ఖండిం చారు. తాము ఇంకా సైన్యంతో పోరాడుతున్నామని బలోచ్ లిబరేషన్ ఆర్మీ గురువారం తన ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి "బలోచిస్థాన్లోని బోలన్ జిల్లాలో ఆపరేషన్‌ను ముగిం చినట్లు పాక్ ఆర్మీ చేసిన ప్రకటన అబద్ధం. ఇరువర్గాల మధ్య పోరాటం జరుగుతోంది. పాక్ సైన్యం మరణించిన సైనికులు, రెబల్స్ ఫొటోలు ఇంకా విడుదల చేయలేదు. సైన్యం వైపు భారీగా నష్టం జరుగుతోంది. బందీలుగా ఉన్న తమ సిబ్బందిని రక్షించుకోలేకపోయింది. సైనికుల స్థైర్యం దెబ్బతిన కుండా చూసుకునేందుకు వాస్తవ సంఖ్యను దాచి, తప్పుడు ప్రచారం చేస్తోంది" అని తన ప్రకటనలో పేర్కొంది. ఆర్మీ రక్షించిందని చెప్తున్న సిబ్బందిని యుద్ధనీతిని అనుసరించి, తామే విడుదల చేశామని పేర్కొంది. యుద్ధంలో తమను ఓడించలేక.. నిరాయుధులైన బలోచ్ ప్రజలపై పాక్ ఆర్మీ దాడులు చేస్తోందని మండిపడింది. ఇదిలాఉంటే.. రైలును హైజాక్ చేసిన వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు 33 మందిని హతమార్చినట్లు పాకిస్థాన్ సైన్యం బుధవారం ప్రకటించింది. "21 మంది ప్రయాణికులను వేర్పాటువాదులు హత్య చేశారు .ఈ ఆపరేషన్లో నలుగురు సైనికులు కూడా ప్రాణాలు కోల్పోయారు. మిలిటెంట్ల చెరలోని బందీలను రక్షించాం" అని సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. సుమారు 425 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్కు వెళుతున్న



జాఫర్ ఎక్స్ ప్రెస్ ను బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వేర్పాటువాదులు బోలన్ ప్రాంతంలో మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటనలతో హైజాక్ ఘటనకు తెరపడిందా.. లేదా అన్న విషయంలో అయోమయం నెలకొంది. ఇదిలా ఉంటే.. ఈ ఘటన నేపథ్యంలో బలోచిస్థాన్ ప్రావిన్స్లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పర్యటించారు. స్థానికంగా శాంతిభద్రతలను సమీక్షించడంతో పాటు బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు అక్కడకు వెళ్లారు.

## పెరియార్‌పై నిర్మలమ్మ వ్యాఖ్యలు సరికాదు

● నిర్మలమ్మ వ్యాఖ్యలకు విజయ్ కౌంటర్
● ఇప్పటికే కేంద్రం, తమిళనాడు మధ్య భాషాయుద్ధం

చెన్నై: ప్రముఖ సంఘసంస్కర్త పెరియార్పై కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చేసిన విమర్శలను తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ తీవ్రంగా ఖండించారు. ఏళ్లు గడిచినా ఆయన పేరు వాడకుండా ఉండలేని విధంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని కౌంటర్ ఇచ్చారు. తమిళాన్ని అవమానించిన వ్యక్తికి పూలమాలలు వేస్తున్నారంటూ ఈవీకే పెరియార్ ను పరోక్షంగా ప్రసావిస్తూ రాజ్యసభలో సీతారామన్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన విజయ్..సమాజంలో సాంఘిక దురాచారాలు పారదోలడానికి పెరియార్ చేసిన కృషిని కొనియాడారు. "బాల్య వివాహాలను వ్యతిరేకించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. కులం పేరిట జరిగిన అకృత్యాలను ఖండించారు. ఇలా మనం ఆయన గురించి చెప్తూపోవచ్చు. సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని మనం ఇప్పుడు మాట్లాడుతున్న మాటలను ఆయన వందసంవత్సరాల క్రితమే పిలుపునిచ్చి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పెరియార్ తమిళ భాషను అవమానించినందుకు కేంద్రమంత్రి నిజంగానే బాధపడ్డారా? మీరు నిజంగా బాధపడి ఉంటే..త్రిభాషాసూత్రాన్ని మాపై రుద్దడం ఆపేస్తారా? పెరియార్ గురించి ఎవరైనా అవమానకర వ్యాఖ్యలు చేస్తే.. అవి వివాదాస్పదం అవుతుంటాయి. తమిళనాడు ప్రజలమనసులో ఆయన ఎలా నిలిచి ఉన్నారో, ఆయన్ను



ఎలా గౌరవిస్తున్నారో ఈ ఒక్క ఉదాహరణ చాలు" అని విజయ్ అన్నారు.

**భాషపై భావోద్వేగం! :** జాతీయ విద్యా విధానంలోని (ఎన్ ఈపీ-2020) త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా విధానాల అమలు విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఎన్ ఈపీ-2020లోని కీలక అంశాలను, ముఖ్యంగా త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద అందించాల్సిన రూ.573 కోట్లను నిలిపేసింది.

# బలూచిస్తాన్ ట్రైన్ హైజాక్ వెనక భారత్ హస్తం

● పాకిస్తాన్ సంచలన ఆరోపణలు.. ● ఆఫ్ఘన్ నుంచి బీఎల్ ఏకి సాయం చేస్తున్నారని వాదన..

పెషవర్ : పాకిస్తాన్లోని అతిపెద్ద ప్రావిన్స్ బెలూచిస్తాన్లో "జాఫర్ ఎక్స్‌ప్రెస్" హైజాక్‌కి గురైంది. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న రైలుని బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ఫైటర్స్ హైజాక్ చేశారు. అయితే, ఈ ఘటన వెనక భారతదేశ హస్తముందని పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయం గురువారం ఆరోపించింది. ఈ హైజాక్లో 21 మంది ప్రయాణికులు, నలుగురు పారామిలిటరీ సైనికులు బలూచ్ ఫైటర్స్ చేతిలో మరణించారు. విదేశాంగ కార్యాలయ ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. హైజాక్ వెనక ఉన్న బలూచ్ ఉగ్రవాదులకు ఆఫ్ఘనిస్థాన్‌లోని వారి సహచరులతో సంప్రదింపులు జరుపుతున్నారని నిఘా నివేదికలు సూచించాయని చెప్పారు. భారత్ పేరు నేరుగా ప్రస్తావించకుండా, భారత్ హస్తముందనే రీతిలో ఆయన వ్యాఖ్యలు చేశారు. బీఎల్ఏ వంటి సంస్థలు దాని సరిహద్దుల్లో పనిచేయకుండా నిరోధించాలని పాక్ పదేపదే ఆఫ్ఘన్ ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన చెప్పారు.
జాఫర్ ఎక్స్‌ప్రెస్ దాడి తర్వాత చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైందని



చెప్పారు. మరోవైపు, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సలహాదారు రాణా సనావుల్లా మాట్లాడుతూ.. ఈ హైజాక్‌లో భారత ప్రమేయం ఉందని ఆరోపించారు. భారత్ ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఈ దాడుల్ని నిర్వహిస్తోందని నిందించారు. డాన్ న్యూస్కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సనావుల్లా ఈ ఆరోపణలు చేశారు.
భారత్ తెహ్రిక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్మరియు బలూచ్ లిబరేషన్ ఆర్మీ రెండింటికీ మద్దతు ఇస్తోందని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ.. భద్రతా దళాలు సంఘటన స్థలంలో ఉన్న 33 మంది ఉగ్రవాదులను హతమార్చాయని, మంగళవారం ఉగ్రవాదులు రైలుపై దాడి చేసినప్పుడు 21 మంది ప్రయాణికులను చంపారని అన్నారు. 450 మంది ప్రయాణికులతో వెళ్తున్న జఫర్ ఎక్స్‌ప్రెస్‌ని బెలూచిస్తాన్‌లోని సెబి జిల్లా మారుమూల ప్రాంతంలో బీఎల్ఏ అదుపులోకి తీసుకుంది. పాక్ ప్రకారం, ఈ ఘటనలో 70-80 మంది ఉగ్రవాదులు పాల్గొన్నారు.

సూర్య
features@suryaa.com
కలర్స్
LIFE IS A RAINBOW
సూర్య
విజయవాడ
శుక్రవారం
14 మార్చి 2025







# ఆనందోత్సాహాల

# హోలీ పర్వదినం

## రాక్షసత్వంపై మానవత్వం గెలిచిన రోజు

## మంచి వెలుతురు వైపు నడిచే చిహ్నంగా హోలికా దహనం

**తెలుగు నెలల్లో చివరిది ఫాల్గుణ మాసం. ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి రోజు హోలీ పర్వదినాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రజలు హోలీ పండుగ జరుపుకొంటారు. భారతదేశంలోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్లో ఈ పండుగను వైభవంగా చేసుకుంటారు. వసంత కాలంలో వచ్చే పండుగ కాబట్టి పూర్వం ఈ పండుగను వసంతోత్సవం పేరిట జరుపుకునేవారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగల్లో హోలీ ఒకటి. ఈ పండుగ సత్యయుగం నుంచి జరుపుకుంటున్నట్లు హిందూ పురాణాలు చెబుతున్నాయి. హోలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనదని అర్థం. మరిన్ని వివరాలలోకి వెళితే...**



హోలికా దహనం (చోటీ హోలీ) చెడుపై మంచి లేదా రాక్షసత్వంపై మానవత్వం గెలిచిన రోజుగా హిందూ సమాజం భక్తి పూర్వకం గా మహదానందంతో జరుపుకున్నారు. జీవితంలో అహంకారం దుష్టశక్తుల రూపంలో వచ్చే కష్టనష్టాలనే చీకట్లను కాల్చి వేస్తూ భక్తి, దేవుడిపై నమ్మకం, మంచి వెలుతురు వైపు నడిచే రోజుగా హోలికా దహన పర్వదినాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఒడిసా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో హోలీకి ముందు రోజు "డోల్ పూర్ణిమ" వేడుకలను జరుపుకుంటూ కృష్ణుడు, రాధల విగ్రహాలను తీసుకువచ్చి, రంగు ధూళితో మసకబార్చి, వీధుల నిండా ముగ్గులు వేసి పర్వదిన ప్రేమామృత సారాన్ని ఆస్వాదిస్తారు.

### హోలికా (భోగి మంటలు) దహన పర్వదినం:

హోలికా దహనంతో దుష్టశక్తులు, వ్యాధుల వ్యాప్తి, ఆర్థిక ఇబ్బందులను కాల్చి బూడిద చేసే మంటలుగా హోలికా దహనాన్ని నిర్వహిస్తూ ఎండు కర్రలు, పిడకలు, ఎండు ఆకులు లాంటివి వేసి మండిస్తూ, ఆ మంటల చుట్టు సంతోషంగా నాట్యాలు, ప్రదక్షిణలు/ప్రార్థనలు చేయడం, హోలికా బొమ్మను మంటల్లో వేసి దుష్టశక్తులను దహనం చేయడం సాంప్రదాయంగా వస్తున్నది. ఈ మంటల వెలుగులకు టెంకాయలు, గోధుమలు, చెరుకు గడలు, కర్పూరం, బుక్కగులాలు లాంటివి సమర్పిస్తూ మంటల చుట్టు భక్తితో ప్రదక్షిణలు చేస్తారు. పుష్కలంగా పంట దిగుబడి రావాలని, చీడపీడలు తొలిగి పోవాలని రైతులు వేడుకుంటారు. హోలికా మంటలు పర్యావరణ శుద్ధికి, వ్యాధి కారక చెడు సూక్ష్మజీవుల దహనానికి, ఆ బూడిదను ఒంటికి పూసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరగడానికి కూడా సహకరిస్తాయని నమ్ముతారు. చలికాలం పోతూ వసంత రుతువు ఆగమనానికి గుర్తుగా కూడా ఈ పండుగను పరమానందంతో భక్తిపూర్వకంగా వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది.





### హోలీ రంగుల పర్వదినం:

హిందూ సమాజంలో హోలీ పండుగకు ఎంతో ప్రత్యేకత ఉన్నది. భారత్లో ప్రతి ఏట ఫాల్గుణ మాస పౌర్ణమి పుణ్య గడియల్లో మార్చి 14, 2025న పెద్ద ఎత్తున నిర్వహించుకోవడం జరుగుతున్నది. హోలీ పండుగ ముందు రోజు 13 మార్చి 2025న హోలికా దహనం నిర్వహిస్తారు. హోలీ పండుగ రోజు సరదాగా రంగులు చల్లుకుంటూ ఆనందంగా అందరూ కలిసి సంబరాలను చేసుకుంటారు. చెడుపై మంచి విజయం, శీతాకాల ముగింపును హోలీ సూచిస్తుంది. పంట దిగుబడులకు కృతజ్ఞతాపూర్వకంగా కూడా ఈ పర్వదినాన్ని ప్రజలు సంతోషంగా జరుపుకుంటారు.

హోలీ రోజు ఉదయం రంగు పొడులను పూసుకోవడం, స్వీట్లు పంపిణీ చేసుకోవడం, భంగ్ లేదా తండై తాగడం, పలు రకాల స్నాక్స్ తినడం, నృత్యాలు చేయడం, రోడ్ల వెంట, ఇంటి ముందర, ఊరువాడల్లో బంధువులు, స్నేహితులు సప్తవర్ణాల రంగులను చల్లుకుంటూ, డప్పు వాయిద్యాల నడుమ నీటి తుపాకులతో రంగు నీటిని పిచికారీ చేసుకుంటూ ప్రజలంతా సమూహాలుగా చేరి పరమానంద భరితంగా పర్వదినాన్ని ఆస్వాదిస్తారు. హోలీ సంబరాల అనంతరం స్నానాలు చేసి సాయంత్ర వేళల్లో బంధువుల ఇళ్లకు వెళ్లి పెద్దలకు పాదాభివందనం చేస్తూ ఆశీర్వచనాలు పొందుతారు.

### విదేశాల్లో హోలీ వేడుకలు

కాలచక్రంలో సంవత్సరాలు గడుస్తున్నకొద్ది ప్రవాసభారతీయులు ఉంటున్న చాలా ప్రాంతాలలో ఆఫ్రికా, ఉత్తర అమెరికాలో, ఐరోపా, దక్షిణ ఆసియాకు దగ్గర ఉన్న ప్రాంతాలలో హోలీ పండుగను ఘనంగా జరపుకుంటారు. కారణాలు ఏవైనా రంగుల పండుగ హోలీ అంటే అందరికి ఎంతో ఉత్సాహం. చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా స్నేహితులు, బంధువులతో ఎంతో ఆనందరంగా, ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకుంటారు.

### హోలీ రంగులు వదిలించుకుందాం ఇలా..

హోలీ రంగులను వలించుకోవడం ఎలా? హోలీ పండుగ రోజు అందరికీ ఉండే భయమిది. దాంతో హోలీ వేడుకలను తటపటాయిస్తూ జరుపుకొంటారు. అయితే చర్మానికి, దుస్తులకు అంటుకునే హోలీ రంగులను సులువుగా వదిలించుకునే వీలుంది.

### దుస్తుల నుంచి..

**బ్లీచ్:** రంగులు అంటుకున్న దుస్తులను నాన్ క్లోరి న్ బ్లీచ్ కలిపిన నీళ్లలో గంటపాటు నానబెట్టాలి. తర్వాత సబ్బురుద్ది శుభ్రం చేసి ఎండలో ఆరబెట్టాలి.

**వైట్ వెనిగర్ :** రెండు నుంచి మూడు లీటర్ల నీటిలో ఒక టీ స్పూన్ ఏరియల్, అర కప్పు వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఆ నీళ్లలో దు-స్తులు గంట పాటు నానబెట్టి ఉతికి ఆరేయాలి.

**నిమ్మరసం:** నిమ్మరసంలోని సిట్రిక్ యాసిడ్ రంగులను వదిలిస్తుంది. రంగు అంటిన కాడ దుస్తులను నిమ్మరసంలో ముంచి చేతులతో రుద్ది రంగును వదిలించి నీళ్లతో శుభ్రం చేసి ఆరబెట్టాలి.

**ఆల్కహాల్:** నీళ్లు కలపని ఆల్కహాల్ను నేరుగా మరక మీద ఒంపి చేతులతో రుద్ది రంగును వదిలించాలి. చల్లనీటి దార కింద దుస్తులు ఉంచి శుభ్రం చేసి ఆరబెట్టాలి.

### మరికొన్ని చిట్కాలు..

రంగు అంటిన వెంటనే వీలైనంత త్వరగా దుస్తులను శుభ్రం చేయాలి. ఆలస్యమయ్యే కొద్దీ రంగు దుస్తుల్లో ఇంకిపోతూ ఉంటుంది.

రంగు అంటుకున్న దుస్తులను తడిపి వదిలేయకూడదు. తడి ఆరనివ్వకూడదు. రంగులు అంటుకున్న వాటిని వదిలించే పనికి పూనుకోవాలి.రంగు అంటుకున్న దుస్తులను ఇతర దుస్తులతో కలిపి ఉతకకూడదు. ఇలా చేస్తే అన్ని దుస్తులకూ రంగులు అంటుకుంటాయి. దుస్తులకు అంటుకున్న రంగులను వదలించడానికి క్లోరిన్ కలిసిన బ్లీచ్ను ఉపయోగించకూడదు. ఈ బ్లీచ్తో దుస్తుల రంగుల వెలిసిపోతాయి.

**చర్మం నుంచి..**కొబ్బెరినూనె: రంగులు అంటుకున్న ముఖాన్ని కడిగేముందు కొబ్బరినూనె పూసుకోవాలి. తర్వాత చేతులతో బాగా రుద్దితే రంగులు కరిగి కొబ్బరినూనెలో కలుస్తాయి. ఆ తర్వాత సబ్బుతో రుద్ది కడిగేసుకుంటే రంగులు తేలికగా వదులుతాయి.

**గోధుమపిండి:** గోధుమపిండికి వంట నూనె చేర్చి పేస్టులా తయారు చేసుకోవాలి. ఈ పెస్ట్ను ముఖానికి పట్టించి కొద్ది నిమిషాల తర్వాత మసాజ్ చేయాలి. తర్వాత సబ్బుతో కడిగేసుకోవాలి.

**ముల్తానీ మట్టి:** దీంతో ఫేస్ ఫ్యాక్ వేసుకొని పొడిగా మారిన తర్వాత రుద్ది కడిగేయాలి. ముల్తానీ మట్టితో పాటు రంగులు కూడా వదిలిపోతాయి.



**ఆమ్చూర్ :** మామిడి పొడికి నీళ్లు కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత రుద్ది కడిగేసుకోవాలి. గోళ్లకు అంటుకున్న రంగులను వదిలించుకోవడం కోసం నిమ్మరసంలో కొన్ని నిమిషాలు నానబెట్టి శు భ్రం చేసుకోవాలి. రంగులు అంటిన గోళ్లకు ట్రాన్స్పరెంట్ నెయిల్ పాలీష్ ఐప్లై చేసి కొన్ని చుక్కల బాదం నూనె కలిపిన గోరువెచ్చని నీళ్లలో గోళ్లను మునిగేలా పది నిమిషాల పాటు ఉంచాలి. గోళ్ల కు అంటుకున్న రంగులు నెమ్మదిగా కరిగి నీళ్ల లో కలుస్తాయి. హోలీ ఆడబోయే ముం దు గోళ్లకు ముదురు రంగు వేసుకోవాలి. ముదురు రంగు నెయి ల్ పాలీష్ రంగులు గోళ్లలో ఇంకిపోకుం డా అడ్డుకుంటాయి.

### శాస్త్రీయంగా

వసంత కాలంలో వాతావరణం చలి నుంచి వేడికి మారుతుంది. దీనివల్ల వైరల్ జ్వరం, జలుబు లాంటి వ్యాధులు ప్రబలుతాయి. కొన్ని ఔషధ మొక్కల నుంచి తయారు చేసిన సహజమైన రంగులు కలిపిన నీటిని చల్లుకోవడం వలన ఈ వ్యాధుల వ్యాప్తి తగ్గుతుందని ఒక వాదన. కుంకుమ, పసుపు, బిల్వాలను ఉపయోగించి ఆయుర్వేద వైద్యులు ఔషధ వనమూలికలను తయారు చేస్తారు. తడి రంగుల కోసం మోదుగ పూలను రాత్రంతా మరిగించి అవి పసుపు రంగులోకి మారే వరకు ఉంచుతారు. అది ఔషధ లక్షణాలు కలిగి ఉంటుంది. అటువంటి సహజ రంగు పొడులను చల్లుకోవడం వల్ల ఔషధంగా పనిచేస్తుంది. ప్రవాస భారతీయులు ఉంటున్న చాలా పాంతాల్లో ఆఫ్రికా, ఉత్తర అమెరికా, ఐరోపా, దక్షిణ ఆసియాకు దగ్గర ఉన్న ప్రాంతాల్లో హోలీ పండుగను ఘనంగా జరుపుకొంటారు. కారణాలు ఏమైనా రంగుల పండుగ హోలీ అంటే అందరికీ ఉత్సాహం ఉంటుంది.

చిన్నా పెద్ద అనే తారతమ్యం లేకుండా స్నేహితులు, బంధువులతో ఆనందంగా, ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకొంటారు.

మనలో దాగిన చెడు ఆలోచనలు, ప్రతికూల భావాలను హోలికా లేదా భోగి మంటల్లో దహనం చేస్తూ మంచి బాటన నడవడానికి నేడే శ్రీకారం చుడదాం, ఇతరుల దురాలోచనలను సహితం అగ్నికి అర్పిస్తూ, రంగుల పండుగ మన జీవితాల్లో ఆనందాలు నింపాలని కోరుకుంటూ, సద్గుణ సమాజ స్థాపనకు పూనుకుందాం, సమాజ శాంతికి గొడుగులు పడదాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## హోలికా దహనం, ప్రహ్లాదుడి రక్షణ

హిందూ పురాణశాస్త్రాల ప్రకారం ప్రహ్లాదుడు, హిరణ్యకశపుడి కథను మూలంగా తీసుకొని వివరించడం జరుగుతుంది. క్రూరత్వం కలిగిన హిరణ్యకశపుడనే రాక్షస రాజు తానే భగవంతుడినని, తనను మాత్రమే అందరు పూజించాలని ప్రజలపై ఒత్తిడి తెస్తాడు. అతని సుపుత్రుడైన ప్రహ్లాదుడు విష్ణు మూర్తి భక్తుడిగా జపం చేస్తూ, తండ్రి మాటలను పెడచెవిన పెడుతూ భగవాన్ విష్ణువు భక్తిలో మునిగి పోతాడు. తన కుమారుడిపై ఎంత ఒత్తిడి లేదా ఎన్ని బాధలు పెట్టినా విష్ణు జపం మానకుండా తండ్రి కోపానికి గురి అవుతాడు. హిరణ్యకశపుడి సోదరి హోలికాకు అగ్నిని తట్టుకునే ప్రత్యేక వరం ఉంటుంది. దానిని ఆసరాగా చేసుకొని ప్రహ్లాదుడిని తన ఒడిలో కూర్చోపెట్టుకొని మంటల్లో దిగాలని హిరణ్యకశపుడు కోరుతాడు. అలా ప్రహ్లాదుడితో పాటు హోలిక కూడా మంటల్లో కూర్చోవడంతో చెడు బుద్ధి ప్రదర్శించిన హోలికా ఆ మంటల్లో దహనం కావడం, సద్బుద్ధిగల విష్ణు భక్తుడైన ప్రహ్లాదుడు సురక్షితంగా బయట పడడం జరిగింది. అందు వల్ల హోలికా దహనం రోజున మంటల్లో హోలికా బొమ్మను కూడా దహనం చేస్తూ చెడును పారద్రోలడం ఒక సదాచారంగా వస్తున్నది





సూర్య
విజయవాడ
శుక్రవారం
14 మార్చి 2025
8
suryachitramagazine@gmail.com
సూర్య సినిమా

# 'కోర్ట్' ప్రిమియర్స్‌కి ఎక్స్‌లెంట్ రెస్పాన్స్

నాని వాల్ పోస్టర్ సినిమా ప్రెజెంట్ చేస్తున్న మూవీ 'కోర్ట్' - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ అలానే ప్రేమలో పాట కూడా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ప్రశంసలు అందుకున్నాయి. ప్రిమియర్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం మార్చి 14న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాతలు ప్రశాంతి తిపిర్నేని, దీప్తి గంటా



విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

దీప్తి కోర్టు జర్నీ ఎలా స్టార్ట్ అయింది ?
నాని, ప్రశాంతి గారు స్క్రిప్ట్ విని ఓకే చేశారు. నేను ఆన్సెట్ ప్రొడ్యూసర్ గా జాయిన్ అయ్యాను. నేను రోజు సెట్స్ లో వుండేదాన్ని. నాని, ప్రశాంతి నాకు చాలా ఫ్రీడమ్ ఇచ్చారు.

కథ విన్నాక మీకు ఎలా అనిపించింది?
నేను స్క్రిప్ట్ మొత్తం చదివాను. డైరెక్టర్ జగదీష్ చాలా బాగా రాసుకున్నాడు. చాలా లేయర్స్ వున్నాయి. అన్నీ బాగా కనెక్ట్ చేసుకున్నాడు. స్క్రీన్ ప్లే చాలా టైట్ గా ఉంటుంది. కథ నాకు చాలా నచ్చింది.

ప్రశాంతి వాల్ పోస్టర్ సినిమాలో కథ ఓకే అవ్వడం ఎలా వుంటుంది ?
నాని, నేను ఇద్దరం కథ వింటాం. అయితే మా నమ్మకం అంతా నాని గారి జడ్జిమెంట్ మీదే వుంటుంది. ఆన పెద్దగా లెక్కలేమీ వేయరు. ఒక కథ థియేటర్లో చూడాలనిపించేలా వుంటే ఓకే చేస్తారు.

ప్రశాంతి ప్రియర్స్ కి ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది ?
ప్రిమియర్స్ కి యునానిమస్ గా ఎక్స్ లెంట్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ అఫ్ చూసి 'వావ్' అన్నారు. సెకండ్ హాఫ్ కోసం ఈగర్ గా వెయిట్ చేశారు. సెకండ్ హాఫ్ లోని హైలెట్స్ కూడా ఆడియన్స్ కి చాలా నచ్చాయి. రెస్పాన్స్ చాలా బావుంది. మేము అనుకున్నదాని కంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇలాంటి జోనర్ సినిమాని ఆడియన్స్ ఆదరించి బిగ్ సక్సెస్ చేయడం చాలా ఆనందంగా అనిపిస్తోంది. ఈ సక్సెస్ ని ఎంజాయ్ చేస్తున్నాం. ప్రిమియర్స్ కి కొందరు లాయర్స్ కూడా వచ్చారు. వారికి చాలా నచ్చింది. ఒక కోర్ట్ రూమ్ డ్రామాని ఇంత నేచురల్ ప్రజెంట్ చేయడం ఇంతముందు చూడలేదని చెప్పారు. ఇది మాకు మంచి కాంప్లీమెంట్.


దీప్తి మీకు ఇందులో నచ్చిన పాయింట్స్ ఏమిటి ?
చాలా పాయింట్స్ వున్నాయి. రోహిణి క్యారెక్టర్ తో వచ్చే ఓ సీన్ చాలా నచ్చింది. అలాగే మంగపతి క్యారెక్టర్ లో శివాజీ గారు అద్భుతంగా చేశారు. ప్రతి ఇంట్లో అలాంటి ఓ క్యారెక్టర్ వుంటుంది.

డైరెక్టర్ జగదీశ్ గురించి?
డైరెక్టర్ జగదీశ్ ఈ సినిమాని చాలా రీసెర్చ్ చేసి రాశాడు. అందుకే సినిమా చాలా నేచురల్ గా వచ్చింది. పోక్సో చట్టం గురించి ఆయన చాలా డీటెయిల్ ప్రజెంట్ చేశాడు.

హిట్ 3 స్టేక్స్ చాలా పెద్దవి.. కానీ నాని గారు కోర్టు నచ్చకపోతే హిట్ 3 చూడొద్దని చెప్పడం ఎలా అనిపించింది ?
మాకు షాకే. నేను ప్రశాంతి డైరెక్టర్ శైలేష్ వంక చూశాం.(నవ్వుతూ) తనకి నమ్మకం వుంది కాబట్టే ఆ మాటని కాన్ఫిడెంట్ గా చెప్పారు.

ఈ సినిమా కోసం ఎక్కడ ఎక్కువ స్పెండ్ చేశారు ?
సెట్స్ పరంగా ఎక్కువ స్పెండ్ చేయలేదు కానీ ఈ కథకు మంచి యాక్టర్స్ కావాలి. ఆ విషయంలో రాజీ పడలేదు. ప్రియదర్శి తో పాటు రోహిణీ, సాయి కుమార్, శివాజీ, హర్ష వర్ధన్ .. ఇలా మంచి యాక్టర్స్ వున్నారు. రోషన్ శ్రీదేవి కూడా వారి పాత్రలకు పర్ఫెక్ట్ గా ఫిట్ అయ్యారు.


# 'భద్రకాళి' నుంచి పవర్ ఫుల్ టీజర్



హీరోగా, నిర్మాతగా, లిరిసిస్ట్‌గా, దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా, ఎడిటర్‌గా ఇలా అన్ని రకాలుగా సత్తా చాటుకున్నారు విజయ్ ఆంటోనీ. ఆయన ప్రస్తుతం తన కెరీర్‌లో ప్రతిష్టాత్మకమైన 25వ చిత్రం 'భద్రకాళి'తో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని సమర్పణలో అరుణ్‌ప్రభు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తు న్నారు. తాజాగా భద్రకాళి సినిమాకు సంబం ధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. 'పిల్లి కూడా ఒక రోజు పులి అవును.. అబద్ధం, అహంకారం అంతం అవును'.. అంటూ ప్రారంభమైన ఈ టీజర్‌లో విజయ్ ఆంటోని అసలు ఏ పాత్రను పోషిస్తున్నాడో అర్థం కాకుండా ఉంది. ఒకసారి ఫ్యామిలీ మెన్‌లా కనిపిస్తున్నారు.. మరోసారి గ్యాంగ్ స్టర్‌లా అనిపిస్తున్నారు.. ఇంకో సందర్భంలో ఉన్నతాధికారిలా కనిపిస్తున్నారు.. అసలు ఈ కిట్టు ఎవరు? అనే ఆసక్తిని రేకెత్తించేలా భద్రకాళి టీజర్‌ను కట్ చేశారు. 190 కోట్ల కుంభకోణం చుట్టూ కథ తిరిగేలా ఉంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే అంటూ చివర్లో వచ్చిన డైలాగ్‌తో టీజర్ మీద మరింత ఆసక్తిని పెంచేసినట్టు అయింది. విజయ్‌ఆంటోని ఈ చిత్రంలో ఇది వరకు ఎన్నడూ కనిపించినంత స్టైలిష్‌గా, యాక్షన్ హీరోగా కనిపి స్తున్నారు. ఈ సినిమాకు విజయ్ ఆంటోని సంగీతాన్ని కూడా అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ షెల్లీ కాలిస్ట్ విజువల్స్ ఈ టీజర్‌లో అద్భుతంగా అనిపిస్తున్నాయి. విజయ్ ఆంటోనీ ఆర్‌ఆర్, రేమండ్ డెరిక్ క్రాస్టా ఎడిటింగ్, రాజశేఖర్ కంపోజ్ చేసిన ఫైట్స్ ఈ టీజర్‌లో హైలెట్ అవుతున్నాయి.

# 'ఛాంపియన్' నుంచి రోషన్ బర్త్ డే గ్లింప్స్

యంగ్ హీరో రోషన్, నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతంతో కలిసి పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'మూవీ చేస్తున్నారు . ఈ చిత్రాన్ని స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సంచలనం సృష్టించింది. రోషన్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. గ్లింప్స్ రోషన్‌ను స్ట్రాంగ్ విల్ పవర్ తో వున్న ఇంటెన్స్ ఫుట్‌బాల్ ఆటగాడిగా పరిచయం చేస్తుంది. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడం ఆకట్టుకుంది. అతని పాత్ర ప్రయాణం మైదానంలో, జీవితంలో నిజమైన ఛాంపియన్‌గా ఎదగడానికి చేసే పోరాటంగా ఉండబోతోంది. గ్లింప్స్‌లో రోషన్ తన పొడ వాటి జుట్టు, గడ్డంతో అద్భుతంగా కనిపించాడు. అతని



స్ట్రాంగ్ ప్రజెన్స్, ఫిజికల్ స్టంట్స్ అడ్వంచరస్‌గా వున్నాయి. ఛాంపియన్ ధైర్యం, దృఢ సంకల్పంతో నిండిన బ్రెత్ టేకింగ్ యాక్షన్ సన్నివేశాలను అందిస్తుందని సూచిస్తుంది. స్వాతంత్ర్యానికి పూర్వం నాటి ఎసెన్స్‌ని ప్రజెంట్ చేస్తూ ఆర్. మాధీ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ఈ గ్లింప్స్‌కు మరింత ఆకర్షణను పెంచుతుంది. మిక్కీ జె. మేయర్ అందించిన అద్భుతమైన నేపథ్య సంగీతం మరో హైలెట్ గా నిలిచింది. అద్భుతమైన విజువల్స్, ఆకట్టుకునే క్యారెక్టర్ డెవలాప్మెంట్, యాక్షన్-ప్యాక్డ్ నెరేటివ్ తో, ఛాంపియన్ ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది.

# ట్రెండ్ సెట్ చేసిన మహేష్

రిలీజ్ కు ముందు హిట్ కొడుతున్నామని సవాల్ విసరడం అంత సులభం కాదు. కంటెంట్ పై ఎంతో నమ్మకం ఉంటే తప్ప సాధ్యం కానిది. అయితే ఈ మధ్య కాలంలో అలాంటి సవాళ్లు ఎక్కువ అవుతున్నాయి. వాళ్ల నమ్మకం కూడా అంతే బలంగా నిలబడుతుంది. ఇటీవలే నేచురల్ స్టార్ నాని కోర్టు సినిమా నచ్చక పోతే తాను నటిస్తోన్న హిట్ -3 చిత్రాన్ని చూడొద్దని పబ్లిక్ గానే చెప్పాడు. ఆ విషయంలో నాని ప్రూవ్ చేసుకున్నాడు. ఈ సినిమాకు మంచి రివ్యూలు వచ్చాయి. విమర్శకుల ప్రశంసలు దక్కాయి. దీంతో ప్రీమియర్ల జోరు ఊపందుకుంది. అలాగే కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన దిల్ రూబ కూడా ఇదే రోజున రిలీజ్ అయింది. ఈ సినిమా కంటెంట్ విషయంలో డైరెక్టర్ కాన్ఫిడెన్స్ మాటల్లోనే కనిపిస్తుంది. సినిమాలో హీరో ఫైట్స్ నచ్చకపోతే సినిమా రిలీజ్ అయిన మధ్యాహ్నం ఇంటికొచ్చి మరీ తన్నమని సవాల్ విసిరాడు. మరేం జరుగుతుందన్నది చూడాలి. అలాగే మార్చి 28న నితిన్ హీరోగా నటించిన రాబిన్ హుడ్ రిలీజ్ అవుతుంది. రాబిన్ హుడ్‌లో పాత్రలు గుర్తుండకపోతే గనుక పేరు మార్చుకుంటానని నటకిరీటీ రాజేంద్ర ప్రసాద్ కూడా సవాల్ విసిరారు. నితిన్‌కి సరైన సక్సెస్ పడి చాలా కాలమవుతుంది. ఈ నేపథ్యంలో విజయంపై అతడు కూడా ధీమాగానే ఉన్నాడు. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తోన్న చిత్రమిది. ఇంత వరకూ ఇతడికి వైఫల్యం ఎదురు కాలేదు. ఈ నేపథ్యంలో సక్సెస్ కొడుతుందనే అంచనాలు బలంగా ఉన్నాయి. అలాగే పాగల్ సినిమా సమయంలో విశ్వక్ సేన్ కూడా ఇలాగే సవాల్ విసిరాడు. కానీ సినిమా సరిగ్గా ఆడలేదు. మ్యాడ్ స్క్వేర్ కూడా మార్చి 28న రిలీజ్ అవుతుంది. మ్యాడ్ భారీ విజయం సాధించిన నేప థ్యంలో స్క్వేర్ పై కూడా మంచి అంచనాలున్నాయి. ఈ సినిమా చూసి ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకోకపోతే టికెట్ డబ్బులు రిటర్న్ ఇస్తానని నిర్మాత నాగవంశీ సవాల్ విసిరారు. లాజిక్కులు వెతకకుండా ప్రేక్షకులు రెండున్న ర గంటలు ఎంజాయ్ చేసే చిత్రమిదని ధీమా వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.



# ఆర్.సి.16 లుక్ వైరల్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న స్పోర్ట్స్ డ్రామా పై అందరికీ భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, ప్రస్తుతం రామ్ చరణ్ లుక్ కు సంబంధించిన ఫోటో ఒకటి సోషల్ మీడియాలోకి వచ్చింది. ఈ ఫోటోలో చరణ్ వైట్ టీ షర్ట్ పై బ్లాక్ కలర్ స్వెట్ షర్ట్ వేసుకుని, నల్ల కళ్లద్దాలు ధరించి, స్టైల్ గా టోపీ పెట్టుకుని గుబురు కడ్డంతో ఎంతో కూల్‌గా కనిపిస్తున్నాడు. చరణ్



లుక్ ను చూసి ఫ్యాన్స్ తెగ సంబరపడిపోతున్నారు. వీటన్నింటి కంటే భిన్నంగా ఫోటోలో ఉన్న చిన్నపిల్లాడిని చరణ్ తన దగ్గరకు తీసుకుని మరీ ఫోటోకు పోజివ్వడం అందరినీ స్పెషల్ గా ఎట్రాక్ట్ చేస్తుంది. ఈ ఫోటోలో ఉన్న బాబు మరెవరో కాదు, బిగ్ బాస్ కంటెస్టెంట్ విశ్వ కొడుకే. గత కొన్నాళ్లుగా హైదరాబాద్ లో జరుగుతున్న ఆర్సీ16లో విశ్వ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. రీసెంట్ గా విశ్వ తన ఫ్యామిలీని సెట్స్ కు తీసుకెళ్లి ఫ్రీ టైమ్ లో రామ్ చరణ్ ను కలిసి ఫోటో దిగి ఆ ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఫ్యాన్ బాయ్ మూమెంట్ అని పోస్ట్ చేశాడు. ఇక ఆర్సీ16 విషయానికొస్తే ఈ సినిమాలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే చరణ్ కు మరో రెండు వారాల్లో 40 ఏళ్లు నిండనున్నాయి. మెగా ఫ్యాన్స్ చరణ్ బర్త్ డే కు సంబంధించిన ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. చరణ్ బర్త్ డే సందర్భంగా అతని బ్లాక్ బస్టర్ సినిమా నాయక్ ను 4కె లో రీరిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే.

# అన్ని ఎమోషన్స్ ఉన్న కంప్లీట్ ప్యాకేజ్ "దిల్ రూబా"

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "దిల్ రూబా". ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తోంది. "దిల్ రూబా" చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. "దిల్ రూబా" సినిమా ఈనెల 14న హెూలీ




పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా రిలీజ్ క్యూ అండ్ ఏ ప్రెస్ మీట్ హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ - "దిల్ రూబా" సినిమా గురించి వీలైనంతగా మిమ్మల్ని కలిసి చెబుతూ వస్తున్నాం. ప్రీమియర్స్ పడుతున్నాయి. సినిమా స్క్రీన్స్ మీదకు వచ్చే ముందు మరోసారి మా సినిమా గురించి మాట్లాడాలని మీ ముందుకు వచ్చాం. "దిల్ రూబా" సినిమా ఫస్ట్ 30 మినిట్స్ సరదగా వెళ్తూ ఆ ముప్పై నిమిషాల తర్వాత కథలోకి తీసుకెళ్తుంది. ఈ కథలో ప్రేమ ఒక్కటే కాదు స్నేహం, ఫాదర్ సన్, ఫాదర్ డాటర్ రిలేషన్..ఇలా అన్ని ఎమోషన్స్ ఉంటాయి. ఎక్స్ లవర్ మళ్లీ ఆ ప్రేమికుడి జీవితంలోకి వచ్చి అతని ప్రెజెంట్ లవ్ ను కలిపే ప్రయత్నం చేయడం అనేది "దిల్ రూబా"లో కొత్తగా ఉంటుంది. మాజీ ప్రేయసి, ప్రేమికుడు అంటే శత్రువులా చూడాల్సిన పనిలేదు. వారితోనూ స్నేహాన్ని కొనసాగించవచ్చు అనే ఫీల్ గుడ్ ఎలిమెంట్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. మీరు మీ ఫ్యామిలీతో వచ్చి హాయిగా ఈ సినిమా చూడొచ్చు. ఎలాంటి ఇబ్బందికర డైలాగ్స్, సన్నివేశాలు ఉండవు. ఈ మూవీలో నటించిన తర్వాత నటుడిగా ఇంకాస్త పరిణితి సాధించా అనిపించింది. ఫైట్స్ విషయంలో చాలా సంతృప్తిగా ఉన్నాను. ఇంటర్వెల్ బ్యాంగ్ లో వచ్చే లెంగ్తీ ఫైట్ సీక్వెన్స్ కోసం చాలా కష్టపడ్డాను. మంగళూరులో హాట్ సమ్మర్ లో ఆ సీక్వెన్స్ ఎనిమిది రోజుల పాటు చేశాం. ఆ ఫైట్ మీకు బాగా నచ్చుతుంది. దిల్ రూబా థియేటర్స్ లో చూసి మీ రెస్పాన్స్ తెలియజేస్తారని వేచి చూస్తున్నాం అన్నారు.

# పెళ్లి కాని ప్రసాద్

## హైలీ ఎంటర్‌టైనింగ్ ట్రైలర్

సప్తగిరి హెూల్సమ్ ఎంటర్ టైనర్ 'పెళ్లి కాని ప్రసాద్' మార్చి 21న థియేటర్లలోకి రానుంది. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం హ్యూమర్ , సోషల్ కామెంటరీ బ్లెండ్ తో పర్ఫెక్ట్ ఎంటర్ టైనర్ గా ఉండబోతోంది. థామ మీడియా ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై విజన్ గ్రూప్ కె.వై. బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్,



వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పి స్తోంది. దిల్ రాజు నేతృత్వంలోని ప్రముఖ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తోంది. మూవీ థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ప్రసాద్ కి 36 ఏళ్ళు దాటుతాయి. పెళ్లి గురించి మరింత ఆందోళన చెందుతాడు. అతను ఏజ్ బార్‌గా భావిస్తున్నప్పటికీ, కాలక్రమేణా ఎక్కువ అనుభవం వస్తుందని అతని తండ్రి అతనికి భరోసా ఇస్తాడు. అయినప్పటికీ, ఇంకేదైనా ఆలస్యం జరిగితే ఇక అవకాశం వుండదని ప్రసాద్ భయపడతాడు. మరోవైపు, హీరోయిన్ కుటుంబం తనకు మద్దతు ఇవ్వడమే కాకుండా, తన మొత్తం కుటుంబాన్ని పోషించగల వరుడి కోసం వెతుకుతోంది. వీరిని విధి ఒకచోట చేర్చుతుందా? అనేది ట్రైలర్ లో చాలా ఎక్సయిటింగ్ అండ్ హిలేరియస్ గా ప్రజెంట్ చేశారు. పెళ్లి కాని ప్రసాద్ టైటిల్ పాత్రలో సప్తగిరి తన హ్యూమరస్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నాడు. ప్రియాంక శర్మకు మంచి పాత్ర లభించింది.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044